Postel No. MBN/08/2016-2018




పురాతనమైన సమస్తరోగాలకు
ఆయుర్వేద చికిత్స
మూల వ్యాధి, తెల్లమచ్చలు,చర్మవ్యాధులతోపాటు అన్ని రకాల రోగాలకు వనమూలికలతో వైద్యచేయబడును.
శ్రీ దత్తత్రిలింగేశ్వరాలయము
నారాయణపేట రోడు,ఊట్కూర్‌మండలం
మహబూబ్‌నగర్ జిల్లా సెల్ 9640418895



# వార్తాతరంగాలు

జాతీయ తెలుగు దిన పత్రిక

website: www.vaarthatarangalu.com email:vtarangalu.222208@gmail.com

Published from mahabub nagar సంపుటి :24 సంచిక :107 సంపాదకులు: కోటకొండ ఎడ్ల విజయరాజు మంగళవారం 05 ఆగస్టు 2025 పేజీలు :12 వేల రూ5 /-


## కాళేశ్వరం ప్రాజెక్టుకు గత కేబినెట్ అనుమతులు ఉన్నాయనడం అవాస్తవం

**బిఆర్‌ఎస్ నేతలు ఇంకెంతకాలం ప్రజలను మభ్య పెడతారు:మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

**హైదరాబాద్ ఆగష్టు 5:** కాళేశ్వరం ప్రాజెక్టుకు గత కేబినెట్ అనుమతులు ఉన్నాయనడం అవాస్తవం అని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. బిఆర్‌ఎస్ నేతలు ఇంకెంతకాలం ప్రజలను మభ్య పెడతారని అన్నారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ.. మాజీ సిఎం కెసిఆర్, మాజీ మంత్రి హరీష్ రావు ఏం చేశారన్నది కమిషన్ నివేదికలో స్పష్టంగా ఉందని తెలియజేశారు. బిఆర్ ఎస్ నేతలు కంగారుపడొద్దని అన్ని వివరాలు అసెంబ్లీ ముందు ఉంచుతామని చెప్పారు. కమిషన్ నివేదికపై అసెంబ్లీలో చర్చ తర్వాత నిర్ణయం తీసుకుంటామని సూచించారు. కాళేశ్వరం పేరుతో కెసిఆర్ డబ్బు దోచుకున్నారని ముందే చెప్పామని అన్నారు. పిసి ఘోష్ నివేదికలో అన్నీ వివరంగా ఉన్నాయని, దోచుకున్న డబ్బుతో మళ్లీ బిఆర్‌ఎస్ నేతలు జనంలోకి వస్తారని పేర్కొన్నారు. డబ్బు తీసుకుని



బిఆర్‌ఎస్ చెంపలు చెళ్లుమనిపించాలని పొంగులేటి స్పష్టం చేశారు.

## జూనియర్లకు మంత్రిపదవిచ్చారు-నాకివ్వలేదు..

ఎమ్మెల్యే కోమటిరెడ్డి

**నల్లగొండ:**మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేసారు. నేను పదవుల కోసం పాకులాడే వ్యక్తిని కాదు. నాకు పదవులు కాదు, ప్రజలు ముఖ్యమని అన్నారు. ఎల్బీ నగర్ నుంచి పోటీచేస్తే మంత్రి పదవి వచ్చేది.. అయినా మునుగోడు ప్రజలే ముఖ్యమని ఇక్కడ పోటీచేశానని అన్నారు. వేల కోట్లు దోచుకునే వాడికి పదవులు కావాలి. అప్పుడు..మంత్రి పదవి ఇస్తా అంటేనే కాంగ్రెస్ లోకి బ్యాక్ అయ్యా. జూనియర్ లకు మంత్రి పదవి ఇచ్చి.. నన్ను దూరం పెట్టారు. ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి అనేది వాళ్ళ విజ్ఞత. మునుగోడు అభివృద్ధి మాత్రం నా బాధ్యత. పదవుల కోసం దిగజారి కాళ్లు పట్టుకునే నైజం నాది కాదు. వేల కోట్లు దోచుకునే వాడికి పదవులు కావాలి, నాకెందుకు పదవులు. మంత్రి పదవి కావాలా..? మునుగోడు ప్రజలు కావాలా..? అంటే మునుగోడు ప్రజలే కావాలని చెబుతానని అన్నారు.ప్రజల కోసం మరోసారి పదవి త్యాగానికైనా రెడీ.. బీఆర్‌ఎస్ హయంలో రాజీనామా చేసి ప్రభుత్వాన్ని మునుగోడు ప్రజల కాళ్ళ దగ్గరికి తెచ్చా. ప్రజల కోసం మళ్ళీ రాజీనామాకైనా రెడీ అని అన్నారు. ..

## ఖరీఫ్ సీజన్-2025-రెగ్యులర్‌లో తెలంగాణ రాష్ట్రానికి తగినంత యూరియా సరఫరా చేయండి

**కేంద్ర మంత్రి జె.పి. నడ్డా కు భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి వినతి పత్రం**

**హైదరాబాద్ (న్యూ ఢిల్లీ) ఆగస్టు 5:**బీఖరీఫ్ సీజన్-2025-రెగ్యులర్‌లో తెలంగాణ రాష్ట్రానికి యూరియా సరఫరా చేయాలని కోరుతూ కేంద్ర రసాయనాలు మరియు ఎరువుల మంత్రి జె.పి. నడ్డా కు భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి వినతి పత్రం సమర్పించారు.2025 ఖరీఫ్ సీజన్ కోసం తెలంగాణ రాష్ట్రానికి కేటాయించిన యూరియాను సరఫరా చేయవలసిన అవసరం గురించి ఆయన మంత్రి దృష్టికి తెసుకేల్లారు. ఈ విషయంలో, 2025 ఖరీఫ్ సీజన్‌లో రాష్ట్రానికి కేటాయించిన మొత్తం యూరియా పరిమాణం 9.80 లక్షల మెట్రిక్ టన్నులు (%ామీ%), అయితే, జూలై 31, 2025 నాటికి, ఏప్రిల్ నుండి జూలై వరకు మొత్తం 6.60 %ామీ% కేటాయింపులకు బదులుగా 4.36 %ామీ% యూరియా మాత్రమే సరఫరా చేయబడిందని పేర్కొన్నారు. దీని ఫలితంగా 2.24 %ామీ% కొరత ఏర్పడింది.అంతేకాకుండా, ఆగస్టు నెలలో వాస్తవ అవసరం దాదాపు 3.50 %ామీ% కానీ కేవలం 1.70 %ామీ% మాత్రమే కేటాయించబడింది మరియు ఈ పరిస్థితి కారణంగా, రైతులు తమ వాస్తవ డిమాండ్లను తీర్చుకోవడానికి చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. అలాగే రాష్ట్రానికి యూరియా కేటాయింపు మరియు సరఫరాలో విస్తృత అంతరం ఉంది మరియు పత్తి, మొక్కజొన్న మరియు వరి వంటి పంటలు ఎక్కువగా ప్రభావితమయ్యాయి.తెలంగాణ రాష్ట్ర గౌరవ ముఖ్యమంత్రి శ్రీ ఎనుముల రేవంత్ రెడ్డి గారు ఇటీవలే మిమ్మల్ని కలిసి ఈ కొరత సమస్యపై మీ దృష్టిని తిసుకొచ్చారు, మరియు పీక్ సీజన్‌లో యూరియా కొరత కారణంగా రాష్ట్రంలోని రైతులు ఎదుర్కొంటున్న



ఇబ్బందులను వివరించారు. ఇది రైతులకు గణనీయమైన సవాళ్లను కలిగిస్తోంది. రాష్ట్రంలో అవసరమైన యూరియా సరఫరా కోసం వారు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.ఈ విషయంలో, కేటాయించిన యూరియా సరఫరా చేయకపోవడం వల్ల తెలంగాణ మాత్రమే కాకుండా ఆంధ్రప్రదేశ్, కర్ణాటక వంటి రాష్ట్రాల రైతులు కూడా ఒత్తిడికి గురవుతున్నారని తెలిసింది.అందువల్ల, రాష్ట్రంలో నెలకొన్న క్లిష్ట పరిస్థితుల దృష్ట్యా, ఫిబ్రవరి 17, 2025 నాటి ఎరువుల కేటాయింపు లేఖ ప్రకారం రైతుల వాస్తవ డిమాండ్లను తీర్చడానికి తెలంగాణ రాష్ట్రానికి తగినంత యూరియా సరఫరాను ఏర్పాటు చేయాలని అబ్యర్థించారు.

## రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ క్రమంగా విస్తరిస్తోంది

**బీఆర్ఎస్ నాయకుడు నల్ల మనోహర్ రెడ్డి ఆద్వర్యం లో 300 మంది బిజెపి లో చేరిక**

**బిజెపి ఉద్యమాల ఫలితాలతోనే పార్టీ అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ**

**కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇబ్బందులు ఎదుర్కొంటున్న విద్యార్థులు, నిరుద్యోగులు, మహిళలు, రైతులు**

**ఇప్పుడు ప్రజలు బిజెపి ని అధికారంలోకి తీసుకురావడానికి సిద్ధంగా ఉన్నారు**

**బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు**

**హైదరాబాద్(పెద్దపల్లి) ఆగస్టు 5:** పెద్దపల్లి జిల్లా విస్తృత స్థాయి కార్యకర్తల సమావేశంలో భాగంగా, బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు సమక్షంలో, బీఆర్ఎస్ కు చెందిన నాయకుడు నల్ల మనోహర్ రెడ్డి గారు.. తన అనుచరులతో పాటు కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన 300 మంది కార్యకర్తలతో కలిసి బిజెపిలో చేరారు.పార్టీలో చేరిన వారికి రాంచందర్ రావు కండువా కప్పి బిజెపి పాఎర్తి లోకి ఆహ్వానించారు.ఈ సందర్భంగా ఎన్. రాంచందర్ రావు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా బీజేపీ క్రమంగా విస్తరిస్తోంది.ప్రజలు ఇప్పటికే బీఆర్ఎస్ అవినీతి పాలనను చూసారు. కాంగ్రెస్ పార్టీ ప్రజావ్యతిరేక పాలనను కూడా చూశారు. ఇప్పుడు భారతీయ జనతా పార్టీకి ఒక్క అవకాశం ఇవ్వాలని భావిస్తున్నారు.కాంగ్రెస్ పార్టీ ఎప్పుడూ ప్రజల కోసం పనిచేయలేదు. ప్రజా సమస్యలపై పోరాటాలు చేయలేదు. గతంలో బిజెపి మాజీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ నాయకత్వంలో మాత్రమే బిజెపి ప్రజల సమస్యలపై ఉద్యమాలు చేసింది.గత బీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా బిజెపి నిరంతరం పోరాటం చేసింది. కానీ ఆ పోరాటాల ఫలితాలను కాంగ్రెస్ పార్టీ పొంది, ఆ పార్టీ అధికారంలోకి వచ్చింది.ఇప్పుడు ప్రజలు బిజెపి ని అధికారంలోకి తీసుకురావడానికి సిద్ధంగా ఉన్నారు.కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యార్థులు, నిరుద్యోగులు, యువత, మహిళలు, రైతులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. తీవ్రమైన యాతన అనుభవిస్తున్నారు.పెద్దపల్లి జిల్లాలో వ్యవసాయం చేసేవారు అధికంగా ఉన్నారు.కేంద్ర ప్రభుత్వం అవసరానికి మించిన ఎరువులను రాష్ట్రానికి అందిస్తోంది. ఎక్కడా ఎరువుల కొరత లేదు.2024%-%25 రబీ సీజన్‌లో రాష్ట్రానికి అవసరమైన యూరియా పరిమాణం 9.80 లక్షల మెట్రిక్ టన్నులు కాగా, కేంద్రం 12.47 లక్షల మెట్రిక్ టన్నులు సరఫరా చేసింది. అంటే అవసరానికి మించి అధికంగా ఇచ్చింది.అయినా కూడా రాష్ట్రంలో ఎరువులు బ్లాక్ మార్కెట్‌కి చేరుతున్నాయి. ఇది పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ నిర్వాకం వల్ల జరుగుతోంది.ఎరువుల దుకాణాలపై రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి నియంత్రణ లేదు. మానిటరింగ్ లేకపోవడం, వ్యవసాయ శాఖ అలసత్వం, బ్లాక్ మార్కెట్ నిరోధించడంలో విఫలమవడం ప్రధాన కారణాలు.బ్లాక్ మార్కెట్‌కు ప్రోత్సాహం ఇస్తూ దళారులకు సహకారం అందిస్తోంది రాష్ట్ర ప్రభుత్వం.రైతులకు యూరియా కొరత



తీరేందుకు రూ. 6300 కోట్ల వ్యయంతో కేంద్రం రామగుండం ఎరువుల కర్మాగారాన్ని పునఃప్రారంభించింది.పెద్దపల్లి నియోజకవర్గానికి దాదాపు రూ. 20 వేల కోట్ల అభివృద్ధి పనులను కేంద్ర ప్రభుత్వం చేపట్టింది. ఆగస్టు 2న పీఎం కిసాన్ 20వ విడత నిధులుగా దేశవ్యాప్తంగా 9.7 కోట్ల మంది రైతుల ఖాతాల్లోకి రూ. 20,500 కోట్లు నేరుగా జమచేయడం జరిగింది.ఎన్టీపీసీ ద్వారా 2600 మెగావాట్లతో పాటు ఫ్లోటింగ్ సోలార్ ప్లాంట్ల ద్వారా 4310 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి జరుగుతోంది. తెలంగాణ సూపర్ థర్మల్ పవర్ ప్రాజెక్ట్ నిర్మాణాన్ని పూర్తి చేసిన ఘనత కూడా మోదీ ప్రభుత్వానిదే.కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో పెద్దపల్లి జిల్లాను వేలకోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తామని చెప్పింది. కానీ గత 19 నెలల పాలనలో ఈ జిల్లాను పూర్తిగా విస్మరించింది.

## ఉచిత మంచినీటి పథకాన్ని ముట్టుకుంటే ముఖ్యమంత్రి మసే..!.

**రైతులకు సాగునీ ఇవ్వలేని ఈ దద్దమ్మ సర్కారు**

**ఇది ముఖ్యమంత్రి మూర?త్వానికి పరాకాష్ట**

**బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శ**

**హైదరాబాద్ ఆగష్టు 5:** హైదరాబాద్ వాసులకు కేసీఆర్ అందించిన ఉచిత మంచినీటి పథకాన్ని ముట్టుకుంటే ముఖ్యమంత్రి మసే..!. నని రైతులకు సాగునీ ఇవ్వలేని ఈ దద్దమ్మ సర్కారు.. ఇప్పుడు హైదరాబాద్‌లో ఉచిత తాగునీటి పథకానికి కూడా పాతరేయాలని చూడటం ముఖ్యమంత్రి మూర?త్వానికి పరాకాష్ట అని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. మహానగరంలోని కోటి 20 లక్షల మంది ప్రజలు చరిత్రలో కాంగ్రెస్ పార్టీని, సీఎం రేవంత్‌ను క్షమించరన్నారు. ఇప్పటికే హైడ్రా వంటి దిక్కుమాలిన నిర్ణయాలతో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీశారని ఎక్స్ వేదికగా ఆగ్రహం వ్యక్తం చేశారు.' 20 నెలలు కావస్తున్నా.. ఇచ్చిన 420 హామీలు అమలు చేయలేక ఇప్పటికే చేతులెత్తేసిన రేవంత్ రెడ్డి మహాపాపాన్ని మూటగట్టుకున్నారు. బీఆర్‌ఎస్ అమలు చేసిన పథకాలకు కూడా ఉరివేస్తే.. మహానగరంలోని కోటి 20 లక్షల మంది ప్రజలు చరిత్రలో కాంగ్రెస్ పార్టీని, సీఎం రేవంత్‌ను క్షమించరు. రైతులకు సాగునీరు ఇవ్వలేని ఈ దద్దమ్మ సర్కారు, ఇప్పుడు హైదరాబాద్ లో ఉచిత తాగునీటి పథకానికి కూడా పాతరేయాలని చూడటం ముఖ్యమంత్రి మూర?త్వానికి పరాకాష్ట.ఇప్పటికే హైడ్రా వంటి దిక్కుమాలిన నిర్ణయాలతో హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను దెబ్బతీసి తీరని నష్టాన్ని కలిగించారు. బీఆర్‌ఎస్ ప్రగతి ప్రస్థానంలో రెప్పపాటు కూడా కరెంటు కోతలు లేని రాజధాని వాసులకు మళ్లీ కరెంట్ కష్టాలను పరిచయం చేసిన పాపం రేవంత్‌దే. ఓవైపు అస్తవ్యస్తంగా మారిన డ్రైనేజీ వ్యవస్థ, ఇంకోవైపు వర్షాలకు దెబ్బతిన్న రోడ్లతో ప్రజలు అవస్థలు పడుతుంటే.. ఫ్రీ వాటర్ స్కీమ్‌ను కూడా గండికొట్టాలని చూస్తున్న రేవంత్‌కు కర్రు గాల్చి పెట్టేందుకు హైదరాబాద్ ప్రజలు సిద్ధంగా ఉన్నారు' అని కేటీఆర్ ట్వీట్ చేశారు.



## నిజమైన భారతీయుడిని తేల్చేది జడ్జీలు కాదు..

ప్రియాంకా గాంధీ

**న్యూఢిల్లీ ఆగస్టు 5:** నిజమైన భారతీయుడిని తేల్చేది జడ్జీలు కాదు అని రాహుల్ గాంధి సోదరి ప్రియాంకా గాంధీ స్పందించారు. చైనా మన భూభాగాన్ని ఆక్రమించినట్లు రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై సోమవారం సుప్రీంకోర్టు సీరియస్ అయిన విషయం తెలిసిందే. నిజమైన భారతీయులు అలా మాట్లాడరు అని కోర్టు ఆ కేసులో పేర్కొన్నది. కోర్టు చేసిన వ్యాఖ్యలను ఆమె ఖండించారు. ఇవాళ పార్లమెంట్ ఆవరణలో అడిగిన ఓ ప్రశ్నకు ఆమె బదులిస్తూ రాహుల్‌ను సమర్థించారు. ప్రశ్నలు వేయడం, ప్రభుత్వాన్ని నిలదీయడం ప్రతిపక్ష నేత విధి అని ఆమె అన్నారు. నిజమైన భారతీయులు కాదా అన్న స్టేట్మెంట్‌పై మాట్లాడుతూ.. న్యాయ వ్యవస్థ పట్ల పూర్తి గౌరవం ఉందని, రాహుల్ గాంధీ సైన్యాన్ని, సైనికులను ఎల్లప్పుడూ గౌరవించారని ఆమె పేర్కొన్నారు.



## కాళేశ్వరానికి కేంద్రమే అనుమతులు

**హైదరాబాద్, ఆగస్టు 5:**కాళేశ్వరం ప్రాజెక్టుపై పీసీ ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదిక నిజమైతే.. తెలంగాణ ప్రభుత్వం తప్పుపడుతున్న బీఆర్‌ఎస్ నేతలను కాదని, కేంద్ర ప్రభుత్వాన్ని అని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు అనుమతి ఇచ్చింది కేంద్ర ప్రభుత్వం అని.. కేంద్ర వాటర్ కమిషన్, ఇంజినీర్లను తప్పుపట్టినట్లేనని స్పష్టం చేశారు. కమిషన్ ఒకవైపు నిలబడి రిపోర్ట్ ఇచ్చినట్లు కనిపిస్తుందని, అది బేస్ లెస్ గా ఉందన్నారు. రైతులకు నీళ్లు ఇవ్వాలని కేసీఆర్ బీఆర్‌ఎస్ ప్రభుత్వం బాధ్యతగా తీసుకుంటే రాజకీయ జోక్యం అని చెప్పడం హాస్యాస్పదంగా ఉందన్నారు.తెలంగాణ ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టు రిపోర్ట్ లీకులు, చేసిన ఆరోపణలపై స్పందించిన మాజీ మంత్రి హరీష్ రావు తెలంగాణ భవన్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. గతంలో ఎన్నో కమిషన్లు రిపోర్టులు ఇచ్చినా అవి న్యాయస్థానంలో నిలబడలేదు. మాజీ ప్రధాని ఇందిరా గాంధీ మీద అప్పటి జనతా ప్రభుత్వం వేసిన షా కమిషన్, చంద్రబాబు మీద కమిషన్లు వేశారు. కానీ ఏ కమిషన్ కోర్టుల్లో నిలబడవు. ఎప్పటికైనా సత్యం, ధర్మమే గెలుస్తుంది. తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు రేవంత్ రెడ్డి డ్రామాలు ఆడుతున్నారు. అంతా గమనిస్తే సీరియల్స్ గా వ్యవహారం ఉంది. ఫేమస్ సీరియస్ కార్తీకదీపం, దాని తరువాత గుడి గంటలు, బ్రహ్మముడి అనే సీరియల్స్ లా రేవంత్ రెడ్డి డ్రామాలు ఆడుతున్నారు. రైతుల ప్రయోజనాలు ఫణంగా పెట్టి, వ్యక్తిగతంగా కేసీఆర్ ను హింసించాలని రేవంత్ రెడ్డి ప్లాన్ చేశారు.కాళేశ్వరం ద్వారా రైతులకు నీళ్లు ఇచ్చే అవకాశం ఉన్నా ఆ పని చేయకుండా ఇబ్బంది పెడుతున్నారు. కన్నెపల్లి పంప్ హౌస్ కు వెళ్తే అడ్డుకున్నారు. తుమ్మిడిహట్టి వద్ద గత కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు పనులు చేయలేదు. అక్కడ నీటి లభ్యత లేదు. అక్కడ వైల్డ్ లైఫ్ సాంక్చుయరీ ఉంది. ఒకవేళ నీళ్లు ఉంటే కాంగ్రెస్ అధికారం లోకి ఏడాదిన్నర పూర్తయినా తట్ట మట్టి కూడా ఎందుకు తీయలేదు. తుమ్మిడిహట్టి వద్ద ప్రాజెక్టు అనేందుకు మీతో ఏ రిపోర్ట్ ఉంది. 152 మీటర్లకు మహారాష్ట్ర నుంచి పర్మిషన్ తీసుకున్నామని ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు.









తాగునీటిని, సాగునీటిని ఇచ్చారు. రెండేళ్లు కావొస్తున్నా ఒక్క ఎకరానికైనా రేవంత్ రెడ్డి నీళ్లు ఇచ్చారా. ? ఢిల్లీకి కమీషన్ల మూటలు తీసుకెళ్లావు. ప్రతిపక్షాల మీద కమీషన్లు వేశావు. వచ్చే రెండేళ్లు కూడా డ్రామాలు తప్పా కాంగ్రెస్ పాలనతో ప్రయోజనం లేదు. కాళేశ్వరం నీళ్లు రైతులకు ఇవ్వకుండా, ఏపీ ప్రాజెక్టు బనకచర్లకు నీళ్లు ఇవ్వడానికి కుట్రలు చేస్తున్నారు. గంటసేపు ఇక్కడే ఉంటానని బేగంపేట ఎయిర్ పోర్టులో కేసీఆర్ సవాల్ విసిరితే సమాధానం లేదు. ఈరోజు అయినా వచ్చి ఆ అగ్రిమెంట్ పేపర్లు చూపాలని డిమాండ్ చేస్తున్నాం. ఏడాది పాలనలోనే కేసీఆర్ ఎంతో చేసి చూపించారు. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ ప్రాజెక్టులతో సర్ ఆర్థర్ కాటన్ ధవళేశ్వరం వద్ద డ్యామ్ కడితే అప్పటి బ్రిటీష్ ప్రభుత్వం కమిషన్లు వేసి వేధించింది. కానీ కాటన్ ప్రజల గుండెల్లో దేవుడిగా మిగిలిపోయారు. రేపు కేసీఆర్ తెలంగాణ ప్రజల గుండెల్లో శాశ్వతంగా నిలిచిపోతారు. కాళేశ్వరం తెలంగాణకు వరప్రదాయని. కాళేశ్వరం కూలిందని చెబుతాడు.

## సంపాదకీయం

# సుంకాలు... శాపనార్థాలు!

రాక తప్పదనుకుంటున్న ముప్పు ముంగిట్లోకొచ్చింది. అమెరికా అధ్యక్షపీఠం అధిష్ఠించింది మొదలు నిలకడలేనితనంతో, పొంతనలేని వ్యాఖ్యలతో మిత్రుల్ని, వ్యతిరేకుల్ని కూడా సమానంగా ఇరకాటంలో పడేస్తున్న డోనాల్డ్ ట్రంప్... గతంలో హెచ్చరించినట్టే సుంకాల మోత మోగించారు. శుక్రవారం నుంచి భారత్ నుంచి వచ్చే సరుకులపై 25 శాతం సుంకాలు విధిస్తామని, ఇవిగాక రష్యా నుంచి ముడిచమురు, రక్షణ సామగ్రి కొంటున్నందుకు అదనంగా జరి మానా ఉంటుందని ప్రకటించారు. అది ఎంత శాతమో చెప్పకపోయినా రష్యాతో వాణిజ్యం సాగించే భారత్, చైనాలపై 500 శాతం వరకూ అదనపు సుంకాలుంటాయని ఆయన లోగడ ప్రకటించారు. కనుక ఈ సుంకాల కన్నా జరిమానా వాటాయే ఎక్కువుంటుందని అంచనా వేయొచ్చు. తన ఆదేశాలను ఔదలదాల్చనందుకు మన ఆర్థిక వ్యవస్థను 'మృత ఆర్థిక వ్యవస్థ'గా దూషించారు. అనాల్సిన వన్నీ అన్నాక 'ఇంకా భారత్‌తో చర్చలు జరుగుతున్నాయి. ఏం జరుగుతుందో చూద్దాం' అని ముక్తాయించారు. ఆయన హుకుం అమలైతే వస్త్రాలు, రొయ్యలు, ఆభర ణాలు, వజ్రాలు, తోలు ఉత్పత్తులు వగైరాలపై తీవ్ర ప్రభావం పడుతుందనీ, ఆ రంగాల్లో ఉపాధి దెబ్బతింటుందనీ నిపుణుల అంచనా. ఈ రంగాల్లో 8,700 కోట్ల డాలర్ల విలువైన ఎగుమతులుంటున్నాయి. ఈ ఏడాది జీడీపీ 6.5 శాతానికి మించి వుండొచ్చని అంచనాలున్నాయి. తాజా పరిణామాల నేపథ్యంలో అది బాగా తగ్గవచ్చంటున్నారు. ట్రంప్‌కు దౌత్య మర్యాదల సంగతి అటుంచి వ్యక్తిగా ఎలా మెలగాలో కూడా తెలియదు. బహిరంగ బెదిరింపులకు దిగటం, అన్యాయమని అందరికీ తెలిసేలా ప్రవర్తించటం ఆయన నైజం. బ్రెజిల్ సంగతే తీసుకుంటే అక్కడ ఆ మధ్య అధికారం కోల్పోయిన బోల్సొనారో ఆయ నకు ఇష్టుడు. కనుక అతనిపైవున్న నేరారోపణలు ఉపసంహరించి వదిలేయమని తాఖీదు పంపారు. అంగీకరించనందుకు అదనపు సుంకాలు విధించారు. దేశాలకు సార్వభౌమత్వం ఉంటుందనీ, దానికి లోబడి సంబంధాలు నెరపాలనీ ఆయన భావించరు. వాణిజ్య ఒప్పందాలు సాకారం కావాలంటే వాటిని కుదుర్చుకోదల్చుకున్న రెండు పక్షాలకూ పరస్పర విశ్వాసం, నమ్మకం ఉండాలి. ఓపిగ్గా చర్చించాలి. బ్రిటన్‌తో మనకు ఇటీవల కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందమే ఇందుకు ఉదాహరణ. దాదాపు మూడేళ్లపాటు ఆ ఒప్పందంపై చర్చలు సాగాయి. ఒప్పందం అన్నాక ఇచ్చిపుచ్చుకోవడా లుంటాయి. 'మేం పుచ్చుకుంటాం... ఇవ్వం' అంటున్నారు. 'మాతో ఒప్పందానికి భారత్ సుముఖంగా వుంది... ఇక సంతకాలే తరువాయి' అంటూ చాన్నాళ్ల క్రితమే మన ప్రభుత్వం తరఫున తానే ప్రకటించారు. ట్రంప్ ఆగ్రహావేశాలకు వేరే కారణాలున్నాయి. మన సాగు, పాడి రంగాలను పరిరక్షించేందుకు అమెరికా నుంచి వచ్చే ఆ ఉత్పత్తులపై మన దేశం అధిక సుంకాలు విధిస్తోంది. ఇందులో సహేతుకత ఉంది. అమెరికాలో ఆ రంగాలకు భారీ సబ్సిడీలుంటాయి. దాంతో తమ ఉత్పత్తుల్ని వేరే దేశాల్లో కారుచౌకగా అమ్ముకోవటానికి వీలుంటుంది. అమెరికాతో పోలిస్తే మన సబ్సిడీలు చాలా తక్కువ. అవి రైతులకు లాభదాయకం కాకపోగా, ఆ రెండు రంగాల్లోనూ వ్యయం విపరీ తంగా పెరిగింది. రైతులు అధిక వడ్డీకి బయట అప్పులు చే యాల్సి వస్తోంది. తీరా గిట్టుబాటు ధర లభించక, అప్పులు తీరక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ట్రంప్ ఒత్తిడి చేస్తున్నట్టు అధిక సుంకాలు తొలగిస్తే ఈ సంక్షోభం మరింత పెరుగుతుంది. గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు ఆసరాగా ఉన్న ఆ రంగాలు తీవ్రంగా దెబ్బతింటాయి. నిజానికి ప్రపంచ వాణిజ్య సంస్థ (డబ్ల్యూటీవో)లో చేరినప్పుడే మన పాలకులు నిక్కచ్చిగా ఉండాల్సింది. కానీ దాటవేత ధోరణి ప్రదర్శించారు. రష్యాతో వాణిజ్యంపైనా ఇంతే. అంత్య నిష్ఠూరం కన్నా ఆది నిష్ఠూరం మేలన్నట్టు ఉంటే వేరుగా ఉండేది. కానీ మన దేశం వారి ఆదేశాలు పాటించింది. 2009%–%13 మధ్య మన ఆయుధ కొనుగోళ్లలో రష్యా వాటా 76 శాతం. అదిప్పుడు 36 శాతానికి పడిపోయింది. దీన్ని ఆపేయాలని, తన ఎఫ్%–%35 యుద్ధ విమానాలు, ఎంక్యూ%–%9బి డ్రోన్లు, పీ%–%81 సాగర ప్రాంత గస్తీ విమానాలు కొనితీరాలని అమెరికా ఒత్తిడి తెస్తోంది. నిజానికి భారత్‌కు ఆయుధ అమ్మకాలపై 1960 ప్రాంతాల్లో అమెరికా నిషేధం విధించబట్టే రష్యాపై ఆధారపడటం పెరిగింది. ముడి చమురు విషయానికొస్తే మొన్న ఫిబ్రవరికి రష్యా నుంచి కొనుగోళ్లు 25 శాతం మేర పడిపోయాయి. అదే సమయంలో అమెరికా నుంచి కొనుగోళ్లు వంద శాతం పెరిగాయి. తన అంధభక్త గణాన్ని సంతృప్తిపరచటం కోసం, ఓటుబ్యాంకు పెంచుకోవటం కోసం ట్రంప్ దశాబ్దాల తరబడి ఎంతో ఓపిగ్గా నిర్మించుకుంటూ వచ్చిన ఇరు దేశాల సంబంధాలపైనా గొడ్డలి వేటు వేశారు. దీని పర్యవ సానాలు మనపై ఉన్నట్టే, అమెరికాపైనా ఉంటాయి. ఆయన ధోరణి మారకపోతే మన ఆర్థిక వ్యవస్థ మాటేమోగానీ... అమెరికా ఆర్థిక వ్యవస్థ 'మృతప్రాయం' కావటం ఖాయం.

# నేడు ప్రజాయుద్ధ నౌక గద్దర్ వర్ధంతి

## పొడుస్తున్న పొద్దు మీద నడుస్తున్న కాలమా... పోరు తెలంగాణమా కోట్లాది ప్రాణమా

## -తెలంగాణ సాంస్కృతిక సమాజానికి విశేషమైన సేవలందించిన గద్దర్

## -సాహిత్యం, సామాజిక న్యాయం,అణగారిన వర్గాల కోసం కొట్లాడిన మహనీయుడు

తెలంగాణ సాంస్కృతిక సమాజానికి గద్దర్ విశేషమైన సేవలందించారు. సాహిత్యం, సామాజిక న్యాయం, అణగారిన వర్గాల కోసం ఆయన కొట్లాడారు.పొడుస్తున్న పొద్దు మీద నడుస్తున్న కాలమా... పోరు తెలంగాణమా..పోరు తెలంగాణమా..కోట్లాది ప్రాణమా.. అంటూ పాటలు పాడుతూ తెలంగాణ ఉద్యమాన్ని మరింత ఉధ్రుతలూగించాడు.గద్దర్ గా అందరికీ సుపరిచితమైన గుమ్మడి విఠల్ రావు గొప్ప విప్లవ కవి. ఈయనకు గద్దర్ అను పేరును స్వాతంత్ర్యం రాకముందు బ్రిటిష్ రాజ్యాన్ని వ్యతిరేకించిన గదర్ పార్టీ కి గుర్తుగా తీసుకోవడం జరిగిందని అంటారు. గద్దర్ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ఇప్పటి తెలంగాణ రాష్ట్రంలోని మెదక్ జిల్లాలోని తూప్రాన్ గ్రామంలో లచ్చుమ్మ, శేషయ్యలకు 1948లో దళిత కుటుంబంలో జన్మించాడు. విద్యాభ్యాసం నిజామాబాదు జిల్లా మహబూబ్ నగర్ లో, ఇంజనీరింగ్ విద్య హైదరాబాద్ లో జరిగింది. 1969 తెలంగాణ ఉద్యమంలో గద్దర్ చురుగ్గా పాల్గొన్నాడు. భావ వ్యాప్తికోసం ఆయన ఊరురా తిరిగి ప్రచారం చేసారు. దీనికొరకు ఆయన బుర్రకథను ఎంచుకున్నాడు. ఆయన ప్రదర్శనను చూసిన సినిమా దర్శకులు బి.నరసింగరావు భగత్ సింగ్ జయంతి రోజున ఒక ప్రదర్శనను ఏర్పాటు చేసారు. ఆతర్వాత ప్రతి ఆదివారం ఆయన తన ప్రదర్శనలు ఇచ్చే వాడు. 1971 లో బి.నరసింగరావు ప్రోత్సాహంతో మొదటి పాట "ఆపర రిక్షా" రాశాడు. ఆయన మొదటి ఆల్బం పేరు గద్దర్. ఇదే ఆయన పేరుగా స్థిరపడింది.కుటుంబ నియంత్రణ, పారిశుధ్యం వంటి అనేక సామాజిక విషయాల గురించి ఆయన బుర్రకథలను తయారు చేసుకొని ప్రదర్శించి ప్రజలకు అవగాహన కల్పించేవాడు. ఆ తర్వాత అతను అనేక పాటలు రాసాడు. 1972 లో పల్లెల్లో జరుగుతున్న ఆకృత్యాలను ఎదురించేందుకు జననాట్య మండలి ఏర్పడింది. ఇది దళితులను మేల్కొలిపేందుకు, వారిని చైతన్య పరిచేందుకు ఏర్పడింది. అయితే 1975లో గద్దర్ బ్యాంకు రిక్రూట్ మెంట్ పరీక్షను రాసాడు. అయన కెనరా బ్యాంకులో క్లార్క్ గా చేరాడు, తర్వాత అతను విమలను వివాహం చేసుకున్నాడు. వారికి ముగ్గురు పిల్లలు, సూర్యుడు, చంద్రుడు, వెన్నెల. మాభూమి సినిమాలో సాయుధ పోరాట యోధుడు యాదగిరి పాత్రలో నటించి యాదగిరి పాడిన బండెనక బండి కట్టి అనే పాటను ఆయనే పాడి, ఆడాడు.1984 లో ఆయన క్లార్కు ఉద్యోగానికి రాజీనామా చేసాడు. 1985 లో కారంచేడులో దళితుల హత్యలకు వ్యతిరేకంగా పోరాడాడు. జన నాట్య మండలిలో చేరాడు. ఒగ్గు కథ, బుర్ర కథ, ఎల్లమ్మ కథ ల ద్వారా గ్రామీణ ప్రజల్లోకి వెళ్ళాడు. మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఒడిషా, బీహార్ రాష్ట్రాల్లో కూడా ప్రదర్శనలు ఇచ్చాడు. కింద గోచి ధోతి, పైన గొంగళి ధరించేవాడు. ఆయన పాడే



పాటలకు ప్రజల్లో చైతన్యం కలిగిస్తుంటాయి. దళిత పేదలు అనుభవిస్తున్న కష్ట, నష్టాలను ఆయన, ఆయన బృందం కళ్ళకు కట్టినట్టుగా పాటలు, నాటకాల రూపంలో తెలియ జెప్పేవారు. ఆయన పాటలు వందలు, వేలు కాసెట్ లు గా, సిడిలుగా రికార్డ్ అయ్యి అత్యధికంగా అమ్ముడుపోయాయి. మర్రి చెన్నారెడ్డి రెండవసారి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో నక్సలైట్స్ పై ఆయన ఉదారంగా వ్యవహరించాడు, వారిపై నిషేధం ఎత్తి వేయబడింది. 1990 ఫిబ్రవరి 18 న జన నాట్య మండలి ఆధ్వర్యంలో గద్దర్ హైదరాబాద్ లోని నిజాం కాలేజీ గ్రౌండ్స్ లో నిర్వహించిన భారి భహిరంగ సభకు 2 లక్షల మంది ప్రజలు హాజరయ్యారు.1997 ఏప్రిల్ 6 న ఆయన పై పోలీసులు విరుచుకు పడ్డారు. ఆయన శరీరంలోకి అనేక బుల్లెట్లు గుచ్చుకున్నాయి. అన్ని బుల్లెట్ లను తొలగించారు కాని ఒక్క బుల్లెట్ ను మాత్రం డాక్టర్ లు తొలగించలేదు. అది తొలగిస్తే ఆయన ప్రాణాలకే ప్రమాదమని వదిలేశారు. ఆయన ఒంట్లో బుల్లెట్ ఉంది. ఆ తర్వాత నక్సలైట్ పార్టీలో ఉంటూ విప్లవ సాహిత్యాన్ని ప్రజల ముందు ఉంచారు. విప్లవ రచయితల సంఘం ద్వారా ప్రజలను చైతన్య పరిచారు. 2002 లో ప్రభుత్వంతో చర్చల సమయంలో నక్సలైట్స్ గద్దర్, వరవరరావు లను తమ దూతలుగా పంపారు. నకిలీ ఎన్‌కౌంటర్ లను ఆయన తీవ్రంగా నిరసించాడు.తెలంగాణ ఉద్యమం పునరుద్ధరించడంతో గద్దర్ మరోసారి వెనుకబడిన కులాలు, నిమ్న కులాల ఉద్ధరణ ఉద్దేశంతో ఒక ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర కోసం తన మద్దతును తెలపటానికి ప్రారంభించాడు. బలమైన కమ్యూనిస్ట్ భావజాలం ఉన్నప్పటికీ, అతను ప్రత్యేక తెలంగాణా రాష్ట్రాన్ని వ్యతిరేకించే భారతదేశం లోని కొన్ని కమ్యూనిస్ట్ పార్టీలతో తన భావాలను పంచుకోలేదు.గద్దర్ మొదటి నుండి తెలంగాణా వాదే. దేవేందర్ గౌడ్ నవ తెలంగాణా పార్టీ పెట్టినప్పుడు ఆయనకు కూడా మద్దతు తెలిపారు గద్దర్. గద్దర్ పై దాడి జరిగినప్పుడు హోం మినిస్టర్ దేవేందర్ గౌడ్. తెలంగాణ ఉద్యమంలో తెలంగాణా ప్రజా ఫ్రంట్ ను స్థాపించాడు.మాభూమి సినిమాలోని 'బండెనక బండి కట్టి' అనే పాటను పాడడంతోపాటు పాటలో నటించాడు. ఆయన రాసిన పాటల్లో "అమ్మ తెలంగాణమా" అనే పాట బహుల ప్రజాదరణ పొందింది. తెలంగాణా లోని అన్ని అంశాలను స్పృశిస్తూ సాగింది ఈ పాట. ఆయన రాసిన "నీ పాదం మీద పుట్టు మచ్చ నై చెల్లెమ్మ" అనే పాటకు ఉత్తమ గీతంగా నంది అవార్డు వచ్చింది అయితే ఆయన ఆ అవార్డును తిరస్కరించారు. ఆయన మరోసారి జై బోలో తెలంగాణా సినిమాలో తెరపైన కనిపించాడు. 'పొడుస్తున్న పొద్దు' మీద పాట ఆయనే రాసి పాడి, అభినయించారు. ఈ పాట అద్భుత విజయం సాధించింది.ఈ పాటకు నంది అవార్డు సైతం వచ్చింది. అలాగే ఆయన రాసి పాడిన 'అమ్మా తెలంగాణ ఆకలికేకల గానమా' పాటను తెలంగాణ రాష్ట్ర గీతంగా రాష్ట్ర సర్కార్ ఎంపిక చేసింది.గుండెపోటు కారణంగా 2023 జూలై 20న హైదరాబాద్, అమీర్ పేట్ లోని అపోలో ఆసుపత్రిలో చేరిన గద్దర్ కు ఆగస్టు 3న వైద్యులు బైపాస్ సర్జరీ చేశారు. తరువాత ఆసుపత్రిలోనే చికిత్సపొందిన గద్దర్ ఊపిరితిత్తులు, యూరినరీ సమస్యలతో 2023, ఆగస్టు 6న మధ్యాహ్నం 3 గంటలకు మరణించాడు.ఆగస్టు 6 సాయంత్రం నుండి ఆగస్టు 7 మధ్యాహ్నం వరకు ప్రజల సందర్శనార్థం గద్దర్ భౌతికకాయాన్ని ఎల్బీ స్టేడియంలో ఉంచబడింది. ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, కవులు, కళాకారులు, వేలాదిగా అభిమానులు గద్దర్ భౌతికకాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. ఎల్బీ స్టేడియం నుంచి మధ్యాహ్నం 12 గంటలకు ప్రారంభమైన అంతిమయాత్ర గన్‌పార్కు నుంచి బషీర్‌బాగ్, లిబర్టీ, జేబీఎస్ మీదుగా 6 గంటలపాటు 17 కిలోమీటర్ల దూరమున్న అల్వాల్‌లోని గద్దర్ నివాసం వరకు కొనసాగింది.గద్దర్ స్థాపించిన మహాబోధి పాఠశాల ఆవరణలో అధికార లాంఛనాలతో గద్దర్ అంత్యక్రియలు జరిగాయి..దివంగత గద్దర్ జయంతిని ప్రతి ఏడాది జనవరి 31న అధికారికంగా నిర్వహించాలని ఆయన కూతురు వెన్నెల మంత్రి పొన్నం ప్రభాకర్ ను కలిసి విజ్ఞప్తి చేయగా దీనిపై స్పందించిన మంత్రి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి లేఖ రాయగా జనవరి 31న ఆయన జయంతి వేడుకలను అధికారికంగా నిర్వహించాలని తెలంగాణ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2025 నుంచి సినిమా, టెలివిజన్, రంగస్థల ఉత్తమ కళాకారులకు అందించే నంది పురస్కారాలను గద్దర్ తెలంగాణ ఫిల్మ్ అవార్డ్స్ పేరు మీదుగా 2025 జూన్ 14న ఈ అవార్డులను ప్రదానం చేశారు.

# ట్రంప్ తెంపరితనం...

ట్రంప్ నాలుక ఎప్పుడు మడతెట్టేస్తాడో ఎవరికీ తెలియదు.. ఏం మాట్లాడుతాడో అర్థం కాదు. అమెరికా ఫస్ట్ అనే నినాదంతో అమెరికా తప్ప ఇతర ఏ దేశంపైన అయినా తన నోటిదూల వ్యక్తం చేస్తుంటాడు. తాజాగా భారత్ పైనే అదే అసహనాన్ని వెళ్లగక్కాడు.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల భారత ఆర్థిక వ్యవస్థపై చేసిన వ్యాఖ్యలు దేశవ్యాప్తంగా పెద్ద చర్చకు దారితీశాయి. ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా పేరుపొందిన భారతదేశాన్ని "డెడ్ ఎకానమీ" అని ఆయన వ్యాఖ్యానించడం చాలామందిని ఆశ్చర్యపరిచింది.భారత ప్రధాని నరేంద్రమోదీ నాకు మంచి మిత్రుడు. భారత్ అమెరికాకు మంచి మిత్ర దేశం.. రెండు దేశాల మధ్య వాణిజ్యం, వ్యాపారంతోపాటు సైనిక సహకారం బాగుంది' ఇదీ మొన్నటి వరకు ట్రంప్ పలికిన చిలుక పలుకులు. కానీ, ఇప్పుడు భారత్ అన్నా.. మోదీ అన్నా ట్రంప్ నిప్పులు చెరుగుతున్నారు. ఉరిమి చూస్తున్నారు. భారత్‌తో దోస్తీ కటీఫ్ చేసి.. పాకిస్తాన్‌తో మిత్రుత్వం పెంచుకుంటున్నారు. ఇక ప్రతీకార సుంకాలు భారీగా విధించారు. దీంతో భారత్, పాక్ సంబంధాలు దెబ్బతింటున్నాయి. ఈనేపథ్యంలో అసలు ట్రంప్‌కు కోపం ఎందుకు అన్న చర్చ జరుగుతోంది.ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక శక్తిగా భారత్ ఎదుగుతుండటం అమెరికాకు ఒక సవాలుగా మారింది. భారత్ వేగవంతమైన ఆర్థిక వృద్ధి, స్వతంత్ర విదేశాంగ విధానం, ఆంక్షలను ఎదుర్కొనే సామర్థ్యం ట్రంప్‌కు ఆందోళన కలిగిస్తోంది. గతంలో వాజ్‌పేయి ప్రభుత్వం పోఖ్రాన్ అణు పరీక్షల సమయంలో అమెరికా ఆంక్షలను సమర్థవంతంగా ఎదుర్కొన్నట్లే, ప్రస్తుతం కూడా భారత్ ఈ ఆంక్షలను బలంగా ఎదుర్కొంటోంది.భారత ప్రధాని నరేంద్రమోదీ నాకు మంచి మిత్రుడు. భారత్ అమెరికాకు మంచి మిత్ర దేశం.. రెండు దేశాల మధ్య వాణిజ్యం, వ్యాపారంతోపాటు సైనిక సహకారం బాగుంది' ఇదీ మొన్నటి వరకు ట్రంప్ పలికిన చిలుక పలుకులు. కానీ, ఇప్పుడు భారత్ అన్నా.. మోదీ అన్నా ట్రంప్ నిప్పులు చెరుగుతున్నారు. ఉరిమి చూస్తున్నారు. భారత్‌తో దోస్తీ కటీఫ్ చేసి.. పాకిస్తాన్‌తో మిత్రుత్వం పెంచుకుంటున్నారు. ఇక ప్రతీకార సుంకాలు భారీగా విధించారు. దీంతో భారత్, పాక్ సంబంధాలు దెబ్బతింటున్నాయి. అసలు ట్రంప్‌కు కోపం ఎందుకు అన్న చర్చ జరుగుతోంది.భారత్, అమెరికా మధ్య సంబంధాలు చారిత్రకంగా సమతుల్యంగా సాగుతున్నప్పటికీ, ఇటీవలి కాలంలో డొనాల్డ్ ట్రంప్ నాయకత్వంలో అమెరికా, భారత్‌పై కోపంతో కొన్ని కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. భారత్ ఆర్థిక వృద్ధి, విదేశాంగ విధానం, వాణిజ్య ఒప్పందాలపై స్వతంత్ర నిర్ణయాలు తీసుకోవడం వంటి అంశాలు ఈ ఉద్రిక్తతకు కారణాలుగా



కనిపిస్తున్నాయి.అమెరికా డెయిరీ ఉత్పత్తులను భారత్ కొనుగోలు చేయడానికి నిరాకరించడం ట్రంప్ కోపానికి ఒక ముఖ్య కారణం. చైనా అమెరికా డెయిరీ ఉత్పత్తులను కొనుగోలు చేయకపోవడంతో, భారత్‌ను కొత్త మార్కెట్‌గా చూసిన అమెరికా, ఈ విషయంలో నిరాశకు గురైంది. అమెరికాలో పశువులకు మాంసాహార ఆహారం ఇవ్వడం వల్ల ఉత్పత్తి అయ్యే పాల ఉత్పత్తులు భారత సాంస్కృతిక, ఆహార ఆచారాలకు అనుగుణంగా లేకపోవడంతో ప్రధాని మోదీ ఈ ఒప్పందాన్ని తిరస్కరించారు. ట్రంప్ దీనిని అమెరికా ఆర్థిక ప్రయోజనాలకు అడ్డంకిగా భావించారు.రష్యా నుంచి భారత్ చమురు కొనుగోలు చేయడం అమెరికాకు మరో కీలక సమస్యగా మారింది. రష్యా%–%ఉక్రెయిన్ యుద్ధంలో రష్యాకు ఆర్థికంగా మద్దతు ఇస్తున్న దేశంగా భారత్‌ను అమెరికా దృష్టిలో ఉంచింది. ఈ యుద్ధం ఆగితే ఉక్రెయిన్‌లోని అరుదైన ఖనిజాలను స్వాధీనం చేసుకోవాలన్న ట్రంప్ ఆలోచనకు భారత్ అడ్డంకిగా కనిపిస్తోంది. భారత్ యొక్క ఈ విదేశాంగ విధానం, తన శక్తి అవసరాలను స్వతంత్రంగా నిర్వహించుకునే ప్రయత్నంగా ఉన్నప్పటికీ, అమెరికా దీనిని తమ భౌగోళిక రాజకీయ లక్ష్యాలకు వ్యతిరేకంగా భావిస్తోంది.పాకిస్తాన్‌లోని అణ్వాయుధాలపై అమెరికా పెట్టిన నియంత్రణ ఆపరేషన్ సిందూర్ ద్వారా బహిర్గతమవడం అమెరికాకు, ముఖ్యంగా ట్రంప్‌కు తీవ్ర ఆఘాతం కలిగించింది. ఈ ఆపరేషన్ ద్వారా అమెరికా రహస్య ఎజెండా బయటపడడంతో, భారత్ దాని విదేశాంగ విధానంలో మరింత జాగ్రత్తగా వ్యవహరిస్తోంది. ఈ సంఘటన భారత్%–%పాకిస్తాన్ సంబంధాల్లో అమెరికా పాత్రను ప్రశ్నార్థకం చేసింది, ఫలితంగా ట్రంప్ భారత్‌పై కోపాన్ని మరింత పెంచింది.భారత్%–%పాకిస్తాన్ యుద్ధాన్ని ఆపివేయడంలో తామే కీలక పాత్ర పోషించామని ట్రంప్ పదే పదే చెప్పుకుంటున్నారు. భారత్ ప్రధాని మోదీ ఈ విషయంలో మూడో దేశం జోక్యం లేదని పార్లమెంటులో స్పష్టం చేశారు. ఈ ప్రకటన ట్రంప్ వ్యక్తిగత గౌరవాన్ని దెబ్బతీసింది. భారత్ ఈ స్వతంత్ర ధోరణి, అమెరికా ఆధిపత్య ఆలోచనలకు వ్యతిరేకంగా ఉండటం ట్రంప్ కోపానికి మరో కారణంగా మారింది.అమెరికా వాణిజ్య ఒప్పందాల్లో తన షరతులను రుద్దేందుకు ప్రయత్నించినప్పటికీ, భారత్ తన ఆర్థిక ప్రయోజనాలను కాపాడుకోవడంలో దృఢంగా ఉంది. ఈ నేపథ్యంలో, ట్రంప్ భారత ఉత్పత్తులపై 25 శాతం టారిఫ్ విధించారు. అయితే, భారత్ ఈ ఆంక్షలను సమర్థవంతంగా ఎదుర్కొంటూ, పరస్పర ప్రయోజనాల ఆధారంగా మాత్రమే ఒప్పందాలకు సిద్ధమని స్పష్టం చేసింది. ఈ ధోరణి ట్రంప్‌కు మరింత కోపం తెప్పించింది.ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక శక్తిగా భారత్ ఎదుగుతుండటం అమెరికాకు ఒక సవాలుగా మారింది. భారత్ వేగవంతమైన ఆర్థిక వృద్ధి, స్వతంత్ర విదేశాంగ విధానం, ఆంక్షలను ఎదుర్కొనే సామర్థ్యం ట్రంప్‌కు ఆందోళన కలిగిస్తోంది. గతంలో వాజ్‌పేయి ప్రభుత్వం పోఖ్రాన్ అణు పరీక్షల సమయంలో అమెరికా ఆంక్షలను సమర్థవంతంగా ఎదుర్కొన్నట్లే, ప్రస్తుతం కూడా భారత్ ఈ ఆంక్షలను బలంగా ఎదుర్కొంటోంది.

# గులాబీకి కష్టకాలమేనా




**హైదరాబాద్, ఆగస్టు 5:**తెలంగాణలో బీఆర్ఎస్‌కు గడ్డు కాలం నడుస్తుంది. ఒకవైపు ఫోన్ ట్యాపింగ్ కేసులో సిట్ దూకుడు కొనసాగుతుండగానే, కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్ రూపంలో బీఆర్ఎస్‌పై మరో పిడుగు పడింది. నేడో, రేపో స్థానిక ఎన్నికలంటూ హీట్ కొనసాగుతున్న వేళ.. వరుసగా బీఆర్ఎస్‌ను ఇబ్బంది పెట్టే అంశాలతో పార్టీ ఉక్కిరిబిక్కిరి అవుతుంది. ముప్పేట దాడి కారణంగా.. తెలంగాణలో బర్నింగ్ టాపిక్ అయినటువంటి బీసీ రిజర్వేషన్ అంశంపై ఫోకస్ చేయలేకపోతుంది బీఆర్ఎస్.నిన్న మొన్నటి వరకు ఈ కార్ రేసింగ్, ఫోన్ ట్యాపింగ్, గొర్రెల పంపిణీ కేసులంటూ ఎటాకింగ్‌కు దిగిన కాంగ్రెస్.. తాజాగా కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్‌ను ప్రజల ముందుంచింది. కాళేశ్వరం కమిషన్ రిపోర్ట్‌లో బీఆర్ఎస్ పెద్ద తలకాయలను టార్గెట్ చేశారు. మాజీ సీఎం కేసీఆర్, హరీష్‌రావు పేర్లు ప్రస్తావించింది కమిషన్. దీంతో.. రివర్స్ ఎటాక్‌కు దిగింది బీఆర్ఎస్. అది కమిషన్ రిపోర్ట్ కాదు.. కాంగ్రెస్ రిపోర్ట్ అని స్వయంగా కేసీఆరే విమర్శించారు. అంతేకాదు.. కమిషన్ రిపోర్ట్ పేరుతో జరిగే డ్యామేజీని కంట్రోల్ చేసేందుకు నాయకుల్ని రంగంలోకి దింపారు. ఇందులో భాగంగానే ఇవాళ హరీష్‌రావు ప్రజెంటేషన్ ఇవ్వబోతున్నారు. కమిషన్ పూర్తి రిపోర్ట్ బయటపెట్టకుండా.. కేసీఆర్ మీద నిందలు మోపడమే ప్రభుత్వం పనిగా పెట్టుకుందని విమర్శిస్తున్నారు.మరోవైపు.. కాంగ్రెస్ ఎటాక్‌తో ఇబ్బందుల్లో ఉన్న బీఆర్ఎస్‌ను బీజేపీ కూడా దెబ్బ కొడుతుంది. బీఆర్ఎస్ లాయలిస్టులకు గాలాలు వేసి.. బీజేపీలో చేర్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా నల్లమల ప్రాంతానికి చెందిన గువ్వల బాలరాజును తమ దారికి తెచ్చుకోవడంలో సక్సెస్ అయ్యారు. రేపో, మాపో గువ్వల బీజేపీ కండువా కప్పుకోబోతున్నారు. ఒక్క గువ్వలే కాదు.. మరికొందరు గులాబీ నేతలు కూడా బీజేపీలోకి రావడం గ్యారంటీ అంటున్నారు రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు. అధికార కాంగ్రెస్ ముప్పేట దాడితో సతమతం అవుతున్న బీఆర్ఎస్‌కు,.. బీజేపీ కంట్లో నలుసుగా మారింది. ఎప్పుడు ఏ నాయకుడికి ఎర వేస్తుందనే టెన్షన్‌లో ఉన్నారు గులాబీ నేతలు.ఏదేమయినా.. కాంగ్రెస్, బీజేపీ వ్యూహాలకు బీఆర్ఎస్‌పై కారు మేఘాలు కమ్మాయి. దీంతో.. రెండు పార్టీలకు స్ట్రాంగ్ కౌంటర్స్ ఇస్తూ.. ప్రజలకు వాస్తవాలు వివరించే ప్రయత్నం చేస్తున్నారు బీఆర్ఎస్ నేతలు. మరోవైపు బీసీ కోటాపై బీఆర్ఎస్ స్టాండ్‌ను బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లలేకపోతుంది.

## తెలంగాణ స్థానిక కోటాపై సుప్రీంకోర్టులో కీలక విచారణ



**ఢిల్లీ, ఆగస్టు :** తెలంగాణ స్థానిక కోటాపై ( సుప్రీంకోర్టులో ఇవాళ(మంగళవారం) కీలక విచారణ కొనసాగుతోంది. స్థానికులు నాలుగేళ్లు వరుసగా తెలంగాణలో చదవకపోయిన స్థానిక కోటా వర్తిస్తుందన్న తెలంగాణ హైకోర్టు తీర్పుపై రాష్ట్ర ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. 10వ, 11వ తరగతులకే బయటకు వెళ్లిన విద్యార్థులకు అన్యాయం చేయరాదని సుప్రీంకోర్టు సీజేఐ బీఆర్ గవాయ్ వ్యాఖ్యానించారు. దుబాయ్ లాంటి ప్రాంతాలకు ఇంటర్ చదువుకోడానికి వెళ్లిన విద్యార్థులకు కోటా వర్తించదంటే ఎలా అని సీజేఐ ప్రశ్నించారు. విద్యార్థి తెలంగాణలో పుట్టి, చదివితే .. 2 సంవత్సరాలు బయట చదివినంత మాత్రాన తెలంగాణ కోటా వర్తించదంటే ఎలా అని నిలదీశారు. ఇతర రాష్ట్రాల విద్యార్థులు ఎటూ స్థానిక కోటా కిందకు రారని స్పష్టం చేశారు. నాలుగు సంవత్సరాల చదువు లేదా నివాసం ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం స్థానికత ఖరారు చేసిందని తెలంగాణ ప్రభుత్వం తరఫున న్యాయవాది సింఘ్వీ న్యాయస్థానానికి వివరించారు. 2024లో తీసుకువచ్చిన నిబంధనను 2028కి వర్తింపజేస్తే సరిపోతుందని సీజేఐ పేర్కొన్నారు. స్థానికత నిబంధనల కారణంగా తెలంగాణ విద్యార్థుల హక్కులకు అన్యాయం జరగకూడదని సీజేఐ బీఆర్ గవాయ్ అభిప్రాయం వ్యక్తం చేశారు.

## దెయ్యాల జాబితాలో కేటీఆర్ మిస్..



**హైదరాబాద్ , ఆగస్టు5:**కేసీఆర్ దేవుడు.. ఆయన చుట్టూ దయ్యాలు వచ్చి చేరాయని" అని కవిత వేసిన బాంబు ప్రభావం ఇప్పటికీ ఇంకా తగ్గలేదు. ఆయన చుట్టూ ఉన్న వారెవరూ, వారిలో దయ్యాలు ఎవరు అని తెలుకునేందుకు మీడియా ఇప్పటికీ ఆపసోపాలు పడుతోంది. ఆ దయ్యాలెవరై ఉంటారనే విషయమై మీడియాలోని కాదు అన్ని పార్టీలలో ప్రముఖంగా చర్చకు వస్తూనే ఉంది. కొన్ని చానల్స్ కేసీఆర్ కు దగ్గరగా వ్యవహరించేవారిలో కేటీఆర్ ఒకరు కనుక ఆయన అయిుండవచ్చని కథనాలు వచ్చాయి. అలాగే హరీష్ రావు, సంతోష్ కుమార్, జీవన్ రెడ్డి, నిరంజన్ రెడ్డి, జగదీశ్వర్ రెడ్డి ఇలా చాలామంది నాయకుల పేర్లు సోషల్ మీడియాలో చక్కర్లు కూడా కొడుతున్నాయి. అయితే ఆ జాబితాలో కేటీఆర్ ఉండవచ్చని భావిస్తూ, వీరి మధ్య అంతర్యుద్ధం, ఆధిపత్య పోరు జరుగుతోందని కూడా ఎవరికివారే వ్యాఖ్యలు చేయడం, అవి చిలువలు పలువలుగా మీడియా కథనాలు కూడా రాసింది. కానీ ఇప్పటికీ ఆ దయ్యాలు ఎవరో కవిత బహిర్గతం చేయడం లేదు. పార్టీ పెద్ద మనుషులు కూడా ఆ ప్రశ్నలకు జవాబు చెప్పడం లేదు.యితే ఒక చానల్ ఇంటర్వ్యూలో యాంకర్ ఏదో విధంగా ఆ దయ్యాలు ఎవరై ఉంటారని తెలుసుకునేందుకు విశ్వ ప్రయత్నం చేసినా ఆమె జవాబు చెప్పకుండా దాటవేశారు. తాను తన తండ్రి కేసీఆర్ కు రాసిన లేఖను మీడియాకు బహిర్గతం చేసిన వారెవరో పార్టీ నాయకులే గుర్తించాలని, వారిపై చర్యలు తీసుకునే వరకు బిఆర్ఎస్ కు దూరంగా ఉంటానని తేల్చి చెప్పారు. కేసీఆర్ చుట్టూ ఉన్న దయ్యాలు ఎవరో కవిత తేల్చాలని చాలా మంది కోరుకుంటున్నారు. అని అడిగిన ప్రశ్నకు కూడా ఆమె దాటవేశారు. చివరికి తెలివిగా సెంటిమెంట్ ప్రశ్న వేసిన యాంకర్, ఆమె చెప్పిన జవాబుతో తన అనుమానాన్ని నివృత్తి చేసుకున్నాడు. ఈ సంవత్సరం కేటీఆర్ కు రాఖీ కట్టబోతున్నారా.? అని యాంకర్ అడగ్గా, గత సంవత్సరం జైల్లో ఉండడంతో రాఖీ కట్టలేకపోయానని, ఈ సంవత్సరం తప్పకుండా రాఖీ కడుతానని ఆమె చెప్పారు. రాజకీయం వేరు రక్తసంబంధం వేరు అనిఅని ఆమె దొరికిపోయారు. రాజకీయాలు వేరు అంటున్నారు అంటే ఆ దయ్యాల్లో కేటీఆర్ కూడా ఒకరా అని వెంటవెంటనే అడుగగా, ఆమె కాదని జవాబు చెప్పగా, దయ్యాల జాబితా నుంచి ఒకరిని తొలగించవచ్చు అనడంతో ఆమె నవ్వుతూ అన్నతో తనకేమి ఇబ్బంది లేదని, ఒకటికి రెండుసార్లు చెప్పారు. అన్నయ్య అలాంటి వాడు కాదు అని, ఆ జాబితాలో అన్నయ్య లేదని తేల్చి చెప్పారు. అంటే ఇంకా కేసీఆర్ చుట్టూ ఉన్న దయ్యాల జాబితాలో ఎవరెవరు ఉన్నారో తెలుసుకునే పనిలో మీడియా తలమునకలయ్యింది. అయితే ఈ లేఖ బయటికి రావడం, దానిపై కవిత సీరియస్ గా స్పందించడం, అనంతరం పరిణామాలు అన్ని పార్టీ ప్రక్షాళనలో భాగంగా పెద్ద మనిషి వేసిన భారీ స్కెచ్ లో భాగమని తెలుస్తోంది. అసలు పార్టీని నట్టేట ముంచిన వారెవరో తెలుసుకొని, వారిని దూరం పెట్టే ప్రయత్నంలో భాగమని విశ్లేషిస్తున్నారు.

## ఢిల్లీకి బయలుదేరిన మంత్రులు, ఎమ్మెల్యేలు



**హైదరాబాద్:**బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు బిల్లును ఆమోదించుకోవడానికి తెలంగాణ కాంగ్రెస్ ఢిల్లీలో చేపట్టిన మూడు రోజుల కార్యాచరణలో భాగంగా మంత్రులు పొన్నం ప్రభాకర్, సీతక్క, పలువురు ఎమ్మెల్యేలు, బీసీ సంఘాల నేతలు శంషాబాద్ విమానాశ్రయం నుండి ఢిల్లీ బయలుదేరారు.మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ దేశంలోనే తెలంగాణ రోల్ మోడల్ గా రాహుల్ గాంధీ గారి వాగ్దానం మేరకు తెలంగాణ వ్యాప్తంగా ఇంటింటి సర్వే జరిపి ఎస్సీ ఎస్టీ బీసీల లెక్కలు తీసి సబ్ కమిటీ, కేబినెట్,శాసన సభ ఆమోదం తెలిపి గవర్నర్ ద్వారా రాష్ట్రపతి గారికి బిల్లును పంపించడం జరిగిందని అన్నారు.శాసన సభ మద్దతు ఇచ్చిన భారతీయ జనతా పార్టీ ఢిల్లీకి వెళ్లిన తర్వాత ముస్లింల పేరు మీద బీసీ రిజర్వేషన్ల బిల్లుకు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారు.. తెలంగాణలో ఉన్న ప్రతి రాజకీయ పార్టీ నాయకులు బలహీన వర్గాలకు రిజర్వేషన్లు ఇవ్వాలని ఆకాంక్షతో సామాజిక న్యాయం కోరుకునే ప్రతి వ్యక్తి ఈ మూడు రోజుల పాటు ఢిల్లీ వచ్చి కేంద్ర ప్రభుత్వం పై ఒత్తిడి తేవాల్సిందే. తెలంగాణ రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా అందరికి విజ్ఞప్తి చేస్తున్న . కాంగ్రెస్ శ్రేణులు అంతా ముఖ్యమంత్రి ,పిసిసి అధ్యక్షుడు ఆలోచన మేరకు ఎఐసిసి ఆదేశాల మేరకు ఢిల్లీలో జరుగుతున్న 5, 6, 7వ తేదీల్లో జరిగే కార్యక్రమాల్లో ఎటువంటి ఆలోచనల లేకుండా కేంద్ర ప్రభుత్వం మీద ఒత్తిడి తెచ్చే కార్యక్రమంలో పాల్గొనాలని అన్నారు.

# కుట్ర పూరితంగానే కాళేశ్వరం కమిషన్ విచారణ

### మొబిలైజేషన్ అడ్వాన్లు పేరుమీద రూ. 2 వేల కోట్లు దొబ్బారు:మాజీ మంత్రి హరీష్ రావు



**హైదరాబాద్:**రేవంత్ పాలన గాలికొదిలేశారు. రేవంత్ రాజకీయ కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారు . విద్యార్థులు రోడ్డెక్కి ధర్నాలు చేస్తున్నారు. వాస్తవాలు లేకుండా వండి వార్చిన రిపోర్ట్ బయటపెట్టారని మాజీ మంత్రి హరీష్ రావు అన్నారు.మంగళవారం నాడు తెలంగాణ భవన్ లో అయన పిపిటి ప్రజంటేషన్ ఇచ్చారు. హరీష్ రావు మాట్లాడుతూ బిల్లు కావాలంటే 10-12 శాతం కమీషన్లు కావాలి. బీజేపీ, కాంగ్రెస్లు కలిసి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారు. గోదావరి నదిపై పోలవరం ప్రాజెక్టు 3 సార్లు కుప్పకూలిందని అన్నారు.మాకు నోటీసులు రాకముందే మీడియాకు లీకులు ఇస్తున్నారు. కుట్ర పూరితంగానే కమిషన్ విచారణ జరిగినట్లు కనిపిస్తోంది. అసెంబ్లీలో 665 పేజీల రిపోర్ట్ పెడితే ప్రభుత్వాన్ని నిలదీస్తాం . వాస్తవాలను ప్రజల ముందుంచుతామని అన్నారు.665 పేజీల నివేదికలో నచ్చిన అంశాలపై బయటపెట్టారు. ఒక వైపే చూసి, విని, నిలబడి ఇచ్చిన రిపోర్ట్ ఇది. ఇది బేస్లెస్ రిపోర్ట్. దేశంలో ఎన్నో కమిషన్లు వేశారు.. న్యాయస్థానాల ముందు నిలబడవు. గతంలోనూ ఎంతో మంది రాజకీయ నేతలపై కమిషన్లు వేశారు. సీఎం రేవంత్ వరుస సీరియళ్లు నడుపుతున్నారు . కేసీఆర్ను హింసించాలన్నదే రేవంత్ ఉద్దేశమని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో తమ్మిడిహట్టి దగ్గర దమ్మెడు మట్టి ఎందుకు వేయలేదు. తమ్మిడిహట్టి దగ్గర నీటి లభ్యత లేదు. జీవ సంపద ఉంది, మహారాష్ట్ర నుంచి అభ్యంతరాలు ఉన్నాయి. అందుకే అక్కడ ప్రాజెక్ట్ కట్టలేదు. కన్నేపల్లి దగ్గర మోటార్లు ఆన్ చేయాలని బీఆర్ఎస్ నేతలు ధర్నా చేశారు.రెండేళ్ల నుంచి ఎందుకు తట్టెడు మట్టి ఎత్తలేదు. కేసీఆర్ మహారాష్ట్రలో చారిత్రాత్మక ఒప్పందం చేసుకున్నారు. కేసీఆర్ ఒకేసారి మూడు అగ్రిమెంట్లు చేశారని అన్నారు.152 మీటర్లకు అగ్రిమెంట్ చేస్తే ఎలా తగ్గిస్తారని ఉత్తమ్ అన్నారు. ఇంకా గంట 40 నిమిషాలు బేగంపేట ఎయిర్పోర్టులో ఉంటా. 152 మీటర్లకు ఒప్పుకున్నట్టు ఉత్తమ్ అగ్రిమెంట్ పత్రం తీసుకొస్తే. ఇక్కడి నుంచి రాజ్భవన్కు వెళ్లి రాజీనామా చేస్తానని కేసీఆర్ సవాల్ విసిరారు. ఒక్క ఏడాదిలోనే 24 గంటల కరెంటు ఇచ్చారు. మిషన్ కాకతీయతో చెరువులను పునఃరుద్ధరించారు. పెండింగ్ ప్రాజెక్టను రన్నింగ్ ప్రాజెక్టులుగా మార్చాం . నువ్వు వచ్చినంక ఒక్క కాలువ తవ్విన, ఒక్క ఎకరానికి నీళ్లు ఇచ్చావా అని ప్రశ్నించారు.రెండేళ్లలో ఢిల్లీకి కమీషన్ల మూటలు తీసుకెళ్లావు . వచ్చే రెండేళ్లలో కూడా రేవంత్రెడ్డి చేసేదేమీలేదు. ఢిల్లీకి కమీషన్ల ముతాలు తీసుకెళ్లారు తప్ప చేసిందేమీ లేదు. కాటన్ బ్యారేజీ కట్టినా కమిషన్ వేసి వేధించారు. అయినా కాటన్ గోదావరి ప్రజల గుండెల్లో నిలిచి ఉన్నారు. కేసీఆర్కు కూడా తెలంగాణ ప్రజల గుండెల్లో దేవుడిలా నిలిచిపోతారు. కాళేశ్వరం ముమ్మాటికీ వర ప్రదాయినే, రేవంత్కు కూడా తెలుసు . కాళేశ్వరం కూలిందన్నోడు గంధమల్లకు కొబ్బరికాయ ఎట్ల కొడుతాడు. మల్లన్నసాగర్ నుంచి మూసీకి నీళ్లు తీసుకొస్తానని చెబుతున్నాడు. కేసీఆర్ చేసింది వందేళ్ల భవిష్యత్తు దృష్టిలో పెట్టుకుని కాళేశ్వరం నిర్మాణం. ఉత్తమ్కుమార్రెడ్డి సత్యహరిశ్చంద్రుడికి తమ్ముడి లెక్క మాట్లాడుతున్నారు. ప్రాణహిత-చేవెళ్లలో పెట్టిన ఖర్చు రూ. 3,700 కోట్లు మాత్రమే . రూ. 11 వేల కోట్లు ఖర్చు చేశామని ఉత్తమ్ చెబుతున్నాడు . మొబిలైజేషన్ అడ్వాన్లు పేరుమీద రూ. 2 వేల కోట్లు దొబ్బారని ఆరోపించారు.

## నాకు రాజకీయాల్లో నుంచి వైదొలగడం ఇష్టం లేదు..

### వెంకయ్యనాయుడు ఆసక్తికర వ్యాఖ్యలు



**హైదరాబాద్ ఆగస్టు 5 :**భాష విషయంలో నాయకుల తీరు మారాలని మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్యనాయుడు సూచించారు. ఇవాళ(మంగళవారం) సీనియర్ సంపాదకులు ఇనగంటి వెంకట్రావు రాసిన విలీనం-విభజన మన ముఖ్యమంత్రులు పుస్తకావిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి వెంకయ్యనాయుడు ముఖ్య అతిథిగా పాల్గొని పుస్తకావిష్కరణ చేశారు. ఈ కార్యక్రమంలో మీడియా అకాడమీ చైర్మన్ కె. శ్రీనివాస్‌రెడ్డి, పుస్తక రచయిత ఇనగంటి వెంకట్రావు, సీనియర్ జర్నలిస్టులు కట్టా శేఖర్ రెడ్డి, బండారు శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మీడియాతో మాట్లాడారు. విలీనం – విభజన మన ముఖ్యమంత్రులు పుస్తకాన్ని నేటితరం యువత తప్పనిసరిగా చదవాలని సూచించారు. ఈ పుస్తకం చదివితే నాయకుల పరిపాలన, విజ్ఞానం, వారి గురించి అన్ని విషయాలు తెలుస్తాయని చెప్పుకొచ్చారు. పత్రికా సమాజానికి దర్పణం లాంటిదని... ఈ సమాజంలో ఏం జరుగుతుందో ప్రజలకు చెప్పాలని ఆకాంక్షించారు. మనం వ్యూస్ కోసం న్యూస్ చేయకూడదని.. దానికోసమే కాలమ్స్ ఉన్నాయని, రాసుకోవడానికి అందులో వాళ్ల అభిప్రాయాలు చెప్పొచ్చని పేర్కొన్నారు. భాష విషయంలో రాజకీయ నాయకులు చాలా హుందాగా ప్రవర్తించాలని సూచించారు. చాలా మంది జర్నలిస్టులు కొత్తగా యూట్యూబ్‌లో ఇష్టం వచ్చినట్లుగా మాట్లాడుతున్నారని.. పాత్రికేయంలో భాష చాలా ముఖ్యమని ఉద్ఘాటించారు వెంకయ్యనాయుడు. తన జీవితంలో రెండు సార్లు కంటతడి పెట్టానని గుర్తుచేసుకున్నారు. ఒకటి తన అమ్మ గుర్తుకు వచ్చినప్పుడు... తాను తన అమ్మను చూడలేదని భావోద్వేగానికి గురయ్యారు. రెండోది పార్లమెంటరీ పార్టీ సమావేశానికి పిలిచి తనను ఉప రాష్ట్రపతిగా చేసినప్పుడు...తనకు రాజకీయాల్లో నుంచి వైదొలగడం ఇష్టం లేదని తెలిపారు. ఆ రోజు నుంచి ఈ రోజు వరకు తాను బీజేపీ ఆఫీస్‌కు పోలేదని వెల్లడించారు. తాను ఉప రాష్ట్రపతిగా దిగిపోయిన నాటి నుంచి ఇప్పటి వరకు బీజేపీ ఆఫీస్ గుమ్మం తొక్కలేదని చెప్పుకొచ్చారు. ఉప రాష్ట్రపతిగా రిటైర్డ్ అయ్యాక యువత కోసం రాజకీయాల గురించి మాట్లాడుతున్నానని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు.

## పేపర్ బ్యాలెట్ విధానంలోనే ఎన్నికలు నిర్వహించాలి : కేటీఆర్



**న్యూఢిల్లీ :** ఈవీఎంలపై దేశ ప్రజల్లో అనేక అనుమానాలు ఉన్నాయని, వాటి పట్ల ప్రజలు విశ్వసనీయతను కోల్పోయారని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పేర్కొన్నారు. త్వరలో జరగబోయే బీహార్ అసెంబ్లీ ఎన్నికలతో పాటు తర్వాత వచ్చే సాధారణ ఎన్నికల్లోనూ పేపర్ బ్యాలెట్ విధానంలోనే ఎన్నికలు నిర్వహించాలని కేంద్ర ఎన్నికల సంఘానికి విజ్ఞప్తి చేశామని కేటీఆర్ పేర్కొన్నారు. కేంద్ర ఎన్నికల సంఘంతో సమావేశం అనంతరం కేటీఆర్ ఢిల్లీలో మీడియాతో మాట్లాడారు. ఇవాళ ఈసీ ముందు ఆరేడు విషయాలు కుండబద్దలు కొట్టినట్టు మా పార్టీ అభిప్రాయం చెప్పాం. అందులో ఒకటి ప్రపంచ వ్యాప్తంగా ఈ రోజు అమెరికా లాంటి దేశాలు కానీ, యూకే, జర్మనీ, ఇటలీ కానీ, ఇంకా చాలా దేశాలు కొంతకాలం వరకు ఈవీఎంలను ప్రయోగాత్మకంగా అమలు చేసినప్పటికీ, ప్రజల్లో వాటిపై విశ్వాసం లేకుండా పోయింది. ఈ క్రమంలో ఈవీఎంలను రద్దు చేసి పేపర్ బ్యాలెట్ విధానాన్ని అమలు చేస్తున్నాయి. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమైన భారత్‌లో దాదాపు 100 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. ఇలాంటి దేశంలో ఈవీఎంల వల్ల నష్టం జరుగుతున్నది. మేం వేసిన వారికి ఓటు పడడం లేదని ప్రజల్లో అభిప్రాయం వ్యక్తమవుతున్నది. ఈ క్రమంలో ఈవీఎంలను పక్కనపెట్టి, పేపర్ బ్యాలెట్‌లను తేవాలని మా పార్టీ తరఫున ఎన్నికల కమిషన్‌ను కోరాం. పేపర్ బ్యాలెట్ విధానాన్ని నవంబర్‌లో జరిగే బీహార్ ఎన్నికల్లో అమలు చేయాలని కోరాం. ఆ తర్వాత వచ్చే సాధారణ ఎన్నికల్లోనూ పేపర్ బ్యాలెట్ విధానం అమలు చేయాలని మా పార్టీ తరఫున కుండబద్దలు కొట్టినట్టు మా పార్టీ అభిప్రాయం చెప్పామని కేటీఆర్ తెలిపారు.

**ఆ పార్టీని శిక్షించాల్సిన బాధ్యత కూడా ఈసీ మీద ఉంది..**

ఎన్నికల సమయంలో పార్టీలు ఇచ్చే అడ్డగోలు హామీలు, తెలంగాణలో చూస్తే కాంగ్రెస్ పార్టీ ఇష్టమొచ్చినట్టు 420 హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసి మభ్యపెట్టి గెలిచింది. ఈ విషయాలన్నీంటిని ఈసీకి వివరంగా చెప్పాం. ఎన్నికల్లో ఇచ్చిన మేనిఫెస్టోకి రాజకీయ పార్టీలు కట్టుబడి ఉండకపోతే తప్పకుండా ఆ పార్టీని శిక్షించాల్సిన బాధ్యత కూడా ఈసీ మీద ఉంది. ఎన్నికల్లో ప్రజలను వంచించే ఏ పార్టీ అయినా అధికారంలోకి వచ్చాక మోసం చేస్తే సభ్యత్వాన్ని రద్దు చేసే విధంగా, ఎన్నికల్లో పాల్గొనకుండా అనర్హులుగా ప్రకటించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశామని కేటీఆర్ పేర్కొన్నారు. ఇండియాలో ఎన్నికల సంస్కరణలు రావాలి. ప్రజలను ప్రలోభ పెట్టుడుతున్న పార్టీలు, వంచిస్తున్న విషయాలపై చర్చ జరిగిందని కేటీఆర్ తెలిపారు.

## పాలనైనా.. గ్రౌండ్ గేమ్ ఐనా, అమిత్ షా ది గ్రేట్: బండి సంజయ్



**ఇంటర్నెట్ డెస్క్:** భారతదేశంలో అత్యంత ఎక్కువ కాలం కేంద్ర హోం మంత్రిగా తన పేరును చరిత్రలో లిఖించుకున్నారు అమిత్ షా అంటూ కీర్తించారు తెలంగాణ బీజేపీ సీనియర్ నేత, కేంద్ర హోం మంత్రిత్వశాఖ సహాయమంత్రి బండి సంజయ్. తన ప్రభావవంతమైన నిర్ణయాలతో, అమిత్ షా.. 2,258 రోజులు పదవిలో ఉన్నారని బండి చెప్పారు. ఆర్టికల్ 370 రద్దు మొదలు, భారతదేశ అంతర్గత భద్రతా నిర్మాణాన్ని పునర్నిర్మించడం వరకు, అమిత్ షా.. మంత్రిత్వ శాఖలో గడిపిన సమయం అసాధారణమైనదని బండి సంజయ్ అన్నారు. 'అమిత్ షా గౌరవనీయ మార్గదర్శకత్వం.. గౌరవనీయ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ గారి నాయకత్వంలో నేను నేర్చుకోగలిగినందుకు, పని చేయగలిగినందుకు నిజంగా అదృష్టంగా భావిస్తున్నా' అంటూ బండి సంజయ్ తన సంతోషాన్ని వ్యక్తం చేశారు. పాలన అయినా లేదా గ్రౌండ్ గేమ్ అయినా, అమిత్ షా భారత రాజకీయాలపై ఆయనకున్న పట్టును ఎవరూ సరిపోల్చలేరంటూ అమిత్ షాను ఆకాశానికెత్తారు బండి సంజయ్. ఈ మేరకు తన ఎక్స్ ఖాతాలో ట్వీట్ చేశారు.

వార్తాతరంగాలు
మంగళవారం 05 ఆగస్టు 2025

# చెరువుల బాధ్యత గ్రామస్థులకే ఎమ్మెల్యే కోమటిరెడ్డి



నల్లగొండ:ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజ్ గోపాల్ రెడ్డి మంగళవారం ఉదయం మార్నింగ్ వాక్ లో భాగంగా చెరువులను పరిశీలించారు. గత ప్రభుత్వం మిషన్ కాకతీయ అని చెప్పి వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసింది. కాంట్రాక్టర్లు తూతూ మంత్రంగా పనిచేసే వేల కోట్ల రూపాయలు దోచుకున్నారు. గ్రౌండ్ లెవెల్ లో మిషన్ కాకతీయ పనులు సక్సెస్ కాలేదు. చెరువుల పునర్నిర్మాణంలో అందరూ భాగస్వామ్యం కావాలని అన్నారు. చెరువులను అభివృద్ధి చేసుకునే బాధ్యత గ్రామస్తులకు అప్పగిస్తాం. కబ్జాకు గురైన చెరువులను సర్వే చేసి హద్దులను ఫిక్స్ చేయాలని ఆర్డీవోకు ఆదేశం ఇచ్చామని అన్నారు.

## ఫిజిక్స్ గెస్ట్ ఫ్యాకల్టీ నియామకం కొరకు దరఖాస్తుల ఆహ్వానం




**మంథని:**మంథని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఫిజిక్స్ ను (భౌతికశాస్త్రం) బోధించడానికి ఆసక్తి ఉండి అర్హత కలిగిన అభ్యర్థుల నుండి ఖాళీ గా ఉన్న ఒక గెస్ట్ ఫ్యాకల్టీ నియామకం కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జై కిషన్ ఓఝూ తెలిపారు. కళాశాలలో ఫిజిక్స్ బోధించే ఒక్క పోస్టు ఖాళీగా ఉందని,ఎమ్మెస్సీ ఫిజిక్స్ సబ్జెక్ట్ లో కనీసం 55శాతం, ఎస్సీ,ఎస్టీలుఅభ్యర్థులు 50శాతం మార్కులు పొంది ఉండాలన్నారు. సంబంధిత సబ్జెక్టు ఎమ్మెస్సీ ఫిజిక్స్ లో ఎన్ఈటి/ ఎస్ఈటి/ ఎస్ఎల్ఈటి / పీహెచ్డీ కలిగిన అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని తెలిపారు.డిగ్రీ కళాశాలలో బోధనానుభవం ఉన్న వారికి కూడా తగిన ప్రాధాన్యత ఇవ్వబడుతుందని ఆసక్తి ఉన్న మరియు అర్హతలు కలిగిన అభ్యర్థులు వారి విద్యార్హతలను తెలియజేసే సర్టిఫికెట్స్ నకలు కాపీ తో పాటు ఫోటో అంటించిన వారి బయో డేటా ఫారం ను కళాశాల కార్యాలయంలో ఈ నెల12న సాయంత్రం నాలుగు గంటల లోపు అందజేయలన్నారు.ఇంటర్వ్యూ అండ్ డెమో క్లాస్ నిర్వహించబడునని,ఇంటర్వ్యూ తేది సకాలంలో సమర్పించిన దరఖాస్తులను పరిశీలించి షార్ట్ లిస్ట్ చేసిన తరువాత ఫోన్ ద్వారా మరియు మెసేజ్ ద్వారా తెలియజేయబడునని, ఇంటర్వ్యూ రోజు అభ్యర్థులు వారి ఒరిజినల్ సర్టిఫికెట్స్ తీసుకొని ఉదయం 10:00 గంటల వరకు, కాలేజీ నందు రిపోర్టు చేయగలరని ప్రిన్సిపల్ ప్రొఫెసర్ జై కిషన్ ఓఝూ తెలియజేశారు.

## రామచంద్రరావుకు ఘన స్వాగతం

**పెద్దపల్లి:**బిజెపి తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడిగా పదవి బాధ్యతలు చేపట్టి తొలిసారి పెద్దపల్లి పర్యటనకు వచ్చిన రామచంద్ర రావు కు బిజెపి నాయకులు, కార్యకర్తలు సుల్తానాబాద్ లో ఘన స్వాగతం పలికారు. తెలంగాణ చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహానికి అయన పూల మాలలు వేసి నివాళులర్పించారు. పెద్దపల్లి లో బిజెపి రాష్ట్ర అధ్యక్షులు రామచందర్ రావు ర్యాలీలో బిజెపి కార్యకర్తలు బాహాబాహికి దిగారు. గుజ్జుల రామకృష్ణారెడ్డి, దుగ్యాల ప్రదీప్ రావు వర్గాలకు చెందిన కార్యకర్తల మధ్య తోపులాట జరిగింది. అగ్ర నేతల జోక్యంతో వివాదం సద్దుమణిగింది.

## మోడి గిఫ్ట్ పదవ తరగతి విద్యార్థులకు సైకిల్ ల పంపిణీ




**చొప్పదండి:**కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు,కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ జన్మదిన వేడుకల సందర్భంగా ప్రకటించిన సైకిళ్ల పంపిణీ (మోడీ గిఫ్ట్) కరీంనగర్ జిల్లా గంగాధర మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న 220 మంది పదవ తరగతి విద్యార్థులకు సైకిల్ పంపిణీ చేయడం చాలా శుభ పరిమాణమమని గంగాధర మండల బీజేపీ అధ్యక్షులు పంజాల ప్రశాంత్ గౌడ్ అన్నారు.ఈ సందర్భంగా గంగాధర మండల కేంద్రంలోని జెడ్పిహెచ్ఎస్ హైస్కూల్లో చదువుతున్నటువంటి 40 మంది విద్యార్థిని విద్యార్థులకు మంగళవారం సైకిల్ లు పంపిణీ చేసిన అనంతరం బీజేపీ మండల అధ్యక్షులు పంజాల ప్రశాంత్ మాట్లాడుతూ పదవ తరగతి విద్యార్థులు మంచి ఉత్తీర్ణత సాధించడం కోసం ఈ సైకిల్ ఎంతగానో ఉపయోగపడుతుందని అన్నారు.ఈ సైకిల్ లు పంపిణీ కోసం సహకరించిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని ఈ సందర్భంగా విద్యార్థిని విద్యార్థులు చెప్పడం జరిగిందని తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల ఎంఈఓ ప్రభాకర్ రావు,గంగాధర ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీలత,జిల్లా కోశాధికారి వైద రామానుజం,అసెంబ్లీ కన్వీనర్ పెరుక శ్రావణ్ కుమార్,ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు దూలం కళ్యాణ్,మాజీ మండల అధ్యక్షులు కోలా అశోక్, సదాల భాస్కర్ జిల్లా కౌన్సిల్ నెంబర్,గాలిపెల్లి శ్రీనివాస్ మాజీ ఉప సర్పంచ్, తాళ్ల రాజశేఖర్ ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడు, మూత నర్సింహారెడ్డి ,రేండ్ల శ్రీనివాస్ బిజెపి మండల ప్రధాన కార్యదర్శి, జిల్లా నాయకులు వినుకొండ నరసింహారెడ్డి,సుద్దాల రవీందర్ రెడ్డి,పెంచాల రాములు,ఆకుల మనోహర్,సర్వ శ్రీనివాస్, విజయేందర్ రెడ్డి,జాతర కొండ మహేష్ దెయ్యాల ప్రణయ్,తుమ్ కరుణాకర్, దేశెట్టి శ్రీనివాస్,పృద్వి గౌడ్, పెరుక మహేష్ కట్ల శ్రీనివాస్,గరిగంటి సుమన్, విద్యార్థుల తల్లిదండ్రులు బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే హెచ్చరిక.. ఆ పనులకు అడ్డురావొద్దు



**హైదరాబాద్:** నాగోల్ బండ్లగూడలో రామాలయ పునర్నిర్మాణ పనులను ప్రైవేటు వ్యక్తులు అడ్డుకోవాలని చూస్తే కఠిన చర్యలు తప్పవని ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి( హెచ్చరించారు. ఆల య పునర్నిర్మాణపనులు చేపడుతుంటే పక్కనే ఉన్న ఓ ప్రైవేటు వ్యక్తి ఆలయం మధ్యలోంచి దారి వదలాలంటూ పలు రకాలుగా ఇబ్బందులు పెడుతున్నాడని ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. వారి విన్నపం మేరకు సోమవారం జీహెచ్ఎంసీ అధికారులతో కలిసి ఆ ప్రాంతాన్ని సందర్శించారు. అందుకు సంబంధించిన పత్రాలను పరిశీలించిన అధికారులు ప్రైవేటు వ్యక్తి వద్ద ఉన్న పత్రాలు నకిలీవిగా తేల్చిచెప్పారు. అదేవిధంగా ఇటీవల రజక, హిందూ శ్మశానవాటిక వద్ద గల సుమారు వంద గజాల స్థలం కబ్జా చేసి చేపట్టిన నిర్మాణాలను అధికారులు కూల్చివేయ గా మళ్లీ ఇదే వ్యక్తులు కబ్జాకు యత్నిస్తున్నారని బండ్లగూడ గ్రామస్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ స్థలాలు కబ్జాకు పాల్పడితే చూస్తూ ఊరుకోమని, కబ్జా చేయకుండా అట్టి స్థలంలో వెంటనే ప్రహరీ నిర్మించాలని అధికారులకు సూచించారు.

# కాళేశ్వరం కమిషన్ తో కుదుపు



**కరీంగనర్ , ఆగస్టు5:**కాళేశ్వరం కమిషన్ నివేదిక బీఆర్ఎస్ పార్టీలో కుదుపు మొదలైందా? ఆ పార్టీ నేతలు ఆలోచనలో పడ్డారా? బీఆర్ఎస్‌లో పొలిటికల్ కెరీర్ ఉండదని కొందరు నేతలు డిసైడ్ అయ్యారా? దాదాపు డజను మంది మాజీ ఎమ్మెల్యేలు పార్టీ మారేందుకు సిద్ధమయ్యారా? వీరితోపాటు మరో ఐదుగురు ఎమ్మెల్యేలు ఉన్నారా? జరుగుతున్న పరిణామాలతో బీఆర్ఎస్ కీలక నేతలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారా? అవుననే సంకేతాలు ఆ పార్టీ వర్గాల నుంచి బలంగా వినిపిస్తోంది. కాళేశ్వరం ప్రాజెక్టులో భారీ అవకతవకలు జరిగినట్టు జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ తేల్చి చెప్పింది. దీనిపై సోమవారం సాయంత్రం సీఎం రేవంత్ మొదలు కీలక మంత్రులంతా మీడియా ముందుకు వచ్చి చెప్పాల్సింది చెప్పారు. దీనిపై అసెంబ్లీలో చర్చిస్తామని, ఆ తర్వాత ఏం చెయ్యాలి అనేదానిపై నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు సీఎం రేవంత్‌రెడ్డి. కాళేశ్వరం కమిషన్ రిపోర్టుపై రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏ విధంగా అడుగులు వేయబోతోంది? అధికార పార్టీ తీసుకోబోయే నిర్ణయాలు బీఆర్ఎస్ పార్టీ భవిష్యత్తు ఏంటన్నది ఆధారపడి ఉంటుందా? కమిషన్ నివేదికను కారు పార్టీ నేతలు తప్పుబట్టే ప్రయత్నం చేస్తున్నారు. దీనిపై సిట్ ఏర్పాటు చేస్తే ప్రభుత్వానికి అనుకూలంగా దర్యాప్తు చేస్తుందని ఆ పార్టీ నేతలు రీసౌండ్ చేస్తారని భావిస్తోంది. అదే సీబీఐకి ఇస్తే ఏ విధంగా ఉంటుందనే ఆలోచన చేస్తోందట అధికార పార్టీ. ఇప్పుడు అధికార పార్టీ ఏ విధంగా అడుగులు వేస్తుందనేది అసలు ప్రశ్న. కమిషన్ రిపోర్టు బయటకు రాగానే పార్టీ నేతలతో కేసీఆర్ కీలక వ్యాఖ్యలు చేశారు. నివేదికపై దాదాపు ఆరుగంటలకు పైగానే చర్చించారు. సోమవారం నాడు జరిగిన.. జరుగుతున్న పరిణామాలను గమనించిన కేసీఆర్, నేతలను అలర్ట్ చేశారు. దర్యాప్తు పేరుతో ఎప్పుడైనా, ఎవరినైనా అరెస్టు చేసే ఛాన్స్ ఉందని చెప్పకనే చెప్పారు. ఈ విషయంలో జాగ్రత్తగా ఉండాలని నేతలను హెచ్చరించారు. ఆనాటి మంత్రులతోపాటు తనను విచారణకు పిలిచి అరెస్టు చేస్తారని ముందుగానే సంకేతాలు ఇచ్చారు పెద్దాయన. జరుగుతున్న పరిణామాలను గమనిస్తున్న బీఆర్ఎస్ నేతలు ఆలోచనలోపడ్డారు. ఈ గండం నుంచి గట్టెక్కాలంటే బీజేపీ సాయం లేకుంటే కష్టమని అంటున్నారు. పార్టీని విలీనం చేయాలని బీజేపీ డిమాండ్ చేస్తే పరిస్థితి ఉందని అనుకుంటున్నారు. అలా చేసే బదులు మనకు జారుకుంటే బెటరని దాదాపు డజను మాజీ ఎమ్మెల్యేలు ఓ అంచనాకు వచ్చినట్టు తెలుస్తోంది. వీరు కాకుండా మరో ఐదుగురు ఎమ్మెల్యేలు పార్టీ మారే పనిలో ఉన్నట్లు ఫీలర్లు వస్తున్నాయి. పార్టీ మారే విషయంలో జాతీయ పార్టీల నుంచి స్పష్టమైన హామీ వచ్చిన తర్వాత జాయిన్ కావాలని ఆలోచన చేస్తున్నారట. ఏ నీళ్ల కోసం కొట్లాడి తెలంగాణను సాధించామని బీఆర్ఎస్ నేతలు పదేపదే రాజకీయ స్పీచ్‌లు ఇస్తున్నారు. అదే నీటి ప్రాజెక్టు కారు పార్టీని నిట్ట నిలువునా ముంచేసిందనే చెప్పవచ్చు

**కాకా రేపుతున్న రాజీనామాలు**

బీఆర్ఎస్ పార్టీకి మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు బిగ్ షాక్ ఇచ్చారు. పార్టీకి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను పార్టీ చీఫ్ కేసీఆర్‌కు పంపించారు. ఈ లేఖలో ఆయన కీలక విషయాలను ప్రస్తావించారు. రాజీనామా నిర్ణయం అంత ఈజీగా తీసుకున్నది కాదని.. ఎంతో ఆలోచించి, ఎన్నో విషయాలను పరిగణలోకి తీసుకున్న తర్వాత బాధతో పార్టీ నుంచి తప్పుకుంటున్నట్లు తెలిపారు. గత రెండు దశాబ్దాలుగా కేసీఆర్ నాయకత్వంలో పనిచేయడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ఈ సమయంలో ఎన్నో విషయాలు నేర్చుకున్నట్లు తెలిపారు. కేసీఆర్ వల్లే తాను ఈ స్థాయిలో ఉన్నట్లు తెలిపిన గువ్వల.. కష్ట సమయంలో పార్టీని వీడడం బాధగా ఉందన్నారు. అయినా భవిష్యత్తు కోసం తప్పడం లేదని లేఖలో తెలిపారు.కాగా గువ్వల బీజేపీలో చేరనున్నట్లు తెలుస్తోంది. గువ్వలతో పాటు మరో ఇద్దరు మాజీ ఎమ్మెల్యేలు సైతం ఈ నెల 10న కమలం కండువా కప్పుకోనున్నట్లు సమాచారం. కాగా 2009లో నాగర్ కర్నూల్ లోక్‌సభ స్థానం నుంచి ఎంపీగా పోటీ చేసిన గువ్వల మంద జగన్నాథం చేతిలో ఓడిపోయారు. ఆ తర్వాత 2014లో అచ్చంపేట నుంచి పోటీ చేసి కాంగ్రెస్ అభ్యర్థి వంశీకృష్ణపై భారీ మెజార్టీతో గెలించారు. 2018లోనూ మరోసారి విజయకేతనం ఎగురవేశారు. 2022లో నాగర్ కర్నూల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టారు. ఇక 2023లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో చిక్కుడు వంశీకృష్ణ చేతిలో ఓడిపోయారు. ఈ క్రమంలో బీజేపీలో చేరాలని నిర్ణయించుకుని పార్టీకి రాజీనామా చేసినట్లు తెలుస్తోంది.కాగా ఇప్పటికే పలువురు ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారిపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ సుప్రీం కోర్టును ఆశ్రయింగా.. ప్రస్తుతం బంతి స్పీకర్ కోర్టులో ఉంది. మూడు నెలల్లోగా స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని సుప్రీం చెప్పింది. అంతేకాకుండా పలువురు కీలక నేతలు సైతం ఇతర పార్టీల్లోకి వెళ్లారు. ఇప్పుడు గువ్వల బాలరాజు సైతం ఆ లిస్ట్‌లో చేరారు. అయితే ఎవరు పోయిన పార్టీకి వచ్చిన నష్టం ఏమిలేదని గతంలో కేటీఆర్ వ్యాఖ్యానించారు. తాజాగా గువ్వల రాజీనామాపై ఎలా స్పందిస్తారో చూడాలి.

# నల్గొండ, ఖమ్మం జిల్లాలకు మహర్దశ



**నల్గోండ, ఆగస్టు 5:**ఏ పట్టణానికి అయినా.. ఔటర్ రింగ్ రోడ్డు వస్తుందంటే ఈ ప్రాంతవాసులకు ఎంతో సంతోషం కలుగుతుంది. ఆ ప్రాంత ప్రజలతో పాటు.. చుట్టు పక్కల గ్రామాలకు కూడా ఆ రింగ్ రోడ్డు వల్ల ఎన్నో ఉపయోగాలు ఉంటాయి. రింగ్ రోడ్డును ఆనుకొని ఉన్న భూముల ధరలకు రెక్కలు వస్తాయి. అంతే కాకుండా.. రహదారుల సౌకర్యం పెరిగి, వాణిజ్య కార్యకలాపాలు విస్తరిస్తాయి. ఇప్పటికే తెలంగాణలో హైదరాబాద్ చుట్టూ నెహ్రూ ఔటర్ రింగ్ రోడ్డు ఏర్పాటు చేసిన విషయం అందరికీ తెలిసిందే.. తాజాగా సూర్యాపేట చుట్టూ ఔటర్ రింగ్ రోడ్డు ఏర్పాటు చేసే విధంగా అధికారులు ప్లాన్ సిద్ధం చేశారు.సూర్యాపేట పట్టణ అభివృద్ధికి సరికొత్త అడుగులు పడుతున్నాయి. 2045 వరకు పట్టణ భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకొని.. అధికారులు ఒక సమగ్రమైన మాస్టర్ ప్లాన్‌ను రూపొందించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందజేశారు. ఇది సూర్యాపేట రూపురేఖలను సమూలంగా మార్చనుంది. గతంలో 1982 నాటి జనాభా ఆధారంగా రూపొందించిన పాత మాస్టర్ ప్లానే నేటికీ అమలవుతుండటంతో.. స్థానికులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా బఫర్, గ్రీన్ జోన్‌లలో ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు లభించక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ కొత్త ప్రణాళికతో పట్టణ జనాభా పెరుగుదలకు అనుగుణంగా ఆదాయ వనరులు కూడా పెరుగుతాయని ఆశిస్తున్నారు.మున్సిపల్ ప్లానింగ్ విభాగం రూపొందించిన ఈ మాస్టర్ ప్లాన్‌ను ప్రభుత్వం త్వరలోనే పరిశీలించి గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసే అవకాశం ఉంది. రాబోయే 20 సంవత్సరాల కాలాన్ని దృష్టిలో ఉంచుకొని.. ఈ నూతన మాస్టర్ ప్లాన్‌ను రూపొందించారు. గతంలో సూర్యాపేట పట్టణం 24 చదరపు మైళ్ల మేర విస్తరించి ఉండగా.. కొత్త ప్రణాళిక ప్రకారం ఇది 93.48 చదరపు మైళ్లకు విస్తరించనుంది. దాదాపు 950 కిలోమీటర్ల రోడ్లతో పట్టణం అభివృద్ధి చెందుతుంది. 2018లో మున్సిపాలిటీలో కలిసిన దురాజ్‌పల్లి, కుడకుడ, కుసుమవారిగూడెం, కుప్పిరెడ్డిగూడెం, రాయినిగూడెం వంటి ప్రాంతాలు కూడా ఈ కొత్త మాస్టర్ ప్లాన్ పరిధిలోకి వస్తాయి.ప్రస్తుతం పెరిగిన జనాభాతో పాటు.. రాబోయే 20 ఏళ్లలో పెరిగే అదనపు జనాభాను.. అలాగే ఆదాయ వనరులను దృష్టిలో పెట్టుకొని ఈ ప్రణాళికను రూపొందించారు. రోడ్లు, పార్కులు, వీధి దీపాలు, రవాణా వ్యవస్థ, డంపింగ్ యార్డులు, తాగునీటి వసతులు, ప్రజల మరుగుదొడ్లు, విద్య, వాణిజ్య సంస్థలు, కూడళ్లు, ఐటీ కేంద్రాలు, వైద్య కళాశాల, పర్యాటకం, పచ్చని ప్రాంతాలు వంటి మౌలిక వసతులను కల్పించేందుకు ఈ మాస్టర్ ప్లాన్ తయారు చేశారు.సూర్యాపేటకు ఒక ఔటర్ రింగ్ రోడ్డు (ఓఆర్ఆర్) నిర్మించడానికి అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి నివేదించారు. ఖమ్మం బైపాస్ రోడ్డు నుంచి బుర్కపేట తండా, కొత్త కలెక్టరేట్, దురాజ్‌పల్లి, కుసుమవారిగూడెం చుట్టూ రింగ్ రోడ్డు నిర్మించేలా ప్రణాళిక రూపొందించారు. ముసాయిదాకు ఆమోదం లభించాక.. ప్రజల సలహాలు, సూచనలు స్వీకరించి తుది రూపు ఇవ్వనున్నారు. ఈ ఔటర్ రింగ్ రోడ్డు నిర్మాణంతో సూర్యాపేట చుట్టుపక్కల ప్రాంతాలకు అభివృద్ధి వేగం పుంజుకుంటుంది. రహదారుల సౌకర్యం పెరిగి, వాణిజ్య కార్యకలాపాలు విస్తరిస్తాయి. దీంతో ఆ ప్రాంతాల్లోని భూముల ధరలకు రెక్కలు వచ్చి.. స్థానికులకు ఆర్థికంగా మేలు జరగనుంది.ప్రస్తుతం సూర్యాపేట పట్టణంలోని కొత్త వ్యవసాయ మార్కెట్ రోడ్డు, శాంతినగర్, శబరినగర్, కొత్త బస్టాండ్ ఎదురు భాగం వంటి ప్రాంతాలు పారిశ్రామిక జోన్‌లో ఉన్నాయి. వీటితో పాటు సద్దుల చెరువు పక్కన ఉన్న కాలనీలు బఫర్ జోన్‌లో ఉండటంతో.. ఇక్కడ నిర్మాణాలకు మున్సిపాలిటీ అనుమతులు ఇచ్చేది కాదు. దీంతో చాలామంది అనుమతులు లేకుండానే ఇళ్లను నిర్మించుకుంటున్నారు. దీనివల్ల మున్సిపాలిటీ ఏటా దాదాపు రూ. 100 కోట్లకు పైగా ఆదాయాన్ని కోల్పోతోంది.అయితే.. నూతన మాస్టర్ ప్లాన్ ప్రకారం.. ఈ ప్రాంతాలన్నీ నివాసిత జోన్లుగా మారనున్నాయి. ఎస్పీ ఆఫీస్ సమీపంలో ప్రజల అవసరాల కోసం కొత్త ప్రతిపాదనలు చేశారు. దీనివల్ల ఈ ప్రాంతాల్లో ఇళ్ల నిర్మాణాలకు అనుమతులు సులభంగా లభించడంతో పాటు, మున్సిపాలిటీకి ఆదాయం గణనీయంగా పెరుగుతుంది. మొత్తంగా.. ఈ కొత్త మాస్టర్ ప్లాన్ సూర్యాపేటను ఒక ఆధునిక, సుందరమైన పట్టణంగా తీర్చిదిద్ది.. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తుంది.ఇదిలా ఉండగా.. ఇటీవల సూర్యాపేట మీదుగా రెండు రైల్వే లైన్లకు ఆమోదం తెలిపింది రైల్వే శాఖ. ఒకటి శంషాబాద్ నుంచి విశాఖపట్నం వరకు ఉండగా.. ఇది సూర్యాపేట మీదుగా వెళ్లనుంది. మరొకటి.. డోర్నకల్ నుంచి గద్వాల రైల్వే లైన్ నిర్మాణానికి కూడా అనుమతి లభించింది. వీటి నిర్మాణాలు కూడా పూర్తయితే.. సూర్యాపేట జిల్లా సమగ్రంగా అభివృద్ధి దిశలో దూసుకుపోనుంది.

# ఏడు నెలలు...148 మంది అధికారులు

**ప్రతి 3 రోజులలో ఇద్దరు ట్రాప్**

**కొనసాగుతున్న ఏసీబీ దూకుడు**




**హైదరాబాద్, ఆగస్టు5:**తెలంగాణ ఏసీబీ జనవరి నుంచి జూలై వరకు 148 కేసులు నమోదు చేసింది. 93 ట్రాప్ కేసులు, 9 ఆదాయానికి మించిన ఆస్తుల కేసులు, 15 క్రిమినల్ దుష్ప్రవర్తన కేసులు, 11 రెగ్యులర్ ఎంక్వైరీలు, 17 ఆకస్మిక తనిఖీలు ఉన్నట్లు వెల్లడించింది.గత కొద్ది నెలలుగా తెలంగాణ ఏసీబీ దూకుడుగా ముందుకెళ్తోంది. అవినీతి అధికారులను పక్కాగా పట్టేసుకునే పనిలో ఉంటోంది. గతేడాది కూడా భారీగానే కేసుల సంఖ్య నమోదైంది. ఈ ఏడాదిలోనూ ఎక్కువ సంఖ్యలోనే అధికారులు, సిబ్బంది చిక్కుతున్నారు. జనవరి నుంచి జూలై నెల వరకు నమోదైన కేసుల వివరాలను ఏసీబీ ఓ ప్రకటన ద్వారా వెల్లడించింది.తెలంగాణ అవినీతి నిరోధక శాఖ%ొ% (ఏసీబీ) జూలైలో 13 ట్రాప్ కేసులు నమోదు చేసింది. అంతేకాకుండా ఒక ఆదాయానికి మించిన ఆస్తుల కేసు, ఒక క్రిమినల్ దుష్ప్రవర్తన కేసు, ఒక సాధారణ విచారణ, ఆరు ఆకస్మిక తనిఖీలతో సహా మొత్తం 22 కేసులను నమోదు చేసింది.ఇద్దరు ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు/ప్రైవేటు వ్యక్తులతో సహా 20 మంది ప్రభుత్వ ఉద్యోగులను ట్రాప్ చేసి అరెస్టు చేసి రిమాండ్ కు తరలించినట్లు ఏసీబీ అధికారి ఒకరు తెలిపారు. వివిధ శాఖల ట్రాప్ కేసుల్లో రూ.5.75 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. అక్రమాస్తుల కేసులో రూ.11.5 కోట్ల విలువైన ఆస్తులు బయటపడ్డాయి. ఆర్టీఏ చెక్ పోస్టులు, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో నిర్వహించిన ఆకస్మిక తనిఖీల్లో లెక్కల్లో చూపని రూ.1.49 లక్షలు పట్టుబడ్డాయి.2025 జనవరి నుంచి జూలై మధ్య కాలంలో ఏసీబీ 148 కేసులను నమోదు చేసింది. 93 ట్రాప్ కేసులు, 9 ఆదాయానికి మించిన ఆస్తుల కేసులు, 15 క్రిమినల్ దుష్ప్రవర్తన కేసులు, 11 రెగ్యులర్ ఎంక్వైరీలు, 17 ఆకస్మిక తనిఖీలు మరియు 3 వివేకవంతమైన విచారణలు ఉన్నాయి. 10 మంది ఔట్ సోర్సింగ్ ఉద్యోగులు / ప్రైవేట్ వ్యక్తులతో సహా 145 మంది ప్రభుత్వ ఉద్యోగుల ట్రాప్ కేసులలో 30 లక్షల రూపాయలను స్వాధీనం చేసుకున్నారు.2025 జూలైలో%ొ%. 21 కేసులను ఖరారు చేసి తుది నివేదికలను ఏసీబీ ప్రభుత్వానికి పంపింది. జనవరి 2025 నుంచి జూలై 2025 మధ్య కాలంలో నమోదైన కేసులను కూడా ఖరారు చేసి తుది నివేదికలను ప్రభుత్వానికి అందజేసింది.ఏసీబీ డైరెక్టర్ జనరల్%ొ% ఈ నెల 23న అర్థ వార్షిక క్రైమ్ రివ్యూ మీటింగ్ నిర్వహించారు. దీర్ఘకాలంగా పెండింగ్ లో ఉన్న కేసులను సమీక్షించి దర్యాప్తు వేగవంతం చేసి ప్రధాన కార్యాలయానికి నివేదికలు సమర్పించాలని దర్యాప్తు అధికారులను ఆదేశించారు. అధికారుల పనితీరును కూడా అభినందించారు.ఇక 2024 ఏడాదిలో వివిధ ప్రభుత్వ శాఖల్లో లంచాలకు మరిగిన సుమారు 170 మంది అధికారులను అరెస్టు చేసింది. ముఖ్యంగా రెవెన్యూ, పోలీస్, పంచాయతీ రాజ్, స్టాంపులు, రిజిస్ట్రేషన్ శాఖల్లో ఎక్కువమంది అధికారులు అవినీతికి పాల్పడ్డారు. ఏసీబీ అరెస్టు చేసిన వారిలో ఈ శాఖ అధికారులే ఎక్కువగా ఉన్నారు. అయితే ఈ ఏడాది నమోదయ్యే కేసుల సంఖ్య ఎక్కువగానే ఉండే అవకాశం కనిపిస్తోంది..!

## గవర్నర్ అశోక్ గజపతి రాజు దంపతులకు టిడిపి ఎంపీల సన్మానం

**కేంద్రమంత్రి పెమ్మసాని నివాసంలో అల్పాహార విందు**



**న్యూ ఢిల్లీ :**కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ ఆహ్వానం మేరకు ఢిల్లీలోని ఆయన నివాసానికి ఢిల్లీ పర్యటనలో వున్న గోవా గవర్నర్ అశోక్ గజపతి రాజు, సతీమణి సునీలా గజపతిరాజు మంగళవారం విచ్చేశారు. కేంద్ర మంత్రి పెమ్మసాని నివాసంలో ఏర్పాటు చేసిన అల్పాహార విందులో గవర్నర్ అశోక్ గజపతి రాజు దంపతులతో పాటు టిడిపి ఎంపీలు పాల్గొన్నారు. అనంతరం అశోక్ గజపతి రాజు–సునీలా గజపతి రాజులను టిడిపి ఎంపీలందరూ కలిసి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కేశినేని శివనాథ్, బైరెడ్డి శబరి,వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఉదయ్ శ్రీనివాస్, కలిశెట్టి అప్పల నాయుడు, ఎం.శ్రీ భరత్, రాజ్యసభ ఎంపీ లు సానా సతీష్, బీద మస్తాన్ రావు పాల్గొన్నారు.

# సినిమా



## జాతీయ అవార్డుల తీరుపై అసహనం



జాతీయ అవార్డులు ప్రకటించినపుడల్లా.. కొన్ని పురస్కారాల విషయంలో విమర్శలు, అభ్యంతరాలు వ్యక్తం కావడం మామూలే. ఐతే ఈసారి విమర్శలు కాస్త ఎక్కువగానే వచ్చాయి. ముఖ్యంగా ఉత్తమ నటుడి పురస్కారాన్ని 'జవాన్' సినిమాలో నటనకు గాను షారుఖ్ ఖాన్‌కు కట్టబెట్టడం మీద సర్వత్రా వ్యతిరేకత వచ్చింది. షారుఖ్ గొప్ప నటుడే అయినా.. తన కెరీర్లో అద్భుతంగా పెర్ఫామ్ చేసిన వేరే సినిమాలకు వదిలేసి.. 'జవాన్' లాంటి మామూలు చిత్రానికి అవార్డు ఇవ్వడమే చాలామందికి రుచించలేదు. పైగా పోటీలో ఉన్న నటుల పెర్ఫామెన్స్‌తో పోలిస్తే.. 'జవాన్'లో షారుఖ్ నటన సాధారణం అనే చెప్పాలి. ఎక్కువమంది జాతీయ అవార్డు వస్తుందని అంచనా వేసింది 'ది గోట్ లైఫ్: ఆడుజీవితం'లో పృథ్వీరాజ్ సుకుమారన్ చేసిన నజీబ్ పాత్రకే. అందులో జీవనోపాధి కోసం గల్ఫ్‌కు వెళ్లి అక్కడ గొర్రెల కాపరిగా మారిన వ్యక్తిగా పృథ్వీరాజ్ అత్యద్భుతంగా నటించాడు. కానీ ఈ పాత్రకు అవార్డు రాలేదు. పృథ్వీరాజ్‌కు అవార్డు రాకపోవడం మీద సీనియర్ నటి ఊర్వశి ఓపెన్‌గా జ్యూరీ తీరును ఎండగట్టేశారు. తెలుగు వారికి కూడా బాగా పరిచయం ఉన్న ఈ లెజెండరీ యాక్టర్.. తాజాగా ప్రకటించిన జాతీయ అవార్డుల్లో 'ఉల్లొలుకు' చిత్రానికి గాను ఉత్తమ సహాయ నటిగా ఎంపికైంది. అయినా సరే.. ఆమె పృథ్వీరాజ్ విషయంలో జరిగిన అన్యాయంపై గళం విప్పింది. నజీబ్ పాత్ర సామాన్యమైంది కానీ.. దాని కోసం పృథ్వీరాజ్ ప్రాణం పెట్టి పని చేశాడని.. ఒళ్లు హూనం చేసుకుని నటించాడని.. ఆ పాత్ర వెనుక నాలుగైదేళ్ల కష్టం దాగి ఉందని ఆమె పేర్కొంది.

## రజినీ చేసిన గొప్ప పని



సూపర్ స్టార్ రజినీకాంత్ తమిళనాట చాలా పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు చేస్తుంటారని.. అందుకోసం కోట్లు ఖర్చు పెడుతుంటారని చెబుతుంటారు. ఐతే ఆయన తన సినిమాలకు పని చేసే కాస్ట్ అండ్ క్రూను కూడా ఎంత బాగా చూసుకుంటారో అక్కినేని నాగార్జున వెల్లడించారు. సూపర్ స్టార్ లీడ్ రోల్ చేసిన 'కూలీ'లో నాగ్ విలన్ పాత్ర చేసిన సంగతి తెలిసిందే. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన ఈ సినిమా ప్రెస్ మీట్లో మాట్లాడుతూ.. రజినీది ఎంత గొప్ప మనసో ఒక ఉదాహరణతో చెప్పాడు నాగ్. 'కూలీ' సినిమాలో ఒక భారీ యాక్షన్ సీక్వెన్స్‌ను బ్యాంకాక్‌లో తెరకెక్కించినట్లు నాగ్ తెలిపాడు. ఒక షిప్ మీద 17 రోజుల పాటు పూర్తిగా నైట్ ఎఫెక్ట్‌లోనే ఈ సీక్వెన్స్ చిత్రీకరణ జరిగిందట. రజినీ కూడా అందులో పాల్గొన్నారని.. చాలా కష్టపడి, భారీ కాస్ట్ అండ్ క్రూతో ఈ సీక్వెన్స్ చేశామని నాగ్ వెల్లడించాడు. ఐతే మొత్తం చిత్రీకరణ పూర్తయ్యాక.. రజినీకాంత్ టీంలో అందరినీ పిలిచి వాళ్ల చేతుల్లో ఒక ప్యాకెట్ పెట్టారని నాగ్ తెలిపాడు. మొత్తం 350 మందికి తలో ప్యాకెట్ ఇచ్చారని.. అందులో డబ్బులు ఉన్నాయని.. వాటితో పిల్లల కోసం బ్యాంకాక్‌లో ఏమైనా కొనుక్కుని వెళ్లాలని రజినీ చెప్పినట్లు నాగ్ తెలిపారు. రజినీ ఇలా చేయాల్సిన అవసరం లేదని.. కానీ అంత మందికి సాయం చేసి తన పెద్ద మనసును రజినీ చాటుకున్నారని నాగ్ కొనియాడారు. రజినీతో ఈ సినిమా చేయడం తనకు మరపు రాని అనుభవమన్న నాగ్.. ఇందులో తనది విలన్ పాత్రే అయినా.. హీరో స్థాయిలో ఉంటుందని చెప్పాడు. రజినీ ఈ స్క్రిప్టు విని ఎలా అంగీకరించారా అని తాను ఆశ్చర్యపోయినట్లు నాగ్ తెలిపాడు. ఈ చిత్రంలో సౌబిన్ షాహిర్ పాత్ర మైండ్ బ్లోయింగ్‌గా ఉ:టుందని.. అతను అందరినీ జేబులో పెట్టుకుని వెళ్లిపోతాడని నాగ్ వ్యాఖ్యానించాడు.

## ఇబ్బంది పెట్టిన అనిరుధ్ ఎమోజీలు



మ్యూజిక్ సెన్సేషన్ అనిరుధ్ రవిచందర్ తాను కంపోజ్ చేసిన సినిమాల విడుదలకు ముందు సోషల్ మీడియాలో ఎమోజిలు పెడుతూ ఉంటాడు. వాటి ద్వారా మూవీ ఎంత పెద్ద హిట్టవుతుందో చెప్పడాన్ని ఫ్యాన్స్ సెంటిమెంట్ గా భావిస్తారు. ఈ ట్రెండ్ ని అనిరుధ్ జైలర్ తో మొదలుపెట్టాడు. అప్పటిదాకా ఫ్లాపుల్లో ఉన్న రజినీకాంత్‌కు అది బ్లాక్ బస్టర్ ఇవ్వడంతో అభిమానులు ఈ నమ్మకాన్ని మరింత పెంచుకున్నారు. దీంతో ఇతర నిర్మాతల నుంచి తమ రిలీజ్ టైంలో కూడా ఎమోజిలు పెట్టి హైప్ పెంచమని రిక్వెస్ట్ చేయడంతో కుర్రాడికి పెట్టక తప్పేది కాదు. తీరా చూస్తే ఫ్లాపులు పడుతున్న వైనం అనిరుధ్‌కి ఇబ్బందిగా మారింది. ఇదంతా అతనే ఒక ఇంటర్వ్యూలో చెప్పుకొచ్చాడు. ఎమోజిలు పెట్టడం వరకు బాగానే ఉంది కానీ, ఫెయిలవుతాయని తెలిసిన సినిమాలకు కూడా అలా పోస్ట్ చేయడం వల్ల తన తీర్పు తప్పుగా వెళ్తోందని చెప్పుకొచ్చాడు. అందుకే వాటిని పెట్టడం మానేశానని వివరించాడు. నిజానికి ఇండియన్ 2, విడాముయర్చి, వేట్టయన్ లాంటి వాటికి అనిరుధ్ పెట్టిన ట్వీట్లు దారుణంగా మిస్ ఫైర్ అయ్యాయి. మొహమాటానికి అతనవి పెడుతున్నట్టు మూవీ లవర్స్ కి అర్థమైపోయింది. అయితే కూలికి ఎమోజిలు అవసరం లేదని, పబ్లిక్ స్టేజి మీద చెబుతున్నాని, అంచనాలకు మించి అదిరిపోతుందని ప్రీ రిలీజ్ ఈవెంట్ లో హామీ ఇచ్చాడు. చూసేందుకు చిన్న విషయంలా కనిపించినా ఎమోజిల వ్యవహారం చాలా దూరమే వెళ్లిందన్న మాట. ఇదంతా పక్కనపెడితే అనిరుధ్ రేంజ్ బ్లాక్ బస్టర్ పడి బాగా గ్యాప్ వచ్చేసింది. దేవర తర్వాత మళ్ళీ తన మేజిక్ రిపీట్ కాలేదు. కూలి పాటలు బాగానే రీచ్ అయ్యాయి కానీ ట్రైలర్ లో బ్యాక్ గ్రౌండ్ స్కోర్ గురించి మిశ్రమ స్పందనే వినిపించింది.

## 5 కోట్లు మిగిలించడమంటే మాటలా



ఎంత పెద్ద క్యాస్టింగ్ ఉన్నా అనుకున్న టైంలో, చెప్పిన క్వాలిటీతో సినిమా తీయడం, అది కూడా వాయిదాలు లేకుండా చూసుకోవడంలో దర్శకుడు లోకేష్ కనగరాజ్ కు మంచి పేరుంది. కూలిలో నాలుగు బాషల నుంచి అతి పెద్ద మల్టీస్టారర్స్ ని సెట్ చేసుకుని కూడా చెప్పిన సమయానికి విడుదలకు సిద్ధం చేయడం మాములు విషయం కాదు. అనౌన్స్ మెంట్ వీడియో దగ్గరి నుంచి ట్రైలర్ దాకా అతను ఎంచుకున్న ప్రమోషనల్ స్ట్రాటజీ అంచనాలను ఎక్కడికో తీసుకెళ్లింది. అయితే బడ్జెట్ విషయంలో తను ఎంత పొదుపరో ఇవాళ హైదరాబాద్ లో జరిగిన ప్రీ రిలీజ్ ఈవెంట్ లో నాగార్జున ద్వారా బయటికి వచ్చింది.కూలీకి సంబంధించిన చివరి షెడ్యూల్ బ్యాంకాక్ లో తీస్తున్నారు. లాస్ట్ డే నాగార్జున దగ్గరికి వచ్చిన లోకేష్ షూటింగ్ అయిపోయిందని చెప్పాడు. దీని వల్ల నిర్మాత కళానిధి మారన్ కు 5 కోట్లు ఆదా అవుతాయని సంతోషంగా చెప్పాడు. దీంతో ఆశ్చర్యపోవడం నాగ్ వంతయ్యింది. నిజానికి ఒకవేళ ఇంకో 15 కోట్లు కావాలన్నా పెట్టేందుకు సన్ పిక్చర్స్ సిద్ధంగా ఉంది. అయినా సరే లోకేష్ అడ్వాంటేజ్ తీసుకోకుండా ప్రొడ్యూసర్ కి మిగిలించడం మంచి విషయం. అదేమీ చిన్న మొత్తం కాదు. ఆ డబ్బుతో మూడు రాష్ట్రాల్లో భారీ ఎత్తున పబ్లిసిటీని ఒంటి చేత్తో పూర్తి చేయొచ్చు. అందుకే ఈ పొదుపు విలువైంది. మన దగ్గర పూరి జగన్నాథ్, అనిల్ రావిపూడి లాంటి దర్శకులు ఇలా ఫాస్ట్ మేకింగ్ విత్ లిమిటెడ్ బడ్జెట్ సూత్రాన్ని పాటిస్తారు. కానీ ప్యాన్ ఇండియా ఉచ్చులో పడ్డ కొందరు డైరెక్టర్లు మాత్రం కాలయాపనతో పాటు నిర్మాతల పర్సులను బరువెక్కిస్తారు. కూలిని ఏడాదిలోపే పూర్తి చేసిన లోకేష్ కనగరాజ్ కోలీవుడ్ కు మొదటి వెయ్యి కోట్ల గ్రాసర్ ఇస్తాడనే అంచనాలు బలంగా ఉన్నాయి.

## ఆ సినిమా ఎందుకు ఆగిందంటే?




'మళ్ళీ రావా' లాంటి మంచి సినిమాతో దర్శకుడిగా పరిచయం అయ్యాడు గౌతమ్ తిన్ననూరి. ఫాంలో లేని సుమంత్‌తో ఆ సినిమా తీసి హిట్టు కొట్టడంతో తనకు మంచి గుర్తింపు వచ్చింది. ఇక నానితో చేసిన 'జెర్సీ' ఎంత గొప్ప సినిమాగా పేరు తెచ్చుకుందో తెలిసిందే. ఆ సినిమాతో అతడికి డిమాండ్ పెరిగి.. ఏకంగా మెగా పవర్ స్టార్ రామ్ చరణ్‌తో సినిమా చేసే అవకాశం అందుకున్నాడు. వీరి కలయికలో సినిమాకు దాదాపు అంతా సిద్ధమైనట్లే కనిపించింది. కానీ కొన్ని నెలల ప్రయాణం తర్వాత.. ఈ ప్రాజెక్టును గౌతమ్, చరణ్ క్యాన్సిల్ చేసుకున్నారు. మరి ఏమైందన్నది ఎవరికీ తెలియదు. తర్వాత విజయ్ దేవరకొండతో 'కింగ్డమ్'ను మొదలుపెట్టాడు గౌతమ్. చరణ్ రిజెక్ట్ చేసిన కథనే విజయ్‌తో గౌతమ్ తీశాడని ఒక టైంలో వార్తలు వచ్చాయి.కానీ అది నిజం కాదని తర్వాత తేలింది. తాజాగా ఒక ఇంటర్వ్యూలో గౌతమ్ సైతం ఈ విషయాన్ని ధ్రువీకరించాడు. చరణ్‌కు తాను చెప్పిన కథ వేరని.. విజయ్‌తో తీసింది వేరే కథ అని అతను స్పష్టం చేశాడు. చరణ్‌తో సినిమా ఎందుకు వర్కవుట్ కాలేదో కూడా అతను వెల్లడించాడు. ముందు గౌతమ్ చెప్పిన ఒక లైన్ నచ్చి చరణ్ సినిమాకు అంగీకారం తెలిపాడట. ఐతే ఆ ఐడియాతో కథను రెడీ చేశాక.. అది చరణ్‌కు కరెక్ట్ కాదని తనకే అనిపించి ఆ కథను ఆపేశానని గౌతమ్ వెల్లడించాడు. చరణ్‌తో సినిమా చేయడం అన్నది గొప్ప అవకాశమని.. ఆ ఛాన్స్ వచ్చింది కదా అని హడావుడిగా ఏదో ఒకటి తీసేయడం కరెక్ట్ కాదనిపించిందని గౌతమ్ తెలిపాడు.

## ఉస్తాద్ భగత్ షూటింగ్‌లో రభస



అసలే థియేటర్లకు వచ్చే ప్రేక్షకుల సంఖ్య అంతకంతకూ తగ్గిపోతోంది. కొత్త సినిమాలకు వసూళ్లు ఆశించిన స్థాయిలో ఉండట్లేదు. బడ్జెట్లేమో పెరిగిపోతున్నాయి. బిజినెస్ అనుకున్నంతగా జరగట్లేదు. రిలీజయ్యే వంద సినిమాల్లో ఐదారు లాభాలు తెచ్చిపెట్టడం కూడా గగనం అయిపోతోంది. దీంతో నిర్మాతల పరిస్థితి అగమ్య గోచరం అవుతుంటే.. ఇప్పుడు మూలిగే నక్కపై తాటిపండు అన్నట్లుగా జీతాల పెంపు కోసం సినీ కార్మికులు స్ట్రైక్‌కు పిలుపునివ్వడం పెద్ద షాక్. 30 శాతం మీద జీతాలు పెంచితే తప్ప పని చేయబోమంటూ నిన్ననే తెలుగు ఫిలిం ఫెడరేషన్ పిలుపునివ్వగా.. వెంటనే టాలీవుడ్‌లో షూటింగ్స్ అన్నీ ఆగిపోయాయి. ఇలాంటి సమయంలో పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ సినిమా 'ఉస్తాద్ భగత్ సింగ్' చిత్రీకరణ జరపడం వివాదాస్పదం అయింది. ఇక్కడ సినీ కార్మికులు స్ట్రైక్‌లో ఉండడంతో నిర్మాతలు.. చెన్నై నుంచి తమిళ వర్కర్లను రప్పించుకుని షూటింగ్ జరిపారు. ఈ సినిమాకు పవన్ కళ్యాణ్ లేక లేక డేట్లు ఇవ్వడంతో గత కొన్ని వారాలుగా చకచకా చిత్రీకరణ జరుపుతున్నారు. ప్రస్తుతం షూట్ చివరి దశలో ఉంది. పవన్ మరి కొన్ని రోజులు పని చేయాల్సి ఉంది. ఆ తర్వాత ఆయన అందుబాటులో ఉండరు. ఆయన ఇచ్చిన తక్కువ డేట్లనే సర్దుబాటు చేసుకుని షూటింగ్ పూర్తి చేయాల్సి ఉండడంతో.. టీం బ్రేక్ లేకుండా పని చేస్తోంది. ఇలాంటి సమయంలో స్ట్రైక్ రూపంలో 'ఉస్తాద్' టీం మీద బాంబు పడింది. షూటింగ్ ఆపే పరిస్థితి లేకపోవడంతో నిర్మాతలు చెన్నై నుంచి కార్మికులను రప్పించుకున్నారు. ఇది తెలిసి ఇక్కడి ఫిలిం ఫెడరేషన్ ప్రతినిధులు ఈ సినిమా షూటింగ్ జరుగుతున్న చోటికి రావడం.. అక్కడ వాగ్వాదం చోటు చేసుకోవడం.. గొడవ కాస్త పెద్దది కావడం జరిగినట్లు ఆ చిత్ర వర్గాలు చెబుతున్నాయి.



# క్రీడలు



## సిరాజ్‌పై కోహ్లీ ఎమోషనల్ పోస్ట్



భారత్ జట్టు ఇంగ్లండ్‌తో జరిగిన చివరి టెస్టులో ఉత్కంఠ విజయం సాధించింది. ఈ సమరంలో కీలక పాత్ర పోషించిన పేసర్ మహమ్మద్ సిరాజ్‌పై విరాట్ కోహ్లీ కీర్తిస్తంభం కట్టాడు.ఓవల్ వేదికగా జరిగిన ఐదో టెస్టు చివరి రోజు ఉదయం, ఇంగ్లండ్‌కు విజయం కోసం కేవలం 35 పరుగులే అవసరం. చేతిలో నాలుగు వికెట్లు మిగిలి ఉన్నాయి. అనుభవజ్ఞులైన బాట్స్‌మెన్ క్రీజులో ఉన్నారు.అయితే ఆ సమయంలో సిరాజ్ చేసిన స్పెల్ నిజంగా మ్యాజిక్. కేవలం 9 పరుగులకే మూడు కీలక వికెట్లు పడగొట్టి, మ్యాచ్‌ను భారత్ దిశగా తిప్పాడు.ఈ మ్యాచ్‌లో సిరాజ్ మొత్తం 104 పరుగులిచ్చి 5 వికెట్లు తీశాడు.ఐదు టెస్టుల సిరీస్ మొత్తంలో అతను 23 వికెట్లు పడగొట్టి టాప్ బౌలర్‌గా నిలిచాడు.బుమ్రా లేని లోటు అతను సమర్థవంతంగా పూడ్చాడు. సిరాజ్ ప్రదర్శన కేవలం గణాంకాల్లోనే కాదు, భావోద్వేగంగా కూడా ఆకట్టుకుంది.తన బౌలింగ్‌లో ఉన్న దృఢ సంకల్పం, నిబద్ధత అభిమానుల గుండెల్లో స్థానం సంపాదించింది.ఈ టెస్ట్ విజయం ద్వారా ఐదు మ్యాచ్‌ల అండర్సన్-టెండూల్కర్ ట్రోఫీ సిరీస్‌ను భారత్ 2-2తో సమం చేసింది.ఇది జట్టు సంయుక్త పోరాటానికి ప్రతిఫలం. ఈ సిరీస్ ద్వారా సిరాజ్ తన స్థాయిని మరోసారి నిరూపించుకున్నాడు.ప్లాన్‌తో బౌలింగ్, అటాకింగ్ మైండ్‌సెట్‌తో ప్రత్యర్థుల మీద ఒత్తిడిని పెంచాడు.బుమ్రా, షమీ లాంటి సీనియర్‌లు అందుబాటులో లేని సమయంలో సిరాజ్ లాంటి పేసర్‌లు.జట్టు భవిష్యత్‌కు ఆత్మవిశ్వాసాన్ని నింపుతున్నారు.విరాట్ కోహ్లీ కెప్టెన్సీ సమయంలో సిరాజ్‌కు మొదటిసారి అంతర్జాతీయ అవకాశాలు వచ్చాయి.ఆ బంధం ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. కోహ్లీ చేసిన ఈ పోస్టుతో అది మరోసారి స్పష్టమైంది.

## డబ్ల్యూటీసీ పట్టికలో దూసుకుపోయిన టీమిండియా



ప్రపంచ టెస్ట్ ఛాంపియన్‌షిప్ 2025-27 సీజన్‌కు భారత్ గట్టి స్టార్ట్ ఇచ్చింది. ఇంగ్లండ్‌తో జరిగిన చివరి టెస్ట్ మ్యాచ్‌లో కేవలం 6 పరుగుల తేడాతో గెలిచి, పాయింట్ల పట్టికలో మూడో స్థానానికి చేరుకుంది. ఓవల్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్ పూర్తిగా ఉత్కంఠభరితంగా సాగింది.ఆఖరి రోజుకు ఆట మొదలయ్యే సరికి ఇంగ్లండ్ విజయం ఖాయమని అంతా భావించారు. వాళ్లకు అవసరమైన పరుగులు కేవలం 35 మాత్రమే. చేతిలో ఇంకా నాలుగు వికెట్లు ఉండటంతో మ్యాచ్ దిశ వారి వైపే పోతుందనిపించింది. కానీ భారత బౌలర్లు అంచనాలను తలకిందులుగా మార్చేశారు.హైదరాబాద్‌కు చెందిన పేసర్ మహ్మద్ సిరాజ్ పంజా విసిరాడు. ఐదు కీలక వికెట్లు తీసి ఇంగ్లండ్‌ను దెబ్బతీశాడు. ఒక్కో బంతిని సిరాజ్ అద్భుతంగా వాడుతూ విజయం భారత్‌కు తెచ్చిపెట్టాడు. ఇది పరుగుల పరంగా భారత్‌కు లభించిన అత్యల్ప తేడా గల గెలుపులలో ఒకటి. ఈ గెలుపుతో టీమిండియా డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో పైకి దూసుకెళ్లింది. ఐదు టెస్టుల తర్వాత భారత్ 28 పాయింట్లతో 46.67 శాతం పీసీటీ సాధించింది. దీంతో మూడో స్థానాన్ని తన ఖాతాలో వేసుకుంది.ఇంగ్లండ్ జట్టు మాత్రం ఈ ఓటమితో నాలుగో స్థానానికి జారిపోయింది. వారి ఖాతాలో ప్రస్తుతం 26 పాయింట్లు ఉన్నాయి. పీసీటీ 43.33గా ఉండటంతో స్థానాన్ని నిలబెట్టుకోలేకపోయింది. పైగా స్లో ఓవర్ రేట్ వల్ల రెండు పాయింట్లు కోల్పోవడం మరింత ఇబ్బందికరంగా మారింది. ప్రస్తుతం డబ్ల్యూటీసీ పట్టికపై ఆస్ట్రేలియా అగ్రస్థానంలో కొనసాగుతోంది. వెస్టిండీస్‌పై 3-0 సిరీస్‌ను క్లీన్‌స్వీప్ చేసిన ఆ జట్టు, 36 పాయింట్లు సాధించింది. 100 శాతం పీసీటీతో టాప్‌లో నిలిచింది.ఇదే సమయంలో శ్రీలంక బంగ్లాదేశ్‌పై సిరీస్ గెలిచి రెండో స్థానాన్ని ఆక్రమించింది. వారి ఖాతాలో 16 పాయింట్లు ఉండగా, పీసీటీ 66.67 శాతం ఉంది. ఈ ఫలితాలతో శ్రీలంక టీం కూడా పోటీలో నిలిచింది.

## వీడియోను బీసీసీఐ సోషల్ మీడియాలో షేర్

ఈ వీడియోను బీసీసీఐ సోషల్ మీడియాలో షేర్ చేయడంతో, అది వైరల్ అయింది. కఠినంగా ఉండే గంభీర్ ఇంత భావోద్వేగానికి లోనవడం చూసి అభిమానులు ఆశ్చర్యపోయారు. ఇది కోచ్‌గా ఆయన పడ్డ శ్రమ, ఒత్తిడి, జట్టు విజయం పట్ల ఆయనకున్న అంకితభావం ఎంత గొప్పదో చూపిస్తోంది. సాధారణంగా మనం చూసే గౌతమ్ గంభీర్ చాలా కఠినమైన, దూకుడు స్వభావం ఉన్న వ్యక్తి. మైదానంలో అయినా, బయట అయినా ఆయన ఎప్పుడు భావోద్వేగాలను బహిరంగంగా చూపించరు. అందుకే ఆయనను "సీరియస్ గంభీర్" అని కూడా పిలుస్తుంటారు. కానీ, ఇంగ్లాండ్‌తో జరిగిన చివరి టెస్టు మ్యాచ్ తర్వాత ఆయనలో ఇంతకు ముందెన్నడూ చూడని ఒక కోణం బయటపడింది. లండన్‌లోని ఓవల్ మైదానంలో జరిగిన ఐదో టెస్టులో భారత జట్టు సంచలనాత్మక విజయం సాధించిన తర్వాత, డ్రెస్సింగ్ రూమ్‌లో గంభీర్ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. జట్టు విజయాన్ని చూసి ఆయన కళ్లలో నీళ్లు తిరిగాయి. ఆనందంతో బిగ్గరగా అరుస్తూ, బౌలింగ్ కోచ్ మోర్నే మోర్కెల్‌ను గట్టిగా కౌగిలించుకున్నారు. అనంతరం యువ కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌ను ఆప్యాయంగా తల మీద తట్టి, గట్టిగా హత్తుకున్నారు. ఈ దృశ్యం క్రికెట్ అభిమానుల హృదయాలను కదిలించింది. ఈ గెలుపు గంభీర్‌కు ఎందుకంత ముఖ్యమైంది? టీమిండియా హెడ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత గంభీర్ ఎన్నో ఒత్తిళ్లను ఎదుర్కొన్నారు. సీనియర్లు లేని యువ జట్టుతో ఆయన మొదలుపెట్టిన ప్రయాణం అంత సులభం కాదు. న్యూజిలాండ్‌తో జరిగిన టెస్ట్ సిరీస్‌లో వైట్ వాష్, ఆస్ట్రేలియా పర్యటనలో ఓటమి వంటి పరాజయాలతో ఆయనపై తీవ్ర విమర్శలు వచ్చాయి. టెస్ట్ క్రికెట్‌కు ఆయన సరైన కోచ్ కాదనే విమర్శలు కూడా వచ్చాయి.

## ఇంగ్లండ్‌లో టీమిండియా ప్లేయర్‌కు ఊహించని షాక్?



భారత్, ఇంగ్లాండ్ మధ్య జరిగిన 5 మ్యాచ్‌ల ఉత్కంఠభరితమైన టెస్ట్ సిరీస్ ఎట్టకేలకు ముగిసింది. సోమవారం (ఆగస్టు 4) ఓవల్‌లో జరిగిన ఐదవ టెస్ట్ చివరి రోజున భారత్ ఉత్కంఠభరితమైన విజయాన్ని సాధించింది. అయితే, ఈ సిరీస్‌తో ఓ ప్లేయర్ కెరీర్ ముగింపు దశకు చేరుకుంది. ఇక రిటైర్మెంట్ చేసేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోంది. ఇండియా వర్సెస్ ఇంగ్లాండ్ మధ్య జరిగిన 5 మ్యాచ్‌ల ఉత్కంఠభరితమైన టెస్ట్ సిరీస్ ఎట్టకేలకు ముగిసింది. ఐదు మ్యాచ్‌లు అంటే అన్ని టెస్ట్‌లు ఐదవ రోజున ముగిశాయి. ఇటీవలి సంవత్సరాలలో ఇది అత్యుత్తమ సిరీస్. సోమవారం (ఆగస్టు 4) ఓవల్‌లో జరిగిన ఐదవ టెస్ట్ చివరి రోజున భారత్ ఉత్కంఠభరితమైన విజయాన్ని సాధించింది. ఈ విధంగా, సిరీస్‌ను 2-2తో డ్రాగా ముగించింది. ఇందులో చాలా మంది ఆటగాళు ్ళ బాగా రాణించారు. అయితే కొంతమందికి ఈ పర్యటన నిరాశపరిచింది. ఇంగ్లాండ్ లేదా ఆస్ట్రేలియా పర్యటన టీం ఇండియాలోని కొంతమంది ఆటగాళ్లకు ఎల్లప్పుడూ మంచిది కాదు. ఇది వారి కెరీర్‌పై నీలిమేఘంలా మారింది. అక్కడ నిరాశపరిచే ప్రదర్శన తర్వాతే వారి కెరీర్ ముగుస్తుంది. ఇది చాలా మంది కీలక ఆటగాళ్లతో జరిగింది. రాహుల్ ద్రవిడ్, వీవీఎస్ లక్ష్మణ్, ఆర్‌పి సింగ్, రవిచంద్రన్ అశ్విన్, రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వంటి పెద్ద ఆటగాళ్ళు ఇంగ్లాండ్ లేదా ఆస్ట్రేలియాలో తమ చివరి టెస్ట్ మ్యాచ్ ఆడారు. ఇప్పుడు ఇది మళ్ళీ జరగవచ్చు. ఈసారి ఆల్ రౌండర్ కెరీర్ ముగియవచ్చు. ఇక్కడ మనం 33 ఏళ్ల ఆల్ రౌండర్ శార్దూల్ ఠాకూర్ గురించి మాట్లాడుతున్నాం. ఈ పర్యటన అతనికి మరచిపోలేనిది. అతను చివరిసారిగా టీం ఇండియా తరఫున ఆడి ఉండవచ్చు. రెండేళ్ల తర్వాత శార్దూల్‌కు టెస్ట్ ఆడే అవకాశం లభించింది. అతను టీం ఇండియా ప్రణాళికలకు దూరంగా ఉన్నాడు. దేశవాళీ క్రికెట్‌లో అద్భుతమైన ప్రదర్శన ఇచ్చిన తర్వాత, అతను ఇంగ్లాండ్ పర్యటన కోసం జట్టులోకి వచ్చాడు, కానీ అది అతనికి నిరాశపరిచింది. సిరీస్‌లోని మొదటి టెస్ట్‌లో అతనికి అవకాశం లభించింది. లీడ్స్‌లో అతను ప్రత్యేకంగా ఏమీ చేయలేకపోయాడు. బ్యాటింగ్‌లో అతను 1, 4 పరుగులు మాత్రమే సాధించాడు. బౌలింగ్‌లో, అతను రెండవ ఇన్నింగ్స్‌లో 2 వికెట్లను సాధించాడు. ఈ దశ శార్దూల్‌కు డు ఆర్ డై పరిస్థితి. లీడ్స్ టెస్ట్ మ్యాచ్ తర్వాత అతన్ని జట్టు నుంచి తొలగించారు. బర్మింగ్‌హామ్, లార్డ్స్‌లో ఆడలేకపోయాడు. అతను మాంచెస్టర్ టెస్ట్‌లో తిరిగి వచ్చాడు. కానీ, ఇది కూడా అతనికి మర్చిపోలేనిది. అతను మొదటి ఇన్నింగ్స్‌లో 41 పరుగులు చేశాడు. రెండవ ఇన్నింగ్స్‌లో అతనికి బ్యాటింగ్ చేసే అవకాశం రాలేదు. ఆ తర్వాత, అతను బౌలింగ్‌లో 55 పరుగులు ఇచ్చాడు. అతను ఒక్క వికెట్ కూడా పడగొట్టలేదు. ఈ విధంగా, రెండు టెస్ట్‌లలో 46 పరుగులు చేయడమే కాకుండా, అతను 2 వికెట్లు మాత్రమే తీయగలిగాడు. 2018లో భారత్ తరఫున శార్దూల్ తన తొలి టెస్ట్ మ్యాచ్ ఆడాడు. ఆ తర్వాత కొన్ని చిరస్మరణీయ మ్యాచ్‌లలో తన వంతు పాత్ర పోషించాడు. 2021-22లో ఇంగ్లాండ్ పర్యటనలో అతను చాలా విజయవంతమయ్యాడు. 3 మ్యాచ్‌ల్లో 2 హాఫ్ సెంచరీల సహాయంతో 122 పరుగులు చేశాడు. దీంతో పాటు, అతను ఏడు వికెట్లు కూడా తీసుకున్నాడు. అంతకుముందు, 2021లో బ్రిస్బేన్‌లో జరిగిన చారిత్రాత్మక విజయంలో శార్దూల్ కీలక పాత్ర పోషించాడు. బౌలింగ్‌లో 3, 4 వికెట్లు పడగొట్టాడు. దీంతో పాటు, బ్యాటింగ్‌లో 67, 2 పరుగుల ఇన్నింగ్స్‌లు ఆడాడు. ఇప్పటివరకు 13 టెస్ట్ మ్యాచ్‌ల్లో 33 వికెట్లు పడగొట్టాడు. ఇది కాకుండా, అతను 377 పరుగులు చేశాడు. శార్దూల్ వయస్సు, ఫామ్‌ను చూస్తే, అతని టెస్ట్ కెరీర్ ఇప్పుడు ముగిసినట్లు అనిపిస్తుంది.

## రవీంద్ర జడేజా చెప్పిన మాటలు నన్ను ఎంతో మోటివేట్ చేశాయి



ఇంగ్లండ్ పర్యటనలో టీమిండియా అద్భుతమైన విజయాన్ని సొంతం చేసుకున్న ఆఖరి టెస్ట్ మ్యాచ్ అనంతరం భారత స్టార్ పేసర్ మహమ్మద్ సిరాజ్ తన హృదయాన్ని తాకే వ్యాఖ్యలు చేశాడు. ఉత్కంఠ భరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో చివరి రోజున భారత్ కేవలం 6 పరుగుల తేడాతో గెలిచింది. ఈ విజయం అంతా దేవుడి దయ వల్లనే సాధ్యమైందని సిరాజ్ తెలిపాడు.మ్యాచ్ అనంతరం మీడియాతో మాట్లాడుతూ సిరాజ్ అన్నారు, 'ఆఖరి రోజు ఆటలో గెలుపు కోసం మేమంతా శక్తివంచన లేకుండా శ్రమించాం. కానీ ఒక సమయంలో బ్రూక్ క్యాచ్ వదిలేశాక మా జట్టులో కొంత నిరాశ ఏర్పడింది. ఆ సమయంలో ఇంగ్లండ్ బ్యాటర్లు హ్యారీ బ్రూక్, జో రూట్ అద్భుతంగా ఆడుతూ భాగస్వామ్యాన్ని పెంచడంతో మ్యాచ్ పూర్తిగా వారి వైపు ఒరిగినట్లు అనిపించింది. అయినప్పటికీ నేను గెలుపుపై ఆశలు వదులుకోలేదు. చివరి వరకు బౌలింగ్‌లో నా శక్తినంతా పెట్టాలని నిర్ణయించుకున్నాను' అని చెప్పాడు. సిరాజ్ తన విజయం వెనుక జట్టు సహచరుడు రవీంద్ర జడేజా సూచించిన మాటలు ప్రధాన ప్రేరణ అని వెల్లడించాడు. 'ఆఖరి రోజు ఆట ప్రారంభానికి ముందు జడేజా నాతో, 'మనం క్రికెటర్‌లుగా ఇక్కడి వరకూ రావడానికి ఎంత కష్టపడ్డామో గుర్తు పెట్టుకో. ఆ కష్టాన్ని గుర్తు పెట్టుకొని బౌలింగ్ చేయి' అని అన్నాడు. ఆ మాటలు నాకు కొత్త ఉత్సాహాన్ని ఇచ్చాయి. అలసటను మర్చిపోయి బౌలింగ్‌లో దూకుడును పెంచాను' అని సిరాజ్ అన్నాడు.339/6 ఓవర్ నైట్ స్కోర్‌తో ఆఖరి రోజు ఆటను ప్రారంభించిన ఇంగ్లండ్.. 367 పరుగులకు ఆలౌటైంది. మహమ్మద్ సిరాజ్(5/104) ఐదు వికెట్లతో భారత్‌కు చిరస్మరణీయ వియాజయాన్నందించాడు. సిరాజ్‌తో పాటు ప్రసిధ్ కృష్ణ(4/126) నాలుగు వికెట్లు తీయగా ఆకాష్ దీప్ ఓ వికెట్ పడగొట్టాడు. ఈ గెలుపుతో ఐదు టెస్ట్‌ల సిరీస్ 2-2తో సమంగా నిలిచింది.




# ఆరోగ్యం



## రెండే రెండు రెబ్బలు తింటే డాక్టర్‌తో పని ఉండదిక..



మన వంటింట్లో ఎన్నో సహజ ఔషధాలు దాగున్నాయి.. మీరు తరచుగా జలుబు, ఇన్ఫెక్షన్లతో బాధపడుతుంటే.. పచ్చి వెల్లుల్లి మీకు అద్భుతంగా సహాయపడుతుంది. దీనికి బలమైన యాంటీ బాక్టీరియల్, యాంటీవైరల్ లక్షణాలు ఉన్నాయి. దీనిని రెగ్యులర్‌గా తీసుకోవడం వల్ల ఎన్నో సమస్యల నుంచి బయటపడొచ్చు. వెల్లుల్లిలో ఎన్నో ఔషధ గుణాలు దాగున్నాయి.. వెల్లుల్లి మన ఆహార రుచిని పెంచడమే కాకుండా.. ఇది అనేక అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలను కలిగి ఉన్న సహజ సూపర్‌ఫుడ్ కూడా.. వెల్లుల్లిని ఉడికించి తిన్నా.. లేదా పచ్చిగా.. ఇలా ఎలా తిన్నా మంచిదే.. కానీ పచ్చి వెల్లుల్లి తినడం వల్ల మీకు మరిన్ని పోషకాలు లభిస్తాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. మీ రోగనిరోధక శక్తిని పెంచడం నుండి గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరచడం వరకు, ఇది మీ శరీరానికి మంచిదిగా చెబుతున్నారు. అందుకే.. మీ దినచర్యలో పచ్చి వెల్లుల్లిని చేర్చుకుంటే అద్భుతమైన ప్రయోజనాలను పొందవచ్చు. వెల్లుల్లిలో విటమిన్లు, ఖనిజాలు, ఇతర పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఇది విటమిన్ సి, విటమిన్ బి6, మాంగనీస్, ఇతర పోషకాలకు మంచి వనరు. ఇది తక్కువ కేలరీలు కలిగి ఉంటుంది.. ఆరోగ్యానికి చాలా ఉపయోగకరంగా ఉంటుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. మీరు తరచుగా జలుబు, ఇన్ఫెక్షన్లతో బాధపడుతుంటే, పచ్చి వెల్లుల్లి మీకు సహాయపడుతుంది. ఇది బలమైన యాంటీ బాక్టీరియల్, యాంటీవైరల్ లక్షణాలను కలిగి ఉంటుంది.. ఇది మీ శరీరం వ్యాధులతో పోరాడటానికి సహాయపడుతుంది. ఒక అధ్యయనం ప్రకారం, పచ్చి వెల్లుల్లిలో అల్లిసిన్ అనే సమ్మేళనం ఉంటుంది. ఇది మీ రోగనిరోధక శక్తిని పెంచుతుంది. హానికరమైన బ్యాక్టీరియాను దూరంగా ఉంచుతుంది. పోషకాహార నిపుణుల ప్రకారం.. వెల్లుల్లి క్రమం తప్పకుండా తినడం వల్ల జలుబు, ఫ్లూ, ఇతర ఇన్ఫెక్షన్ల తీవ్రత తగ్గుతుంది. అధిక రక్తపోటు సైలెంట్ కిల్లర్.. అయితే.. పచ్చి వెల్లుల్లి దానిని నియంత్రణలో ఉంచడంలో సహాయపడుతుంది. వెల్లుల్లి రక్త నాళాలను సడలించి రక్త ప్రసరణను మెరుగుపరుస్తుందని, తద్వారా గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తుందని అధ్యయనాలు చెబుతున్నాయి. వెల్లుల్లి హృదయ సంబంధ సమస్యలను నివారించడంలో ప్రభావవంతంగా ఉంటుందని పరిశోధనలు సూచిస్తున్నాయి. ఇది చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది.. మంచి కొలెస్ట్రాల్‌ను స్థిరంగా ఉంచుతుంది.. తద్వారా మొత్తం గుండె ఆరోగ్యాన్ని ప్రోత్సహిస్తుంది. మన శరీరం నిరంతరం ఆహారం, కాలుష్యం, ఇతర వనరుల నుండి విష పదార్థాలకు గురవుతూ ఉంటుంది. పచ్చి వెల్లుల్లి హానికరమైన పదార్థాలను బయటకు పంపడం ద్వారా మీ కాలేయాన్ని శుభ్రపరచడంలో సహాయపడుతుంది. ఇందులో సల్ఫర్ సమ్మేళనాలు కూడా ఉంటాయి. ఇవి హెవీ మెటల్ పాయిజనింగ్ నుంచి రక్షించాయి. కాలేయం, మూత్రపిండాలు వంటి అవయవాలకు జరిగే నష్టాన్ని తగ్గిస్తాయి. ఆరోగ్యకరమైన ప్రేగు మొత్తం ఆరోగ్యానికి చాలా ముఖ్యం. వెల్లుల్లి జీర్ణక్రియను మెరుగుపరచడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. ఇది జీర్ణ ఎంజైమ్‌ల ఉత్పత్తిని పెంచుతుంది, ఇది మీ శరీరం ఆహారాన్ని మరింత సమర్థవంతంగా జీర్ణం చేసుకోవడానికి సహాయపడుతుంది. అలాగే, దాని యాంటీ బాక్టీరియల్ లక్షణాలు హానికరమైన గట్ బాక్టీరియాను నియంత్రణలో ఉంచుతాయి. మంచి బ్యాక్టీరియా పెరుగుదలకు మద్దతు ఇస్తాయి. డాక్టర్ బన్సాల్ ప్రకారం.. వెల్లుల్లిలో ఫ్రీ రాడికల్స్‌తో పోరాడే యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఈ ఫ్రీ రాడికల్స్ కణాల నష్టం.. వృద్ధాప్యానికి కారణమవుతాయి. పచ్చి వెల్లుల్లిని క్రమం తప్పకుండా తీసుకోవడం వల్ల కడుపు.. కొలొరెక్టల్ క్యాన్సర్ వంటి కొన్ని క్యాన్సర్ల ప్రమాదాన్ని తగ్గించవచ్చని పరిశోధనలు చెబుతున్నాయి. ఇది కణ ఉత్పరివర్తనను నిరోధిస్తుంది. కణితి పెరుగుదలను నెమ్మదిస్తుంది. పచ్చి వెల్లుల్లి రెండు రెబ్బలను ఉదయాన్నే తింటే చాలా మంచిది.. అయితే.. పచ్చి వెల్లుల్లి ఘాటైన రుచి మీకు నచ్చకపోతే.. ఈ చిట్కాలను అనుసరించండి. దానిని కోసి లేదా చూర్ణం చేసి తినడానికి ముందు 10 నిమిషాలు అలాగే ఉంచండి. ఇది అల్లిసిన్ మొత్తాన్ని సక్రియం చేస్తుంది. ఘాటైన రుచిని సమతుల్యం చేయడానికి తేనెతో కలపండి. తేలికపాటి రుచి కోసం స్మూతీలు లేదా సలాడ్లలో జోడించండి.

## నిద్రలో అకస్మాత్తుగా ఊపిరి ఆగిపోయినట్లు అనిపిస్తుందా?



ఇది నిశబ్దంగా మన నిద్రను భంగం కలిగిస్తుంది. తద్వారా దీర్ఘకాలిక అలసటకు దారితీస్తుంది. శ్వాస అకస్మాత్తుగా ఆగిపోయినప్పుడు వెంటనే మెలకువ వచ్చేస్తుంది. సరైన నిద్ర లభించదు. ఫలితంగా, పొద్దున్నే లేచిన తర్వాత తలనొప్పిగా ఉండడం, నీరసం, మూడ్ సరిగా ఉండకపోవడం. నిద్ర లేమికీ, శారీరక మానసిక ఆరోగ్యానికీ మధ్య ఉన్న సంబంధం గురించి అవగాహన ఏర్పడవలసిన అవసరాన్ని గతంలో కరోనా మహమ్మారి తెలియజేసింది. ఈ రోజుల్లో చాలా మందికి రకరకాల అనారోగ్య సమస్యలు వెంటాడుతున్నాయి. ప్రతి ఒక్కరికి నిద్ర అవసరం. నిద్రలేమి వల్ల ఎన్నో అనారోగ్య సమస్యలు వస్తుంటాయి. ప్రతి ఒక్కరికి సరైన నిద్ర లేకుంటే డయాబెటిస్‌తో పాటు కార్డియో వాస్క్యులర్ డిసీజెస్, బ్లడ్ ప్రెషర్ ఇష్యూస్, మెంటల్ హెల్త్ ఇష్యూస్ వంటివాటికి కారణం కావచ్చు. నిద్రిస్తున్న సమయంలో గొంతు భాగంలో ఉన్న కండరాలు ఎక్కువగా రిలాక్స్ అవుతాయి. దీంతో నాలుక లేదా టాన్సిల్స్ లాంటి మృదు కణ జాలాలు ఉండే భాగాలు గాలి వెళ్లే ద్వారాన్ని అడ్డుకుంటాయి. దీన్నే అబ్?స్ట్రక్టివ్? స్లీప్? ఆప్నియా అంటాం. ఈ బ్లాకేజీ కండిషన్? కొన్ని సెకండ్ల నుంచి ఒక నిమిషం పాటు ఉంటుంది. ఈ సమయంలో మెదడుకు ఆక్సిజన్ తక్కువ అందుతుంది. అలాగే ఊపిరి పీల్చుకోవడంలో ఇబ్బందిగా మారుతుంది. ఇది కొన్ని క్షణాలపాటే ఉండడం వల్ల దీనిని పెద్దగా ఎవరు గమనించి ఉండదరు. ఇది గాఢనిద్రలోకి వెళ్లకుండా అప్పుడప్పుడు అకస్మాత్తుగా మెలకువ వస్తూ ఉంటుంది. తద్వారా శరీరానికి సరిపడా నిద్ర ఉండదు. ఊపిరి తీసుకోవడంలో కలిగే ఈ ఇబ్బందులు లేదా ఆప్నియాలు ఒక్కరాత్రిలోనే పది నుంచి వందలసార్లు కూడా వస్తాయి. చాలా మందికి నిద్రలో గురక వస్తుంటుంది. దీని వల్ల చాలా మందికి ఇబ్బందిగా ఉంటుంది. దాంతో పక్కనవాళ్లు ఇబ్బంది పడడం సహజం. కానీ, గురక వల్ల ఎంతసేపు నిద్రపోయినా వాళ్లకు విశ్రాంతి తీసుకున్నట్టు అనిపించదు. కానీ, ఈ సమస్యను చాలామంది గుర్తించరు. తమంతట తాముగా గుర్తించలేరు కూడా. దీనిని అబ్‌స్ట్రక్టివ్ స్లీప్ ఆప్నియా (ఒఎస్?ఎ) అంటారు. ఇది నిశబ్దంగా మన నిద్రను భంగం కలిగిస్తుంది. తద్వారా దీర్ఘకాలిక అలసటకు దారితీస్తుంది. శ్వాస అకస్మాత్తుగా ఆగిపోయినప్పుడు వెంటనే మెలకువ వచ్చేస్తుంది. సరైన నిద్ర లభించదు. ఫలితంగా, పొద్దున్నే లేచిన తర్వాత తలనొప్పిగా ఉండడం, నీరసం, మూడ్ సరిగా ఉండకపోవడం, డిప్రెషన్ వంటివి కూడా కలుగవచ్చు. నిద్ర లేమి సమస్య పెరుగుతున్న కొద్దీ బ్రెయిన్ తో చేసే పనుల్లో సామర్థ్యం తగ్గుతుందని తెలుస్తోంది. పైగా రోజులు గడిచే కొద్దీ ఇది ఇంకా పెరుగుతూనే ఉంటుంది. అంతేకాదు ముమ్ముందు మరిన్ని సమస్యలు చుట్టుముట్టే ప్రమాదం ఉందని, ఇదో సంకేతామని వైద్యులు చెబుతున్నారు. కానీ మన శరీరంలో అప్పుడప్పుడు ఏర్పటే సంకేతాలను అర్థం చేసుకుంటే జీవితాన్ని మరింత ముందుకు తీసుకెళ్లవచ్చని వైద్యులు చెబుతున్నారు.

## రాత్రిపూట పెరుగు తింటే సమస్యలా..?



పెరుగు శరీరానికి మంచిది. జీర్ణక్రియను మెరుగుపరచడానికి, రోగనిరోధక శక్తిని పెంచడానికి, పేగు ఆరోగ్యానికి పెరుగు మంచిది. పెరుగులో కాల్షియం, ప్రోటీన్ కూడా అధికంగా ఉంటాయి. ఇది ఎముకలు, కండరాలకు ప్రయోజనకరంగా ఉంటుంది. కానీ రాత్రిపూట పెరుగు తినవచ్చా..? ఆహార నియంత్రణ ఆరోగ్యానికి చాలా ముఖ్యమైన అంశం. మనం చాలా రుచికరమైన ఆహారాలను తగ్గించాల్సి రావచ్చు. రాత్రిపూట పెరుగు తినడం కూడా నివారించాల్సిన వాటిలో ఒకటి. పెరుగు చాలా మందికి ఇష్టం. అన్నింటికంటే, ఒక కప్ పెరుగు తినాలని ప్రతి ఒక్కరికి ఉంటుంది. కానీ రాత్రిపూట పెరుగు తినడం ఆరోగ్యానికి అంత మంచిది కాదు. రాత్రిపూట పెరుగు తినడం వల్ల జీర్ణ సమస్యలు ఉన్నవారికి మరిన్ని సమస్యలు రావచ్చు. ఇందులో కొవ్వు, ప్రోటీన్ ఉంటాయి. రాత్రిపూట జీవక్రియ తక్కువగా ఉంటుంది కాబట్టి, జీర్ణం కావడం కూడా కష్టం.ఆయుర్వేదం ప్రకారం.. పెరుగు శరీరంలో కఫాన్ని పెంచుతుంది. కఫం సాధారణంగా రాత్రిపూట ఎక్కువగా కనిపిస్తుంది. ఈ సందర్భంలో పెరుగుతో తినడం వల్ల మరిన్ని సమస్యలు వచ్చే అవకాశం ఉంది. అయితే ఈ సమస్యలు అందరికీ ఒకేలా ఉండకపోవచ్చు. ఉబ్బసం, దగ్గు, జలుబు ఉన్నవారు రాత్రిపూట పెరుగు తినకుండా ఉండాలి. ఉదయం లేదా భోజనంతో పెరుగు తినడం ఉత్తమం. సరైన సమయంలో తీసుకుంటే పెరుగు శరీరానికి మంచిది. పెరుగు జీర్ణక్రియను మెరుగుపరచడానికి, రోగనిరోధక శక్తిని పెంచడానికి, పేగు ఆరోగ్యాన్ని పెంచడానికి మంచిది. పెరుగులో కాల్షియం, ప్రోటీన్ కూడా ఎక్కువగా ఉంటుంది. ఇది ఎముకలు, కండరాలకు ప్రయోజనకరంగా ఉంటుంది. పెరుగు జుట్టు, చర్మ ఆరోగ్యానికి కూడా మంచిది. పెరుగు ప్రోబయోటిక్స్‌కు కూడా మూలం. ఇంట్లో తయారుచేసిన తాజా పెరుగు తీసుకోవడం మంచిది. పెరుగు సాధారణంగా అందరికీ ప్రయోజనకరంగా ఉన్నప్పటికీ, పాల ఉత్పత్తులకు అలెర్జీ ఉన్నవారు దీనిని నివారించడం మంచిది. మూత్రపిండాల సమస్యలు లేదా అధిక కొలెస్ట్రాల్ ఉన్నవారు పెరుగును మితంగా మాత్రమే తినాలి.

## అల్లం-నిమ్మకాయ టీతో ఆ సమస్యలకు చెక్..



కొంతమంది తిన్న తర్వాత కడుపులో అసౌకర్యానికి గురవుతారు. కడుపు ఫుల్ అయినప్పుడు లేదా కారంగా ఉండే ఆహారం తిన్నప్పుడు ఇలాంటి సమస్య తలెత్తుతుంది. కానీ అలాంటి సమయంలో మీ కడుపును కూల్ చేయడానికి, ఆహారాన్ని వేగంగా జీర్ణం చేయడానికి కొన్ని మార్గాలు ఉన్నాయి. అల్లం-నిమ్మకాయ టీ అనేది రుచికరమైన, ఆరోగ్యకరమైన డ్రింక్. ఇది అనేక ప్రయోజనాలను కలిగి ఉంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడంలో, రోగనిరోధక శక్తిని పెంచడంలో, నొప్పి నుండి ఉపశమనం పొందడంలో సహాయపడుతుంది. అల్లం-నిమ్మకాయ టీ ఈ సమస్యలకు చక్కని పరిష్కారం. జీర్ణక్రియకు సహాయపడటం నుండి రోగనిరోధక శక్తిని పెంచడం వరకు ఈ టీ ఉపయోగపడుతుంది. ఇది చర్మ ఆరోగ్యాన్ని మెరుగుపరచడానికి కూడా మంచిది. ఆమ్లతను తగ్గించడానికి, బరువు తగ్గడానికి లేదా కడుపులో కలిగే ఏదైనా అసౌకర్యాన్ని తొలగించడానికి అల్లం-నిమ్మకాయ టీ చాలా బాగా పనిచేస్తుంది. అల్లం జీర్ణ ఎంజైమ్‌లను ప్రేరేపిస్తుంది. గ్యాస్, విరేచనాలు, ఆమ్లత్వం వంటి సమస్యలను తగ్గిస్తుంది. నిమ్మకాయ కాలేయాన్ని డిటాక్సిఫై చేయడంలో, పిత్త ఉత్పత్తిని పెంచడంలో సహాయపడుతుంది. ఇది కొవ్వులను మరింత సమర్థవంతంగా తొలగించడంలో కూడా సహాయపడుతుంది. కలిపి తీసుకున్నప్పుడు, ఇది జీర్ణవ్యవస్థను మెరుగుపరుస్తుంది. భోజనం తర్వాత బద్ధకాన్ని నివారిస్తుంది. బరువు తగ్గాలనుకునే వారికి కూడా ఇది చాలా మంచిది. నిపుణుల అభిప్రాయం ప్రకారం.. అల్లం జీవక్రియను పెంచుతుంది. శరీరం కొవ్వును మరింత సమర్థవంతంగా కరిగించడానికి సహాయపడుతుంది. సిట్రిక్ యాసిడ్ అధికంగా ఉండే నిమ్మకాయ డిటాక్సిఫైకి మద్దతు ఇస్తుంది. కోరికలను నియంత్రిస్తుంది. భోజనం తర్వాత క్రమం తప్పకుండా తీసుకుంటే, ఇది ఆరోగ్యకరమైన బరువును నిర్వహించడానికి మీకు సహాయపడుతుంది. చలికాలంలో లేదా అతిగా తిన్న తర్వాత మనం తరచుగా నీరు త్రాగడం మర్చిపోతాము. అల్లం-నిమ్మకాయ టీ హైడ్రేషన్‌ను పెంచడంతో పాటు అదనపు ప్రయోజనాలను అందిస్తుంది. ముఖ్యంగా శీతాకాలంలో దాహం తక్కువగా ఉన్నప్పుడు, ద్రవ సమతుల్యతను కాపాడుతుంది. డీహైడ్రేషన్ ప్రమాదాన్ని నివారిస్తుంది.

## వర్షాకాలంలో ఆకుకూరలు తింటున్నారా..?

ఆకుకూరలు ఆరోగ్యానికి మంచివనే విషయం దాదాపు అందరికీ తెలిసిందే. ఆకు కూరలలో మన ఆరోగ్యానికి మేలు చేసే ఎన్నో పోషకాలు నిండి ఉంటాయి. అందుకే నిత్యం ఏదో ఒక ఆకుకూరను ఆహారంలో భాగం చేసుకోవాలని నిపుణులు చెబుతుంటారు. అయితే, వర్షాకాలంలో ఆకు కూరలు తినటం మంచిదేనా..? వర్షాకాలంలో ఆకుకూరలు తినకూడదని ఇంట్లో పెద్దలు తరచూ చెబుతుంటారు. వర్షాకాలంలో ఆకు కూరలు తింటే కడుపు నొప్పి, విరేచనాలు అవుతాయని చెబుతుంటారు. అయితే, ఇవన్నీ అపోహలు మాత్రమే అని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. కూరగాయలతో పోలిస్తే ఆకుకూరలు భూమికి దగ్గరగా పెరుగుతాయి. వర్షపు జల్లుల వల్ల బ్యాక్టీరియా, ఫంగస్ సులభంగా వృద్ధి చెందుతాయి. అంతేకాకుండా ఆకుకూరలపై మట్టి, కీటకాలు లేదా వాటి గుడ్లు ఉండే అవకాశం ఉంటుంది. కాబట్టి వీటన్నింటిని కారణాలుగా పేర్కొంటూ ఆకుకూరలు తింటే ఆరోగ్య సమస్యలు వస్తాయని చెబుతుంటారు. వర్షాకాలంలో మన శరీరానికి అవసరమయ్యే కాల్షియం, మెగ్నీషియం, ఐరన్, పోలిక్ ఆమ్లాలు ఆకుకూరల నుంచి ఎక్కువ మొత్తంలో లభిస్తాయని నిపుణులు చెబుతున్నారు. అందుకే, రోజువారీ ఆహారంలో 50 గ్రాముల చొప్పున ఏదో ఒక ఆకుకూరని చేర్చుకోవాలని సూచిస్తున్నారు. ఆకు కూరలు వండేముందు ఉప్పు లేదా వెనిగర్ కలిపిన నీటితో రెండు లేదా మూడు సార్లు బాగా కడిగి ఎక్కువసేపు ఉడికించాలని నిపుణులు చెబుతున్నారు. ఈ కాలంలో పచ్చి ఆకుకూరలు తినడం కంటే, వాటిని బాగా ఉడికించి తినడం మంచిదని, ఇలా చేయడం వల్ల అందులో ఉండే సూక్ష్మజీవులు నశిస్తాయని చెబుతున్నారు. ఆకులు కొనే ముందు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు చెబుతున్నారు. ముదిరిగా లేదా వాడిపోయిన వాటిని కొనుగోలు చేయకుండా, తాజాగా కనిపించే ఆకుకూరలనే ఎంచుకోవాలని సలహా ఇస్తున్నారు. వీలైతే సేంద్రీయ పద్ధతిలో పండించిన ఆకుకూరలను ఎంచుకోవడం మంచిదని, ఎందుకంటే వాటిపై రసాయన అవశేషాలు తక్కువగా ఉంటాయని పేర్కొన్నారు.



# వ్యాపారం



## వందే భారత్ స్లీపర్ రైలు పట్టాలెక్కేది అప్పుడే?



మొదటి వందే భారత్ స్లీపర్ రైలు ఏ మార్గాల్లో నడుస్తుందో రైల్వేలు ఇంకా స్పష్టం చేయలేదు. రైల్వే బోర్డు త్వరలో ఈ విషయంలో నిర్ణయం తీసుకుంటుంది. సుదూర ప్రయాణానికి డిమాండ్ ఎక్కువగా ఉన్న మార్గాల్లో ఈ రైలు నడుస్తుందని భావిస్తున్నారు. భారతీయ రైల్వేలు త్వరలో తన సెమీ హై-స్పీడ్ రైళ్ల నెట్‌వర్క్‌కు కొత్త పేరును జోడించబోతున్నాయి. వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు ఉన్న అపారమైన ప్రజాదరణ దృష్ట్యా, రైల్వేలు ఇప్పుడు వందే భారత్ స్లీపర్ రైలును ప్రారంభించాలని నిర్ణయించాయి. గుజరాత్‌లోని భావ్‌నగర్‌లో రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్ వందే భారత్ స్లీపర్ రైలు సెప్టెంబర్ 2025 నుండి నడపడం ప్రారంభిస్తామని ప్రకటించారు. సుదూర ప్రయాణాల సమయంలో వందే భారత్‌లో సౌకర్యవంతమైన స్లీపర్ కోచ్ సౌకర్యాన్ని కోరుకునే ప్రయాణికులకు ఈ వార్త ప్రత్యేకమైనది. వందే భారత్ ఎక్స్‌ప్రెస్ దాని వేగం, ఆధునిక సౌకర్యాలకు ప్రసిద్ధి చెందింది. కానీ ఇప్పటివరకు ఇది చైర్ కార్ (సిట్టింగ్ సీట్) రైలుగా మాత్రమే నడుస్తోంది. సుదూర ప్రయాణాలలో కూర్చున్నప్పుడు ప్రయాణికులు ప్రయాణించడంలో అసౌకర్యాన్ని ఎదుర్కొనేవారు, అలాగే రాత్రిపూట ఈ సమస్య మరింత పెరిగేది. ఈ లోపాన్ని అధిగమించడానికి రైల్వేలు వందే భారత్ స్లీపర్ రైలును నడపడానికి సన్నాహాలు ప్రారంభించాయి. ఈ రైలు వచ్చే నెల అంటే సెప్టెంబర్ 2025 నుండి ట్రాక్‌పై ఎక్కనుందని రైల్వే మంత్రి స్పష్టం చేశారు. ఈ రైలు ట్రయల్ రన్ కూడా పూర్తయింది. ఇప్పుడు కొన్ని తుది సాంకేతిక పరీక్షలు, కమీషనింగ్ ప్రక్రియ జరుగుతోంది. ఈ ప్రక్రియ పూర్తయిన వెంటనే, రైలు ప్రయాణికులకు అందుబాటులోకి వస్తుంది.

## అందనంత ఎత్తుకు బంగారం ధరలు..



బంగారం ధర తాజాగా.. లక్ష రెండు వేలు దాటింది. అయితే లక్ష దాటి చాలా రోజులైనా.. దాని రేటు అక్కడక్కడే తిరుగుతోంది. ఇప్పుడు పండగ సీజన్ వచ్చేసింది. వ్రతాలు, నోములు చాలా ఉంటాయి. ముఖ్యంగా మ్యారేజీల కాలం కావడంతో.. బంగారానికి డిమాండ్ కూడా అంతే రేంజ్‌లో ఉంటుంది. బులియన్ మార్కెట్‌లో బంగారం, వెండి ధరలు ఒక్కోసారి పెరిగితే.. మరికొన్ని సార్లు తగ్గుతూ వస్తుంటాయి.. అయితే.. ఇటీవలే బంగారం, వెండి ధరలు ఆల్‌టైమ్ రికార్డు స్థాయికి చేరుకుని పరుగులు పెడుతున్నాయి.. అంతర్జాతీయంగా నెలకొన్న ఉద్రిక్త పరిస్థితులతో రేట్లు భారీగా పెరుగుతుండటం ఆందోళన కలిగిస్తోంది.. తాజాగా మంగళవారం (ఆగస్టు 5) బంగారం ధర.. లక్షా రెండు వేలు దాటింది. అయితే లక్ష దాటి చాలా రోజులైనా.. దాని రేటు అక్కడక్కడే తిరుగుతోంది. ఇప్పుడు పండగ సీజన్ వచ్చేసింది. వ్రతాలు, నోములు చాలా ఉంటాయి. ముఖ్యంగా మ్యారేజీల కాలం కావడంతో.. బంగారానికి డిమాండ్ కూడా అంతే రేంజ్‌లో ఉంటుంది. దీంతో గోల్డ్ రేట్ మరింత ప్రియమవుతుందనే టాక్ నడుస్తోంది. ఇప్పుడే త్వరపడండి.. లేకుంటే రేటు పోటు తప్పదంటున్నారు. దేశీయంగా మంగళవారం ఉదయం బంగారం, వెండి ధరలు భారీగా పెరిగాయి..24 క్యారెట్ల బంగారం పది గ్రాముల ధర రూ. 820 పెరిగి.. రూ.1,02,220కి చేరుకుంది.22 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.750 పెరిగి రూ.93,700 లకి చేరుకుంది..ఇక వెండి కిలో ధర రూ.2000 లు పెరిగి రూ.1,15000 చేరుకుంది.అయితే, ప్రాంతాల వారిగా బంగారం, వెండి ధరల్లో వ్యత్యాసం ఉంటుంది.

హైదరాబాద్‌లో 24 క్యారెట్ల పసిడి 10 గ్రాముల ధర రూ.1,02,220 ఉంటే.. 22 క్యారెట్ల బంగారం ధర రూ.93,700 ఉంది. కిలో వెండి ధర రూ.1,25,000 గా ఉంది.విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ.1,02,220, 22 క్యారెట్ల ధర రూ.93,700 లుగా ఉంది. వెండి కిలో ధర రూ.1,25,000 లుగా ఉంది.ఢిల్లీలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,02,370, 22 క్యారెట్ల ధర రూ.93,850 లుగా ఉంది. కిలో వెండి ధర రూ.1,15,000 లుగా ఉంది.ముంబైలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.1,02,220, 22 క్యారెట్ల ధర రూ.93,700 ఉంది. వెండి ధర కిలో రూ.1,15,000 గా ఉంది.చెన్నైలో 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,02,220 ఉండగా.. 22 క్యారెట్ల ధర రూ.93,700 గా ఉంది. వెండి ధర కిలో రూ.1,25,000 లుగా ఉంది. బెంగళూరులో 24 క్యారెట్ల ధర రూ.1,02,220, 22 క్యారెట్ల ధర రూ.93,700 గా ఉంది. వెండి ధర కిలో రూ.1,15,000 లుగా ఉంది.

## సామాన్యులకు పోర్టబుల్ ఏసీలు



అన్-సీజనల్ ఉక్కపోత, వేడికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమయంలో ఏసీ, కూలర్‌లతో కరెంట్ బిల్లు తడిసిమోపెడు చేసుకునే బదులు.. ఈ పోర్టబుల్ ఏసీలపై ఓ లుక్కేయండి. వీటిని ఎక్కడికైనా తీసుకుని వెళ్లొచ్చు. అసలే ఇప్పుడు వర్షాకాలం. వర్షాలు మొత్తుతాయ్ అని అందరూ అనుకుంటుంటే.. అవి కాస్తా ముఖం చాటేశాయి. చల్లచల్లగా ఉండాల్సిన వాతావరణంలో కూడా ఉక్కపోత, వేడి పెరిగిపోతోంది. ఈ అన్-సీజనల్ ఉక్కపోతకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి సమయంలోనే ఏసీ, కూలర్ల వైపు మొగ్గుచూపుతున్నారు. అయితే ఈ ఏసీ, కూలర్‌లు.. ఒక గంట వేస్తే చాలు.. కరెంట్ బిల్లుతో చుక్కలు చూడాల్సిందే. మరి అలాంటప్పుడు.. మీ చేతిలోనే రిమోట్ ఉండేలా.. తక్కువ కరెంట్ ఖర్చుతో మీరుంటున్న రూమ్‌ను ఈజీగా చల్లబరుచుకోవచ్చు. అదే పోర్టబుల్ ఏసీ. ఈ-కామర్స్ సైట్లలో ఈ పోర్టబుల్ ఏసీలు కుప్పలు తెప్పలుగా ఉన్నాయి. వీటిని మీరు ఇంట్లో ఎక్కడైనా పెట్టొచ్చు, ఎక్కడికైనా తీసుకుని వెళ్లొచ్చు. బరువు కూడా చాలా తక్కువ. మరి లేట్ ఎందుకు ఓ పోర్టబుల్ ఏసీ గురించి.?ఈ పోర్టబుల్ ఏసీ ఈ-కామర్స్ సైట్ అమెజాన్‌లో అందుబాటులో ఉంది. దీని అసలు ధర రూ. 2,889 కాగా.. 48 శాతం తగ్గింపుతో రూ. 1489కి లభిస్తోంది. దీనిలో 2400 ఎంఏహెచ్ చార్జబుల్ బ్యాటరీ ఉండగా.. సీ-కేబుల్, పవర్ బ్యాంక్, కార్ చార్జర్, యూఎస్బీ డివైజ్.. ఇలా వేటితోనైనా దాన్ని చార్జ్ చేసుకోవచ్చు. ఈ పోర్టబుల్ ఏసీని ఎక్కడికైనా తీసుకెళ్లేందుకు హ్యాండిల్ సౌకర్యం కూడా ఉంది. దీని వాటర్ ట్యాంక్‌లో ఐస్ క్యూబ్స్ లేదా వాటర్ పోయవచ్చు. అలాగే దీని స్పీడ్‌ను మీకు కావాల్సినట్టుగా తగ్గించుకోవచ్చు. ఈ పోర్టబుల్ ఏసీ ఫ్యాన్ నుంచి సుమారు 55డీబీ సౌండ్ వస్తుండగా.. అది మీ నిద్రను ఏమాత్రం డిస్టర్బ్ చేయదు. అలాగే మీరు ఈ పోర్టబుల్ ఏసీని ఒక్కసారి ఫుల్ ఛార్జ్ చేస్తే.. సుమారు 8 గంటల వరకు పని చేస్తుంది. రాత్రివేళ 7 రంగుల్లో దీని ఎల్ఈడీ మీ బెడ్ రూమ్‌కు కాంతి అందిస్తుంది.

## సెకండ్ హ్యాండ్ కారు కొనే ముందు తనిఖీ చేయవలసిన విషయాలు



పాత కారు కొనే ముందు దానిని మంచి మెకానిక్ ద్వారా తనిఖీ చేయించడం లేదా కంపెనీ అధీకృత సర్వీస్ సెంటర్‌కు తీసుకువెళ్లడం చాలా ముఖ్యం. కుటుంబ అవసరాల కోసం లేదా సెలవుల్లో టూర్లు ప్లాన్ చేయడానికి సొంత కారు కలిగి ఉండడం ప్రతి ఒక్కరి కల. సొంత కారు ఉన్నాలన్న కలను నెరవేర్చుకునేందుకు చాలా మంది సెకండ్ హ్యాండ్ కారును కొనుగోలు చేస్తుంటారు. కొత్త కారు కొనే స్థితిలో లేనివారు సెకండ్స్‌కు వెళ్తుంటారు. అయితే సెకండ్ హ్యాండ్ కారు కొంటున్నట్లయితే ముందు ఈ విషయాలను గుర్తించుకోవడం చాలా ముఖ్యం. లేకుంటే భారీగా నష్టపోయే ప్రమాదం ఉందంటున్నారు టెక్ నిపుణులు. సెకండ్ హ్యాండ్ కారు కొనేటప్పుడు చాలా జాగ్రత్త అవసరం. కాస్త అజాగ్రత్తగా ఉన్నా పెద్ద ఇబ్బందుల్లో పడే ప్రమాదం ఉంది. కొన్ని చిట్కాలను పాటిస్తే ఎలాంటి సమస్యలు లేని మంచి సెకండ్ హ్యాండ్ కారును కొనుగోలు చేయవచ్చు. సెకండ్ హ్యాండ్ కారు కొనడానికి ముందు, మొదట చేసేపని మీ బడ్జెట్‌ను నిర్ణయించుకోవడం. మీ బడ్జెట్ దాటి వెళితే ఆర్థిక భారం పెరుగుతుంది. సరైన అవగాహన లేకుండా కొంటే దాదాపు కొత్త కారు ధర అవుతుంది. సెకండ్ హ్యాండ్ కార్లు అమ్మే వివిధ ప్లాట్‌ఫామ్‌లలో అదే కారు ధరను చెక్ చేయండి. మీ బడ్జెట్‌ను బట్టి ఒక ప్లాట్‌ఫామ్‌ను ఎంచుకోండి. మీరు కొనాలనుకుంటున్న పాత కారును ఎంచుకున్న తర్వాత ఆ వాహనాన్ని టెస్ట్ డ్రైవ్ చేయండి. ఏదో కాస్త దూరం అలా వెళ్లి ఇలా వస్తే ఆ కారులో లోపాలు కనిపించవు. అవసరం అనుకుంటే మంచి మెకానిక్‌ను తీసుకెళ్లి చూపించండి. వీలైనంత లాంగ్ డ్రైవ్ చేయండి. తద్వారా ఆ కారు బాగా నడుస్తుందో లేదో మీకు తెలుస్తుంది. ఏదైనా సమస్య ఉంటే మీరు ముందుగానే అర్థం చేసుకుంటారు. అనుభవజ్ఞుడితో కారు నడిపిస్తే మరి మంచిది. లోపాలు ఏమైనా ఉంటే తెలుసుకోవచ్చు. అతని సూచనల ప్రకారం కారు కొనండి. మరో అతి ముఖ్యమైన విషయం 'అంచనా'. టెస్ట్ డ్రైవ్ సమయంలో మీరు గమనించిన విషయాలు, లోపాలు, ఆ బండి మార్కెట్ ధర, అడిగే ధర అన్నింటినీ అంచనా వేయండి. కారులో ఏవైనా లోపాలు ఉంటే వాటిని మరమ్మతు చేయడానికి అయ్యే ఖర్చును ఖచ్చితంగా అంచనా వేసి, కార్ అమ్మే ధర నుంచి ఆ ఖర్చులను తగ్గించి అడగండి. లేదా, మరమ్మతులన్నీ చేయించిన తర్వాత తీసుకుంటానని చెప్పండి. మీ డబ్బుకు సరైన విలువ ఇచ్చే కారును మాత్రమే ఎంచుకోండి.

## ఈడీ ముందుకు అనిల్ అంబానీ



రూ.17వేల కోట్ల లోన్ మోసం కేసు విచారణ నిమిత్తం పారిశ్రామికవేత్త అనిల్ అంబానీ ఈడీ ఎదుట హాజరయ్యారు. మంగళవారం ఉదయం 11 గంటల సమయంలో ఢిల్లీలోని ఈడీ ఆఫీస్‌కు ఆయన చేరుకున్నారు. 11.30 గంటలకు విచారణ మొదలైనట్లు తెలుస్తోంది. ప్రస్తుతం విచారణ కొనసాగుతోంది. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం.. ఈడీ అధికారులు అనిల్ లాయర్లను లోపలికి అనుమతించలేదు. లాయర్లు లేకుండానే అనిల్‌ను విచారిస్తున్నారు. మొత్తం విచారణను కెమెరాలో రికార్డు చేస్తున్నారు. ప్రివెన్షన్ ఆఫ్ మనీల్యాండరింగ్ యాక్ట్ కింద అనిల్ అంబానీ స్టేట్‌మెంట్‌ను రికార్డు చేస్తున్నారు. కాగా, లోన్ మోసం కేసుకు సంబంధించి ఈడీ ఆగస్టు 1వ తేదీన ఆయనకు సమన్లు జారీ చేసింది. విచారణకు హాజరు కావాలని ఆదేశించింది. ఆ వెంటనే అంబానీకి లుక్ అవుట్ నోటీసులు జారీ చేసింది. ఈ కేసుతో సంబంధం ఉన్న బిశ్వాల్ ట్రేడ్ లింక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ పార్థసారథి బిశ్వాల్‌ను సైతం అరెస్ట్ చేసింది. రూ.68.2కోట్ల విలువైన ఫేక్ గ్యారెంటీలు ఇచ్చాడన్న ఆరోపణల నేపథ్యంలో ప్రివెన్షన్ ఆఫ్ మనీ ల్యాండరింగ్ యాక్ట్ కింద బిశ్వాల్ ను అదుపులోకి తీసుకుంది. 2017 నుంచి 2019 మధ్య కాలంలో రిలయన్స్ కంపెనీ యస్ బ్యాంకు నుంచి రూ.3వేల కోట్ల లోన్లు తీసుకుంది. ఈ రూ.3వేల కోట్లను అనిల్ అంబానీ దారి మళ్లించారన్న ఆరోపణలు ఉన్నాయి. లోన్ ఇవ్వడానికి ముందు బ్యాంకు ప్రమోటర్లకు పెద్ద మొత్తం నిధులు అందినట్లు ఈడీ కనుగొంది. రూ.3వేల కోట్ల లోన్ నిధుల మళ్లింపును క్విడ్ ప్రోకోగా తేల్చింది. అంతేకాదు.. రిలయన్స్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్ మరో రూ.14వేల కోట్ల లోన్ మోసాలకు పాల్పడినట్లు ఈడీ అధికారులు తేల్చారు. మొత్తం రూ.17వేల కోట్లకు సంబంధించి ప్రస్తుతం విచారణ జరుగుతోంది. వివిధ బ్యాంకుల నుంచి రిలయన్స్ కంపెనీ తీసుకున్న లోన్ల గురించి ఈడీ ఆరా తీస్తోంది. ఇప్పటికే పలు బ్యాంకులకు లోన్ల వివరాలు చెప్పాలంటూ లేఖలు రాసింది.

## రూపాయికి సుంకాల పోటు

గడిచిన కొన్ని రోజుల్లో భారత కరెన్సీ విలువ తీవ్ర ఒడుదుడుకులకు లోనవుతోంది. ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం విలువ సోమవారం మరో 48 పైసలు పతనమై రూ.87.66 వద్ద ముగిసింది. ట్రంప్ సుంకాల పోటు, మన ఈక్విటీ మార్కెట్ నుంచి విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్ల (ఎఫ్ఐఐ) పెట్టుబడుల ఉపసంహరణ, దిగుమతిదారుల నుంచి డాలర్లకు డిమాండ్ పెరగడం ఇందుకు కారణమని ఫారెక్స్ వర్గాలు తెలిపాయి. గతవారంలోనూ రూపాయి మారకం విలువ 1.2 శాతం పతనమైంది. 2022 డిసెంబరు తర్వాత మన కరెన్సీకిదే అతిపెద్ద వారం రోజుల క్షీణత. అమెరికా-భారత్ మధ్య వాణిజ్య ఒప్పందంపై అనిశ్చితితోపాటు విదేశీ పెట్టుబడులు తరలిపోతుండటంతో రాబోయే కాలంలో కూడా రూపాయి బలహీనంగానే ఉండవచ్చని మిరే అసెట్ షేర్‌ఖాన్ కమోడిటీస్, కరెన్సీస్ రీసెర్చ్ అనలిస్ట్ అనూజ్ చౌదరి అభిప్రాయపడ్డారు. రాబోయే సెషన్లలో డాలర్-రూపీ మారకం రేటు రూ.88.50కి చేరుకోవచ్చని ఐసీఐసీఐ బ్యాంక్ తాజా నివేదిక అంచనా వేసింది. అయితే, బలహీనపడుతున్న డాలర్, ఆర్‌బీఐ వడ్డీరేట్ల తగ్గింపు వంటి అంశాలు కనిష్ఠ స్థాయిల్లో రూపాయికి మద్దతుగా నిలవవచ్చని ఫారెక్స్ వర్గాలు భావిస్తున్నాయి.

వార్తాతరంగాలు

మంగళవారం 05 ఆగస్టు 2025

# అభివృద్ధి నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలి...

**జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్**



**నారాయణపేట ఆగస్టు 5 (స్కైన్యూస్)** నారాయణపేట జిల్లా కేంద్రంలో కొనసాగుతున్న అభివృద్ధి నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. టి.జి. ఎంఎస్ఐడిసీ ప్రాజెక్టు పరిధిలో రూ.26 కోట్ల వ్యయంతో నారాయణపేట మండలంలోని అప్పక్ పల్లి వద్ద గల ప్రభుత్వ మెడికల్ కళాశాల/జిల్లా ఆస్పత్రి పక్కన కొనసాగుతున్న నర్సింగ్ కాలేజ్, రూ.40 కోట్ల నిధులతో చేపట్టనున్న ఎంసీహెచ్ ( మెటర్నిటీ చైల్డ్ హెల్త్) సెంటర్ పనులను మంగళవారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ పరిశీలించారు. ముందుగా నర్సింగ్ కాలేజ్ నిర్మాణ పనులను చూసిన కలెక్టర్ పనుల్లో వేగం పెంచాలని అధికారులకు సూచించారు. నర్సింగ్ కాలేజ్ భవనంతో పాటు చుట్టూ ప్రహరీని ఏర్పాటు చేయాలన్నారు. అయితే కాలేజ్ కి అటు వైపు కొంత స్థలం ఆక్రమణ కు గురవుతుందని అధికారులు కలెక్టర్ దృష్టికి తీసుకు రావడంతో స్పందించిన కలెక్టర్ వెంటనే సర్వే చేయించి కాలేజ్ కి కేటాయించిన స్థలాన్ని పూర్తి స్థాయిలో స్వాధీనం చేసుకోవాలని స్థానిక తహసిల్దార్ అమరేంద్ర కృష్ణ ను ఆదేశించారు. అనంతరం పక్కనే ఉన్న ప్రభుత్వ ఆసుపత్రి వద్దకు వెళ్లిన కలెక్టర్ ను మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సంతోష్ కుమార్, మిగతా ప్రొఫెసర్లు, వైద్యులు ఆస్పత్రి కి తాగునీటి వసతి, ప్రధాన రహదారి నుంచి ఆస్పత్రి వరకు వీధి దీపాలు అవసరమని కోరారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యను పలకరిస్తానని ఆమె తెలిపారు. ఆస్పత్రి ఆవరణ లోకి వచ్చిన ఆర్టీసీ బస్ ను చూసిన కలెక్టర్ అక్కడే ఉన్న ఆర్టీసీ డిపో మేనేజర్ లావణ్య తో మాట్లాడి ఆస్పత్రికి వచ్చే రోగుల సంఖ్య ను దృష్టిలో ఉంచుకుని ప్రధాన రహదారీ నుంచి ఆసుపత్రి ఆవరణ లోకి బస్సులను నడిపించాలని సూచించారు. తర్వాత ఆస్పత్రి వెనక భాగంలో ఎం సీ హెచ్ సెంటర్ నిర్మాణ పనుల ప్రారంభానికి చేస్తున్న లెవెలింగ్ పనులను పరిశీలించారు. లెవెలింగ్ పనులు వేగంగా పూర్తి చేసి ఎంసీ హెచ్ సెంటర్ నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలని అధికారులకు సూచించారు. చివరగా సింగారం మలుపు దారి వద్ద గల వృత్తి నైపుణ్య అభివృద్ధి కేంద్రం పక్కన దాదాపు పూర్తి కావస్తున్న హ్యాండ్ లూమ్ స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ ను కలెక్టర్ పరిశీలించారు. రూ.8.50 కోట్ల తో చేపట్టిన హ్యాండ్ లూమ్ స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ లో ఇంకా మిగిలిపోయిన డోర్స్, కిటికీలు, ఇతర ఎలక్ట్రికల్ పనులను కూడా త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. అలాగే సెంటర్ చుట్టూ ప్రహరీ నిర్మాణం, సీసీ రహదారి నిర్మాణం, టాయిలెట్ బ్లాక్ పనుల కోసం అదనంగా రూ.4 కోట్లు మంజూరు అయ్యాయని, ఆయా నిర్మాణ పనులను తొందరగా ప్రారంభించి పూర్తి చేసి హ్యాండ్ లూమ్ స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ ను ప్రారంభానికి సిద్ధం చేయాలని కలెక్టర్ టీజీ ఎంఎస్ఐడీసీ అధికారులకు సూచించారు. సెంటర్ ఆవరణ లో నిరుపయోగంగా ఉన్న వృత్తి నైపుణ్య అభివృద్ధి కేంద్రానికి చెందిన మూడు మరుగు దొడ్ల కు మరమ్మతులు చేయించాలని అధికారులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, టీజీ ఎంఎస్ఐడీసీ ఈ ఈ వేణుగోపాల్, డీ ఈ కృష్ణ మూర్తి, తహాసిల్దార్ అమరేందర్ కృష్ణ, ఏ ఈ సాయి మురారి తదితరులు పాల్గొన్నారు.

# అంగరంగ వైభవంగా ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్టాపన

**హాజరైన ఎమ్మెల్యే వీర్ల పల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే బక్కని నర్సింలు**



**రంగారెడ్డి జిల్లా షాద్ నగర్5(స్కైన్యూస్)** పట్టణంలో శివ మారుతి అయ్యప్పస్వామి దేవాలయం లో 13అడుగుల ఆంజనేయ స్వామి విగ్ర ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమానికి హాజరై దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన షాద్ నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎమ్మెల్యే బక్కని నరసింహులు అన%శీ%తరం ఆలయ కమిటీ అర్చకులు దేవాలయ కమిటీ అధ్యక్షుడు లష్కర్ ఆంజనేయులు ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేను సన్మానించారు ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు కొంకళ్ళ చెన్నయ్య, గ్రంధాలయ కమిటీ చైర్మన్ మదన్మోహన్ రెడ్డి, చెంది తిరుపతిరెడ్డి, దాస కృష్ణయ్య ,వీరేశం మురళీమోహన్ (అప్పి), పాండు నీరటి వాసు, మాణిక్య%శీ%, రామ్ భూపాల్ గోపాల్, ఆనంద్, నల్లమోని శ్రీధర్ పోలేపల్లి సందీప్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు

# ఆదరాభిమానలతోనే ఆయురారోగ్యాలు




**నాగర్ కర్నూల్ ఆగస్టు 5 (స్కై న్యూస్)** వ్యక్తులపై ఇతరులు చూపే ఆదరాభిమానాలతోనే ప్రతి ఒక్కరు సుదీర్ఘ కాలం పాటు ఆయురారోగ్యాలతో జీవించవచ్చని పదవీ విరమణ పొంది శత జయంతి ఉత్సవాలు జరుపుకుంటున్న గున్నా రఘునందన్ రెడ్డిని మంగళవారం ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో హైదరాబాదులోని ఆయన నివాస గృహంలో సన్మానం చేశారు ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ జిల్లాలోని శిరసవాడ గ్రామానికి చెందిన రఘునందన్ రెడ్డి సానిటరీ ఇన్స్పెక్టర్ గా పదవీ విరమణ పొందారని తెలిపారు. పదవీ విరమణ పొందిన 41 సంవత్సరాలు ఉగా పెన్షన్ పొందుతూ 42వ సంవత్సరంలోకి అడుగుపెట్టి ఆయన వయసు రిత్యా 100 సంవత్సరంలోకి అడుగు పెడుతున్నారని ఈ సందర్భంగా ఆయనను సన్మానించినట్లు తెలిపారు ఈ సందర్భంగా రఘునందన్ రెడ్డి మాట్లాడుతూ అందరి అభిమానం భగవంతుడి ఆశీస్సులతో జీవనం సుఖంగా సాగుతుందని తెలిపారు ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు రామచంద్రారెడ్డి ప్రధాన కార్యదర్శి శ్రీధర్ మండల అధ్యక్షులు సుధాకర్ రెడ్డి నాయకులు శ్రీనివాసులు సంజీవ గౌడ్ పాండు పాండురంగయ్య జానకి రాములు కిషన్ రావు శివరాములు నారాయణరెడ్డి తోపాటు వారి కుటుంబ సభ్యులు రాజా మోహన్ రెడ్డి జగదీశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు

# జిల్లాలోని నిరుద్యోగ యువకులు సద్వినియోగపర్చుకోవాలి

**జిల్లా ఉపాధి కల్పన అధికారి కొండపల్లి శ్రీరామ్**



**కొత్తగూడెం ఆగస్టు 4 (స్కై న్యూస్ ):**ఏ యూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకు కొత్తగూడెం నందు వివిధ భాగాలలో పనిచేయుటకు మొత్తం 30 ఖాళీలకు గాను ఉద్యోగాలు కల్పించేందుకు ఉపాధి కల్పనా శాఖ ఆధ్వర్యంలో 2025 ఆగస్టు ఏడో తారీఖు అనగా గురువారం నాడు జాబ్ మేళా ఎంపీడీవో ఆఫీస్ బాబు క్యాంపు కొత్తగూడెం నందు నిర్వహించబడుతుంది కావున ఈ అవకాశాన్ని 20 నుండి 32 సంవత్సరాల గల నిరుద్యోగ యువకులు సద్వినియోగం చేసుకోవాలని అభ్యర్థులు తప్పనిసరిగా ద్విచక్ర వాహనం కలిగి ఉండాలి విద్యా అర్హతలు పదవ తరగతి ఇంటర్మీడియట్ డిప్లమా ఐటిఐ చదివి ఉండాలి జీతం 16 వేల నుండి మొదలవుతుంది ఇన్సెంటివ్ అలవెన్స్ ఉంటాయిఅని జిల్లా ఉపాధి కల్పనా శాఖ అధికారి కొండపల్లి శ్రీరామ్ తెలియజేశారు

# కంచె తొలగిస్తాం.. ఉధ్యాన వనంగా మారుస్తాం..

**బూర్గుల నర్సింగరావు సోదరి, మాజీ ఎంపీటీసీ సుమన హామీ..**

**బూర్గుల దళితులకు కంచె నుంచి విముక్తి..**

**గ్రామాన్ని సందర్శించిన, దళిత సంఘాలు, కమ్యూనిస్టు నాయకులు..**

**హలో షాద్ నగర్ కథనానికి స్పందన**

**బూర్గులను సందర్శించిన సిపిఎం నేతలు సామెల్, ఎన్ రాజు, శీను నాయక్**

**కంచెను తొలగించిన టిఎంఆర్పిఎస్, ఎస్సీ, ఎస్టీ, బీసీ జేఏసీ నాయకులు**



బుర్గుల రామకృష్ణారావు, నరసింగరావు కుటుంబంలో ఎవరు కూడా భూములు దానం చేశారే తప్ప ఆక్రమించలేదు.. ఈ భూమిలో మొక్కలు పెంచి ఉద్యానవనంగా మార్చాలి అన్నది లక్ష్యం.. అంతే తప్ప దళితుల మార్గాన్ని ఆక్రమించడం కాదు.. ఉద్యానవనం గా మారుస్తాం.. కంచెను వెంటనే తొలగిస్తాం.. అని బూర్గుల నర్సింగరావు సోదరి సుమన హామీ ఇచ్చారు. ఫరూక్ నగర్ మండలం బూర్గుల గ్రామంలో దళితులు నివాసం ఉండే ప్రాంతంలో భూమికి కంచవేసి వారిని నడవకుండా చేసిన వైనంపై హలో షాద్ నగర్ కథనాన్ని అందించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో గ్రామాన్ని టిఎమ్ఆర్పిఎస్ నాయకుడు జంగయ్య, ఎస్సీ ఎస్టీ బీసీ జేఏసీ ఫరూక్ నగర్ మండల పార్టీ అధ్యక్షుడు చెన్నయ్య, ప్రధాన కార్యదర్శి శ్రీశైలం, షాద్ నగర్ కమ్యూనిస్టు నాయకులు ఎన్.రాజు, కెవిపిఎస్ నాయకులు సామెల్, తదితరులు గ్రామానికి వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. అయితే విషయం తెలుసుకొని



గ్రామానికి చేరుకున్న బూర్గుల నర్సింగరావు సోదరి, గ్రామ మాజీ ఎంపీటీసీ సుమన మీడియాతో మాట్లాడారు. ఈ కంచెను వెంటనే తొలగిస్తున్నట్లు ప్రకటించారు. తమ సోదరుడు నరసింహారావు అక్కడి తమ భూమిలో చెట్లు పెంచి ఉద్యానవనంగా మార్చాలని అనుకున్నారని, కానీ ఆ కోరిక తీరకుండానే ఆయన కన్నుమూశారని వివరించారు. అయితే చెట్లు పశువుల పాలవుతాయనే ఉద్దేశంతో కంచె వేయడం జరిగింది తప్ప వేరే ఉద్దేశం లేదని ఆమె స్పష్టం చేశారు. దీనివల్ల దళితులు ఇబ్బందులు పడుతున్న విషయాన్ని గుర్తించి వెంటనే తొలగించేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. గతంలో రైతు భవనానికి, గ్రంథాలయానికి తాము భూమి ఇచ్చినట్లు గుర్తు చేశారు. అదేవిధంగా తాను అడగగానే ప్రగతి వెల్ఫేర్ సొసైటీ నుంచి 500 గజాల స్థలాన్ని ఇచ్చారని అన్నారు. గ్రామంలో పర్యావరణ పరిరక్షణలో భాగంగా చెట్లు నాటి ఉద్యానవనంగా మారుస్తామని ఆమె స్పష్టం చేశారు. దానికి తన పెదనాన్న పెద్దమ్మలైన రామకిషన్ రావు, అనంతలక్ష్మి, లీలా దేవి పేర్లను పెడతామని పేర్కొన్నారు. దళితులకు జరిగిన ఈ అసౌకర్యం పట్ల తాను బాధపడుతున్నట్లు ఆమె వెల్లడించారు. భవిష్యత్తులో ఇలాంటివి అనరావృతం కావని ఆమె స్పష్టం చేశారు.

# ఎమ్మెల్యే సాబ్ షుక్రియ...

**ప్రజా సమస్యలకు పరిష్కార మార్గం మన ఎమ్మెల్యే.**

**షాద్ నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, యువనేత అందె మోహన్.**

**ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపిన కాలనీ వాసులు, నేతలు.**

**షాద్నగర్ 5(స్కైన్యూస్):**ప్రజా సమస్యలను పరిష్కరించే మార్గంలో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ముందుంటారని, నిత్యం ప్రజల మధ్య ఉంటూ వారి సమస్యలను తీర్చుతున్న తీరు ప్రశాంసానీయమని షాద్ నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, యువనేత అందెమోహన్ లు అన్నారు. మంగళవారం 11, 12,13,14 వార్డుల్లో స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పలు అభివృద్ధి పనులను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా స్థానిక మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, యువనేత అందె మోహన్ తదితర కాంగ్రెస్ నేతలు ఎమ్మెల్యే వెంట ఉండి జరుగుతున్న పనులను, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఎమ్మెల్యేకు వివరించారు. అనంతరం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, యువ నేత అందెమోహన్ లు స్థానిక మీడియాతో మాట్లాడుతూ... ఎమ్మెల్యే శంకరన్న షాద్ నగర్ మున్సిపాలిటీని ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో పనిచేస్తుండడం ప్రశంసనీయమని వారు కొనియాడారు. మున్సిపాలిటీ పరిధిలోని ప్రతి వార్డులో అభివృద్ధి పనులను ముమ్మరంగా చేపట్టడం జరుగుతుందని, ప్రజల సమస్యలు తీర్చడంలో మన ఎమ్మెల్యే ఎప్పుడు ముందుంటారని వారు అన్నారు. నేడు 11, 12,13,14 వ వార్డుల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి, దిశా నిర్దేశం చేశారని వారు పేర్కొన్నారు. ఆయా వార్డులలో లో వోల్టేజ్ కరెంటు సమస్యలను తీర్చుతూ సుమారు 50 స్తంభాలను, సరిపడా కండక్టర్ వైర్లను అందజేయడం సంతోషంగా ఉందని అన్నారు. ఇవే కాక అనేక సమస్యలతో ప్రతి ఒక్కరికి ఎమ్మెల్యే తన వంతుగా పరిష్కార మార్గం చూపడం పట్ల వారు కొనియాడారు. వార్డుల అభివృద్ధికి కృషి



చేస్తున్న ఎమ్మెల్యేకు ఆయా వార్డుల కాలనీ వాసుల తరఫున ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేస్తున్నామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత ఇబ్రహీం, జమ్రుద్ ఖాన్, యువ నాయకులు ముబారక్, ఖదీర్, గంగా, బీరప్ప, సాయి, దిలీప్, రవి, మసూద్, శ్రీదేవి, భూషణ్, చిన్న, జయప్రకాష్, జావిద్, ఆర్ కృష్ణ, యాదయ్య, శ్రీను, రాజేందర్, లింగం, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రాలు తనిఖీ...

**జోగులాంబ గద్వాల, ఆగస్టు 5 ( స్కై న్యూస్):**అంగన్వాడి కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్న పిల్లలకు సరైన సమయంలో పౌష్టికాహారం అందించాలని జిల్లా కలెక్టర్ బి.యం.సంతోష్ అన్నారు. మంగళవారం గద్వాల్ పట్టణంలోని గంజిపేట అంగన్వాడీ కేంద్రాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంగన్వాడీ సెంటర్లో ఉన్న పిల్లలు, తల్లులు, బాలింతలకు అందుతున్న అంగన్వాడీ సేవల గురించి సిబ్బందిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. పిల్లలను ఆంగ్ల అక్షరాభ్యాసం చేయించి,వారు సరైన సమాధానాలు చెప్పడాన్ని ప్రశంసిస్తూ,ఇలా ప్రతి ఒక్కరు చెప్పగలగాలన్నదే లక్ష్యంగా పనిచేయాలన్నారు. బాలలకు మంచి విద్యాను అందించి వారి పునాదులు మరింత బలోపేతం చేయాలని అన్నారు. కేంద్రంలో చిన్నారుల బరువు,ఎత్తులను పరిశీలించి, తక్కువగా ఉన్న పిల్లలపై ప్రత్యేక దృష్టి సాధించాలని సూచించారు. డేటా నమోదు కోసం ఉపయోగిస్తున్న మొబైల్ యాప్‌ను తనిఖీ చేసి, సమాచారం నిబంధనల ప్రకారం క్రమంగా మరియు ఖచ్చితంగా నమోదు చేయాలని అంగన్వాడీ టీచర్‌ను ఆదేశించారు. పిల్లల్లో సామ్ మరియు మ్యామ్ లాంటి పోషకాహార లోపాలు ఏర్పడకుండా, వారికి సమతుల్యమైన పోషణ అందించి, ఆరోగ్యంగా ఉండేలా చూసుకోవాలి



అన్నారు.పోషన్ ట్రాకర్,ఎన్‌హెచ్‌టీఎస్ యాప్‌లలో సమాచారం ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేయాలని సూచించారు. గర్భిణీల ఆరోగ్యంపై పర్యవేక్షణ కొనసాగిస్తూ, వారికి అవసరమైన పోషకాహారంపై అవగాహన కల్పించాలన్నారు. అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని,మంచి ఆహారం, పరిశుభ్రత,అవసరమైన సదుపాయాలు కల్పిస్తూ, కేంద్రాన్ని సక్రమంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అంగన్ వాడి టీచర్లు రజియా,లక్ష్మి, నర్సింహా, తదితరులు పాల్గొన్నారు.

# ప్రగతి నిర్మాణ పనులను పర్యవేక్షించిన జిల్లా కలెక్టర్

**నారాయణపేట ఆగస్టు 5 (స్కైన్యూస్)** మక్తల్ నియోజకవర్గంలో కొనసాగుతున్న ప్రగతి నిర్మాణ పనులను మంగళవారం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ పర్యవేక్షించారు. మక్తల్ సమీపంలో 916/2, 917/2 సర్వే నంబర్ లోని పదెకరాల ప్రభుత్వ స్థలంలో రూ. 34 కోట్ల వ్యయంతో చేపట్టిన 150 పడకల ప్రభుత్వ ఆస్పత్రి నిర్మాణ పనులను ఆమె పరిశీలించారు. నిర్మాణ పనులు పిల్లర్ల దశలోనే ఉన్నాయని, పనుల్లో వేగం పెంచాలని ఆమె సూచించారు. మైల్డ్ స్టోన్ ప్రకారం నిర్మాణ పనులు త్వరగా జరగాలని ఆదేశించారు. ఆస్పత్రి భవన నిర్మాణ నమూనా ప్లాన్ ను ఆమె పరిశీలించారు. అనంతరం కృష్ణా మండల కేంద్రంలో రెండు ఎకరాల ప్రభుత్వ స్థలంలో రూ.156 లక్షల నిధులతో కొనసాగుతున్న ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మాణ పనులను సైతం కలెక్టర్ పరిశీలించారు. ప్లాస్టరింగ్ దశలో ఉన్న పి హెచ్ సీ భవనం లోపల కొనసాగుతున్న మెడికల్ ఆఫీసర్ గది, స్టాఫ్ రూమ్, ఫార్మసీ, ఇమ్యూనైజేషన్ గదులను చూశారు. నిర్మాణ పనులు ఎప్పుడు పూర్తవుతాయని సంబంధిత అధికారులను కలెక్టర్ ప్రశ్నించగా మరో మూడు నెలల్లో నిర్మాణ పనులు పూర్తవుతాయని వారు తెలిపారు. పిహెచ్ సీ చుట్టూ ప్రహరీ నిర్మాణం ప్రతిపాదనల్లో ఉందా లేదా? అడిగి తెలుసుకున్నారు.



జింకల పార్కు ఏర్పాటు కోసం మూడ్ మల్ శివారులో ప్రభుత్వ స్థలాన్ని అటవీ శాఖ అధికారులకు అప్పగించారా ?లేదా ? అని రెవెన్యూ అధికారులను అడిగిన కలెక్టర్ వెంటనే అప్పగించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, టీజీఎంఎస్ఐడీసీ ఈ ఈ వేణుగోపాల్, డీ.ఈ. కృష్ణ మూర్తి, ఏ.ఈ. సాయి మురారి, మక్తల్, కృష్ణా తహసిలార్లు సతీష్ కుమార్, శ్రీనివాస్, ఎంపీడీఓ రమేష్ కుమార్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

# అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలి



**-ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం.డి,కుతుబ్**

**దేవరకద్ర అమరచింత ఆగస్టు 5 (స్కై న్యూస్):** అర్హులైన పేదలకే ఇందిరమ్మ ఇల్లు కేటాయించాలని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి ఎం డి కుతుబ్ గ్రామ సిపిఐ కార్యదర్శి అంజి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం అమరచింత మండలం కొంకన్వాని పల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇండ్లు మంజూరుకు నోచుకోని నిరుపేదలను కలిశారు. నర్వ లక్ష్మి, దేవరపల్లి జయమ్మ, లక్ష్మీ, మహేశ్వరి, కుర్వ రాములమ్మ నివాసముంటున్న పూరి గుడిసెలను పరిశీలించారు. ఇందిరమ్మ ఇండ్లు వస్తాయని ఎంతో ఆశతో తమ గుడిసెలను సైతం కూల్చి వేసుకున్నామని బాధితులు నాయకులతో వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకే ఇందిరమ్మ ఇల్లు ఇస్తామని చెప్పి తీరా ఇవ్వకుండా వారికి అన్యాయం చేశారని ఆరోపించారు. ఇప్పటికైనా ప్రభుత్వం రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి ఇండ్లు లేని వాళ్ళు స్వయంగా పరిశీలించి ఇండ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అమరచింత ఎంపీడీవో, మున్సిపల్ కార్యాలయాల ముందు ఆందోళన చేపడతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు వెంకట్ రెడ్డి, అంకె రాజు, శ్రీను, కురుమన్న, గొల్ల రాజు పాల్గొన్నారు.

# డీజే లకు అనుమతి లేదు: జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్

**నారాయణపేట ఆగస్టు 5 (స్కై న్యూస్)** గణేష్ ఉత్సవాలు, ఇతర మత పరమైన పండగల సందర్భంగా నారాయణపేట జిల్లా పరిధిలో డీజేలకు అనుమతి లేదని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ ఐపీఎస్ ఉత్సవ కమిటీ సభ్యులకు తెలిపారు. సుప్రీంకోర్టు ఆదేశం ప్రకారం నారాయణపేట జిల్లాలో శాంతి భద్రతల పరిరక్షణ (లా అండ్ ఆర్డర్)లో భాగంగా మతపరమైన పండుగలు ఊరేగింపుల సమయంలో డిజె సౌండ్ సిస్టమ్స్/పబ్లిక్ అడ్రస్ సిస్టమ్స్ మరియు బాణసంచా వాడకం పెద్ద శబ్ద కాలుష్యం వచ్చే సిస్టంలను నారాయణపేట జిల్లా పరిధిలో నిషేధించబడిందని, భారతీయ నాగరికత సురక్ష సంహిత బి ఎన్ ఎస్ ఎస్. యు / ఎస్ 163 (గతంలో 144 %ఎతీజూఎ%) ప్రకారం ఆర్డిఓ రామచందర్ ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం రోజు నారాయణపేట జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులకు, హిందూ మత పెద్దలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ మాట్లాడుతూ... నారాయణపేట జిల్లా పరిధిలో అధిక శబ్దం వచ్చే డీజే సౌండ్ సిస్టంల వల్ల పెద్దవారికి ముఖ్యంగా వృద్ధులు, ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న రోగులు, పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులు, చిన్న పిల్లలకు, ప్రతి ఒక్కరి



ఆరోగ్యానికి హానికరం కావడంతోపాటు శబ్ద కాలుష్య చట్టాల ఉల్లంఘన మరియు సంప్రదాయ ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవడానికి నారాయణపేట జిల్లాలో డీజే లను నిషేధిస్తున్నట్టు తెలిపారు. రాబోయే గణేష్ ఉత్సవాల సందర్భంగా మరియు ఇతర మతపరమైన పండగలకు డీజేలకు అనుమతి లేదని ముందస్తు డీజేలను ఎవరు బుక్ చేసుకోరాదని, ఒక వేళ డీజే లను ఎవరైనా పెడితే సీజ్ చేసి మండపం యొక్క ఆర్గనైజర్స్ పై కేసు నమోదు చేసి, వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ హెచ్చరించారు. డిజెల నిషేధానికి సంబంధించిన ఆర్డిఓ ఆర్డర్ కాపీలను ఉత్సవ కమిటీ సభ్యులకు అందించడం జరిగింది అని ఉత్సవాలలో డీజేలకు బదులుగా చిన్న సౌండ్ బాక్సులను, షేర్ బ్యాండ్, సన్నాయి, కోలాటం, చెక్కభజన మొదలైన నృత్య ప్రదర్శనలతో ఉత్సవాలను ఘనంగా నిర్వహించుకోవాలని ఎస్పీ సూచించారు. పండుగలను సాంప్రదాయ బద్ధంగా జరుపుకునే విధంగా జిల్లా ప్రజలు ఉత్సవల కమిటీ ఆర్గనైజర్స్ యువతకు దిశ నిర్దేశం చేయాలని అలాగే జిల్లా పోలీస్ శాఖకు సహకరించాలని, రాష్ట్రంలో నారాయణపేట జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని ఎస్పీ కోరారు. అనంతరం ఉత్సవాల ఆర్గనైజర్స్ యొక్క సలహాలు సూచనలు స్వీకరించి వాటిని అమలు చేస్తామని నారాయణపేట జిల్లాలో గణేష్ ఉత్సవాలు శాంతియుతంగా నిర్వహించడానికి అందరూ సహకరించాలని ఎస్పీ తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎండి రియాజ్ హూల్ హక్, డిఎస్పి నల్లపు లింగయ్య, సీఐ లు శివ శంకర్, సైదులు, ఎస్సై లు మరియు రఘువీర్ యాదవ్, గందే చంద్రకాంత్, నందు నమజీ, కన్న శివకుమార్, మురళి బట్టడ్, రఘురామయ్య గౌడ్ చెన్న రెడ్డి, ప్రవీణ్, శ్రవణ్, నారాయణపేట మరికల్ సర్కిల్ పరిధిలోని ఆర్గనైజర్స్ పాల్గొనడం జరిగింది.

## ప్రధాన సమస్యలపై బైక్ ర్యాలీ నిర్వహించాలి



**జోగులాంబ గద్వాల, ఆగస్టు 5 (స్కై న్యూస్):** గద్వాల పట్టణంలోని డీకే బంగ్లాలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు మాట్లాడుతూఈ నెల 6,7 ,8 తేదీలలో ప్రతి మండలాలలో ఉన్నటువంటి ప్రధాన సమస్యలపై బైక్ ర్యాలీ చేపట్టి మండలంలోని స్థానిక ప్రధాన సమస్యలపై అధికారులకు వినతి పత్రాలు ఇవ్వాలని అన్నారు.ఆగస్టు 9 ,10 తేదీలలో ప్రవాస్ యోజన కార్యక్రమంలో భాగంగా బిజెపి పార్టీ అన్ని మోర్చాలు 24 గంటలు ఒక మండలంలో ఉండి స్థానిక సమస్యలు పై అక్కడ ఉన్న విద్యావంతులతో చర్చించి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు.రాష్ట్రంలో త్వరలో జగనన్న స్థానిక సంస్థల ఎన్నికలలో బిజెపి పార్టీ ఎక్కువ స్థానాలలో విజయకేతనం ఎగరవేయాలనిఅన్నారు ఈ కార్యక్రమంలో మాజీ జిల్లా అధ్యక్షుడు రామచంద్ర రెడ్డి ,జిల్లా ప్రధాన కార్యదర్శి రవి కుమార్ ఎక్భోటే,బిజెపి రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ బండల వెంకట రాములు,ఉపాధ్యక్షుడు రెడ్డి,అసెంబ్లీ కి పోటీ చేసిన అభ్యర్థులు బలిగేరా శివారెడ్డి,పట్టణ అధ్యక్షురాలు రజక జయశ్రీ , ఓబీసీ మోర్చ అధ్యక్షుడు దేవదాస్, మండల అధ్యక్షులు తిరుపతి రెడ్డి, శ్రీపాద రెడ్డి, శ్రీనివాసులు ,బిజెపి నాయకులు మోహన్ రెడ్డి, సంజీవ్ రెడ్డి లక్ష్మన్ తదితరులు ఉన్నారు..

## అస్తవ్యస్థంగా మారిన ఫరూక్ నగర్ తహసీల్దార్ కార్యాలయం

**వివిధ పనుల నిమిత్తం కార్యాలయం చుట్టూ తిరిగి విసిగిపోతున్న ప్రజలు**

**రేషన్ కార్డులలో పేర్ల తొలగింపు విషయంలో వారల తరబడి తిరుగుతున్న పట్టించుకోనీ కార్యాలయ సిబ్బంది**

**అప్లికేషన్ ఇవ్వడం సిబ్బంది వారిని వారంలో అవుతుందంటూ తిప్పడం పని కాకపోవడంతో అడగడానికి మళ్ళీ వచ్చిన ప్రజలను దరఖాస్తు మళ్ళీ ఇవ్వాలంటూ ఆర్డర్లు వేస్తున్న సిబ్బంది**

**రంగారెడ్డి జిల్లా షాద్ నగర్5(స్కైన్యూస్)** డివిజన్ ఫరూక్ నగర్ తహసీల్దార్ కార్యాలయం లో పరిపాలన వ్యవస్థ అస్తవ్యస్థంగా మారింది వివిధ పనుల నిమిత్తం కార్యాలయం చుట్టూ తిరుగుతున్న ప్రజలు అధికారుల తీరుపై విసిగి పోతున్నారు రేషన్ కార్డు లలో పేర్ల తొలగింపు విషయంలో వారల తరబడి తిరుగుతున్న అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు వారాలు పాటు తిప్పుతూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు అంటూ ప్రజలు అధికారుల పని తీరు పై అసహనం వ్యక్తం చేస్తున్నారు వివిధ పనుల నిమిత్తం కార్యాలయానికి వస్తున్న ప్రజలు ఇక్కడ పలుకుబడి ఉన్న వారికి వాళ్ళకి కావలసిన వారికి పనులు తొందరగా చేస్తారు సామాన్యుల ను పట్టించుకోరని ఆరోపిస్తున్నారు రేషన్ కార్డు




లలో పేర్ల తొలగింపులో జాప్యం ఏమిటని సిబ్బందిని అడగగా ఇక్కడ ఉండాల్సిన తహసీల్దార్ లేకపోవడం వల్ల ఇంచార్జి తహసీల్దార్ గా కొత్తూరు మండల తహసీల్దార్ కు బాధ్యతలు ఇవ్వడం వల్ల డిజిటల్ కీ లేకపోవడం వల్ల ఆలస్యం అవుతుందని సమాధానం చెబుతున్నారు పసిపిల్లలతో దూరప్రాంతాల నుండి వస్తున్న మహిళలు తిరగలేక అధికారుల పని తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు ఇతర మండలాల్లో పని తొందరగా అవుతుందని ఇక్కడ మాత్రమే ఇబ్బంది పెడుతున్నట్లు కార్యాలయానికి వచ్చిన ప్రజలు తిట్ల వర్షం కురిపిస్తున్నారు చూడాలి మరి వీరి పద్ధతి ఇలానే ఉంటుందా ప్రజల సమస్యల మీద దృష్టి సారిస్తారా లేక ఇది మాకు మామూలే అని వదిలేస్తారా వేచి చూడాల్సిందే.....

## గడపగడపకి బిజెపి యొక్క పథకాలు తెలుపుతున్న నాయకులు



**దేవరకద్ర, అమరచింత ఆగస్టు 5 (స్కై న్యూస్):** అమరచింత మున్సిపాలిటీ నందు గాంధీనగర్ లో 5వ వార్డ్ బూత్ అధ్యక్షులు కుమ్మరి శ్రీనివాసులు బిజెపి మాజీ వార్డు మెంబెర్ సభ్యులు యమ్ జగనాదం, బిజెపి మండల ప్రధాన కార్యదర్శి యమ్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో గడపగడపకు బిజెపి సంక్షేమ పథకాలు తెలియజేస్తూ బీడీ కార్మికులను , కుండల తయారీ కార్మికులను , టైలరింగ్ కార్మికులను , ఇస్త్రీ కార్మికులను , ప్రతి ఇంటిలో ఉండే గృహిణిలను, చిరు వ్యాపారస్తులను హమాలీ కార్మికులను, వ్యవసాయ కార్మికులను భవన నిర్మాణ కార్మికులను కలుస్తూ కార్యచరణ నిర్వహించడం జరిగింది. ప్రతి ఒక్క కార్మికులు కూడా నరేంద్ర మోడీ యొక్క పథకాలు మాకు కూడా అందుతున్నాయని వారితో మేము కూడా వివరణ తీసుకోవడం కూడా జరిగింది. భవిష్యత్తులో భారతీయ జనతా పార్టీకి మేమందరం కూడా మద్దతిస్తామని కూడా ప్రజల నుండి వచ్చిన అభిప్రాయం మాకు సంతోషాన్ని కలిగించింది.

## రామాపురం గ్రామంలో వానదేవుని కోసం పూజలు

**జోగులాంబ గద్వాల, ఆగస్టు 4 (స్కై న్యూస్):** జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలం రామాపురం గ్రామంలో నిన్నటి రోజు గ్రామస్తులు వరుణ దేవుడి కోసం పూజలు నిర్వహించారు. ప్రసిద్ధ ఆంజనేయ స్వామి క్షేత్రమైన బీచుపల్లి సమీపంలో గల కృష్ణానది నుంచి కాడెద్దులతో నదీ జలాలు తీసుకొని వచ్చారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మేళ తాళాలతో భాజా భజంత్రీలతో వారికి స్వాగతం పలికారు.అనంతరం ఆ నదీ జలాలను ఉభయ రామ లింగేశ్వర ఆలయంలో గల శివలింగాలకు సమృద్ధిగా వర్షాలు కురవాలని పాడిపంటలతో వెలసిల్లాలని ప్రార్థిస్తూ అభిషేకం చేశారు ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రాంతీయ ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ మొబైల్ ల్యాబ్ వ్యాన్ ను జెండా ఊపి ప్రారంభించిన జిల్లా ఎస్పీ టి శ్రీనివాస్ రావు ఐపీఎస్



**జోగులాంబ గద్వాల, ఆగస్టు 5 (స్కై న్యూస్):** నేర పరిశోధనలో కీలకంగా ఉపయోగపడే ఫోరెన్సిక్ సైన్స్ లాబొరేటరీ మొబైల్ ల్యాబ్ వ్యాన్ ను ఎస్పీ టి శ్రీనివాసరావు ఈ రోజు జెండా ఊపి ప్రారంభించారు.

**ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ..**

నేరం జరిగిన ప్రదేశానికి వెళ్లి తక్షణమే పరీక్షలు నిర్వహించేందుకు వీలుగా ఈ వాహనం పూర్తి సదుపాయాలతో కూడిన మొబైల్ ల్యాబ్ గా పనిచేస్తుందని అన్నారు. నేరం జరిగిన ప్రదేశానికి వెళ్లి, ఆయా ప్రదేశంలో లభించిన అన్ని రకాల సాక్ష్యాలను (ఫింగర్‌ప్రింట్స్, రక్తపు నమూనాలు, ఇతర ఆధారాలు) సేకరించి, ప్రాథమిక విశ్లేషణలు చేసే ఈ వాహనం నేర పరిశోధనలో చాలా ముఖ్యమైనదని అన్నారు. ఈ కార్యక్రమంలో సాయుధ దళ డిఎస్పీ నరేందర్ రావు,ఎస్.బి ఇన్స్పెక్టర్ నాగేశ్వర్ రెడ్డి,ఆర్.ఐ. వెంకటేష్, క్లూస్ టీం ఇంచార్జి ఎస్సై లు సుకుర్, స్వాతి,మరియు క్లూస్ టీం సిబ్బంది పరమేష్, దాకూద్ పాల్గొన్నారు.

## ఉద్యమ కారులరులకు అందరికీ ఆహ్వానం ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి

**షాద్నగర్ 5(స్కై న్యూస్):** ఈరోజు అనగా బుధవారం తేదీ 6. 8.2025 ఉదయం 8.30 గంటలకు ప్రొఫెసర్ జయశంకర్ సార్ జయంతి సందర్భంగా నివాళులు అర్పించడం జరుగుతుంది కావునా ఉద్యమకారులు, డివిజన్ కమిటీ, మండల, పట్టణ కమిటీ సభ్యులందరూ సకాలంలో షాద్ నగర్ %వీూణూ% ఆఫీస్ ఆవరణలో జయశంకర్ సార్ విగ్రహం దగ్గరికి రాగలరని మనవి. మీ పంది వెంకట్ రాంరెడ్డి జడ్పీటీసీ ఫరూఖ్ నగర్ రంగారెడ్డి జిల్లా చైర్మన్ తెలంగాణ ఉద్యమ కారుల సంక్షేమ సంఘం, డివిజన్ కమిటీ, షాద్ నగర్

## షాద్ నగర్ లో ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

**పదకొండు కేసుల్లో నిందితుడు**

**నాలుగు వాహనాలు స్వాధీనం**

**మీడియాకు వివరాలు వెల్లడించిన షాద్ నగర్ ఏసిపి లక్ష్మీనారాయణ**

**షాద్నగర్ 5(స్కైన్యూస్):** ఇండ్లు, దుకాణాల ముందు తాళాలు వేసి ఉన్న ద్విచక్ర వాహనాలను టార్గెట్ గా చేసుకుని ఎవరు చూడని సమయంలో వాటిని దొంగిలిస్తున్న దొంగను షాద్ నగర్ పోలీసులు అరెస్ట్ చేసి రిమండ్ కు తరలించారు. షాద్ నగర్ ఎసిపి లక్ష్మీ నారాయణ వెల్లడించిన వివరాల ప్రకారం కొందుర్గు మండలం చెరుకుపల్లి గ్రామానికి చెందిన నర్సింలు జూన్ 19న తన స్పెండర్ బైక్ ను షాద్ నగర్ పట్టణ బస్టాండ్ కొరియర్ ఆఫీస్ పక్కన పార్క్ చేశాడు. తిరిగి జూన్ 21న వచ్చి చూడగా తన ద్విచక్ర వాహనం కనిపించకపోవడంతో అదే రోజు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశాడు. అతని ఫిర్యాదు ఆధారంగా కేసు నమోదు చేసి విచారణ ప్రారంభించిన పోలీసులు ఆగస్టు 4న సాంకేతిక ఆధారాల సహాయంతో కొత్తూరు మండలం ఇనుములనర్వ గ్రామానికి చెందిన నిందితుడు కొర్ర వినోద్ ను అదుపులోనికి తీసుకున్నారు. నిందితుడు ఇండ్లు, దుకాణాల ముందు తాళాలు వేసి ఉన్న వాహనాలను ఎవరు చూడని సమయంలో హ్యాండిల్ విరగగొట్టి దొంగిలిస్తున్నట్లు అంగీకరించినట్లు తెలిపారు. ఈ తరహాలోనే షాద్నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో




నాలుగు ద్విచక్ర వాహనాలు దొంగిలించినట్లు పోలీసులకు తెలిపారు. గతంలో కూడా నిందితులపై ద్విచక్ర వాహనాల దొంగతనం కేసులు నమోదై ఉన్నాయని కొత్తూరు పోలీస్ స్టేషన్ పరిధిలో 4, ఆర్ జి ఐ పోలీస్ స్టేషన్ పరిధిలో 1, కొత్తూరు పిఎస్ పరిధిలో 4, అఫ్జల్గంజ్ పిఎస్ పరిధిలో 2 ఇలా మొత్తం 11 కేసుల్లో దొంగతనం చేసి జైలుకు వెళ్లి వచ్చాడని తెలిపారు. నిందితుడి వద్ద నుండి నాలుగు వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకునీ అతన్ని రిమాండ్ కు తరలించినట్లు తెలిపారు. శంషాబాద్ డిసిపి రాజేష్, అడిషనల్ డిసిపి పూర్ణచందర్, షాద్నగర్ ఏసిపి లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో పట్టణ సీఐ విజయ్ కుమార్, డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో డిటెక్టివ్ ఎస్ఐ శివారెడ్డి క్రైమ్ టీం రవీందర్ సంతోష్ కరుణాకర్ జాకీర్ రాజు లు కేసు చేదంలో చాకచక్యంగా వ్యవహరించినట్లు ఉన్నతాధికారుల ద్వారా వారికి తగిన రివార్డును అందించడం జరుగుతుందని తెలిపారు..

## ఉపవాసాలు అమృత ఆహారం దివ్య ఔషధాలు







**ఉప్పు మానవ జీవితానికి ప్రమాదం.**

**ప్రముఖ యోగ గురువు శివానంద గురూజీ.**

**నాగర్ కర్నూల్ ఆగస్టు 5 (స్కై న్యూస్)** ప్రతి ఒక్కరు నేడు అనేక రుగ్మతలతో సతమతమవుతున్న పరిస్థితులలో ఉపవాసాలు ఉండటం అమృత ఆహారం సేవించడం ద్వారా మానవుడికి దివ్య ఔషధంలా అవి పని చేస్తాయని ప్రముఖ యోగా గురువు శివానంద గురూజీ తెలిపారు. క్రమం తప్పకుండా యోగాసనాలు చేస్తూ మానవ జీవితానికి ప్రతిరోజు కొంత సమయం కేటాయిస్తే అనేక దీర్ఘకాలిక వ్యాధులను దూరం చేసుకోవడం జరుగుతుందని ఆయన తెలిపారు జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న యోగ శిక్షణా కార్యక్రమాలను దిగ్విజయంగా కొనసాగిస్తూ అనేకమందికి యోగాసనాలు ప్రాణాయమాం సూర్య నమస్కారం తో పాటు బలబద్ధకాలను తగ్గించి సంపూర్ణ ఆరోగ్యంగా జీవించే విధంగా ఉండేందుకు చేపట్టవలసిన ఆసనాలను నేర్పించడం జరుగుతుంది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపవాసాలు చేయడానికి లంకనం అంటారని ఐదు రకాలుగా ఉపవాసం ఉండవచ్చని దీని ద్వారా మెదడు చురుకుగా పని చేయడంతో పాటు దీర్ఘకాలిక రోగాలను నయం చేసుకోవచ్చని వివరించారు. నేడు మానవ జీవితంలో భాగమైన ఉప్పు మనిషి జీవితాన్ని ప్రమాదంలోకి నెట్టే పరిస్థితుల్లో ఉందని ఎంత వీలు అయితే అంత ఉప్పుకు దూరంగా ఉండాలని ఆయన వివరించారు తేనే నీరు నిమ్మరసం సేవిస్తూ ఉపవాసం చేయడం ద్వారా అనేక రుగ్మతలను తొలగించుకోవచ్చని పండ్ల రసాలు మాత్రమే తీసుకొని ఉండే ఉపవాసం వల్ల మానవ శరీరంలో అనేక మార్పులు సంభవించడంతోపాటు ఆలోచన శక్తి పెరుగుతుందని వీటిని ప్రతి నెలలో మూడు నుండి ఏడు రోజులపాటు చేయవచ్చని తెలిపారు పండ్లను తీసుకొని అమృత ఆహారంతో చేపట్టే ఉపవాసం వల్ల శరీరంలో ఉండే అనేక వ్యాధులను దూరం చేసుకోవచ్చని బోధించారు. తన పరిధిలో 12 సంవత్సరాలలో అనేకమందికి శిక్షణలు ఇవ్వడం ద్వారా రోగాలను నయం చేయడం జరిగిందని తెలిపారు. జిల్లా కేంద్రంలో గత నెల రోజులుగా మూడు విడతలుగా శిక్షణలు పూర్తి చేసుకోవడం జరిగిందని ఈనెల 12 నుండి 4వ విడత శిక్షణను ప్రారంభించనున్నట్లు తెలిపారు. ధ్యానం చేయడం ద్వారా యోగ ఆసనాలు వేయడం ద్వారా మానసిక ఒత్తిడిని జయించి సంపూర్ణ ఆరోగ్యంగా జీవిస్తూ జీవనశైలిలో మార్పు రావడం జరుగుతుందని ఆయన వివరించారు

# హైదరాబాద్ వాసుల కష్టాలు తీరబోతున్నాయి

**హైదరాబాద్, ఆగస్టు 5:**విశ్వనగరం హైదరాబాద్‌లో అతిపెద్ద సమస్య ట్రాఫిక్.. డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో నగర వాసులు నరకం అనుభవిస్తున్నారు. చిన్నపాటి వర్షం పడినా కిలోమీటర్లకొద్దీ ట్రాఫిక్ నిలిచిపోతోంది. గంటలకొద్దీ రోడ్లపైనే ఉండాల్సిన పరిస్థితి. ఈ సమస్య పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వాలు ఫ్లై ఓవర్లు నిర్మిస్తున్నాయి. మెట్రో విస్తరణకు కూడా ప్రణాళిక సిద్ధం చేస్తోంది. కానీ సమస్యకు శాశ్వత పరిష్కారం కావడం లేదు. ఈ క్రమంలో తాజాగా కేబీఆర్ పార్కు చుట్టూ ఫ్లై ఓవర్లు, అండర్‌పాస్‌లు నిర్మాణం చేపట్టాలని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) సన్నాహాలు చేస్తోంది. అయితే, ఈ ప్రాజెక్ట్‌లు పార్కు ఈకో సెన్సిటివ్ జోన్ (ఈఎస్‌జెడ్)పై ప్రభావం చూపే అవకాశం, చెట్ల తొలగింపు అంశంపై జీవ వైవిధ్యాన్ని కాపాడేందుకు సరికొత్త డిజైన్లతో పనులు చేపట్టేందుకు జీహెచ్ఎంసీ సిద్ధమవుతోంది.కేబీఆర్ పార్కు చుట్టూ ఆరు కూడళ్ల వద్ద ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు పైవంతెనలు, అండర్ పాస్‌ల నిర్మాణం జరగనుంది. ఈ ప్రాజెక్ట్ కోసం 307 ఆస్తుల సేకరణ అవసరమని, ఈ ప్రక్రియను వేగవంతం చేస్తున్నట్లు జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్ తెలిపారు. ఈ అభివృద్ధి పనులు నగరంలో రవాణా సౌలభ్యాన్ని మెరుగుపరచడమే లక్ష్యంగా ఉన్నప్పటికీ,



పర్యావరణ ప్రభావంపై ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. గత ప్రభుత్వం రూపొందించిన వ్యూహాత్మక రహదారుల అభివృద్ధి కార్యక్రమం(ఎస్ఆర్‌డీపీ) డిజైన్లు ఈఎస్‌జెడ్‌ను దెబ్బతీసే అవకాశం ఉండటంతో కాంగ్రెస్ ప్రభుత్వం కొత్త డిజైన్లను రూపొందించింది.కొత్త డిజైన్ల ప్రకారం, పైవంతెనలు, అండర్‌పాస్‌ల నిర్మాణం కోసం 1,942 చెట్లను తొలగించాల్సి ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ఈ చెట్లలో సగం వృక్షాలను వేరే ప్రాంతాల్లో తిరిగి నాటే ప్రణాళిక ఉన్నట్లు ముఖ్య ఇంజినీరు భాస్కర్‌రెడ్డి తెలిపారు. అయినప్పటికీ, ఈ పెద్ద ఎత్తున చెట్ల తొలగింపు కేబీఆర్ పార్కు యొక్క జీవవైవిధ్యంపై, స్థానిక వాతావరణంపై గణనీయమైన ప్రభావం చూపవచ్చనే ఆందోళనలు ఉన్నాయి. పార్కు చుట్టూ ఉన్న ఈఎస్‌జెడ్ హైదరాబాద్‌లో పర్యావరణ సమతులతకు కీలకమైన ప్రాంతంగా ఉంది. చెట్ల తొలగింపు, నిర్మాణ పనుల వల్ల గాలి కాలుష్యం, ఉష్ణోగ్రత పెరుగుదల వంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంది.కంటోన్‌మెంట్ నియోజకవర్గంలో ఏఓసీ (ఆర్మీ ఆర్డినెన్స్ కార్ప్స్) రోడ్లు తరచూ రక్షణ శాఖ మూసివేస్తోంది. ఈ సమస్యను పరిష్కరించేందుకు 6 కి.మీ. పొడవైన ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి టెండర్లు పిలిచారు. ఈ కారిడార్ పూర్తయితే, మల్కాజ్‌గిరి%–%సికింద్రాబాద్ మధ్య రాకపోకలు ఏఓసీ రోడ్లపై ఆధారపడకుండా సాగనున్నాయి. మొత్తంగా ఈ ప్రాజెక్ట్‌లు ట్రాఫిక్ సమస్యను చాలా వరకు పరిష్కరిస్తాయని అంచనా. అయితే నిర్మాణం పూర్తయ్యే వరకూ సమస్య మరింత ఇబ్బందిగా మారుతుంది.

# లొంకకేసారం మహిళామణుల ఆధ్వర్యంలో ఆత్మీయ సన్మానం



**కమాన్ పూర్:**గత 10 సంవత్సరాలుగా రహదారులు బాగాలేక ఎన్నో కష్టాలు పడుతున్న మాకు కల్వచర్ల గ్రామంలోని ప్రధాన రహదారినీ ఇటీవల గ్రామానికి విచ్చేసిన రాష్ట్ర మంత్రివర్యులు దుదిళ్ళ శ్రీధర్ బాబు గతంలో ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇచ్చిన మాట ప్రకారం గ్రామ ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యను పరిష్కరించినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ లొంకకేసారం గ్రామానికి చెందిన రోడ్డ వరలక్ష్మీ ఆధ్వర్యంలో గ్రామ మహిళామణుల కలిసి దాదాపు జడ్పీటీసీ గంటవెంకటరమణ రెడ్డికి ఆత్మీయ సన్మానం చేయడం జరిగింది. అనంతరం వరలక్ష్మీ మాట్లాడుతూ గ్రామంలోని ప్రధాన సమస్యను పరిష్కరించి, రోడ్డు నిర్మాణ పనులను దాదాపు 80రోజులు ప్రతి క్షణం పర్యవేక్షిస్తూ రోడ్ నిర్మాణం పూర్తిచేయడంలో కీలక పాత్ర పోషించిన మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణ రెడ్డి కి, రోడ్డు నిర్మాణాన్ని త్వరగా పూర్తిచేసిన పిడిఆర్ కన్స్ట్రక్షన్స్ వారికి గ్రామ ప్రజల పక్షాన కృతజ్ఞతలు తెలుపుతూ గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసి మోడల్ విలేజ్ గా తయారు చేయాలని కోరారు. అనంతరం మాజీ జెడ్పిటిసి గంట వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ రోడ్డు గ్రామ ప్రజలందరి సహకారంతోనే పూర్తయిందని , లొంక కేసారం కి గ్రామం రోడ్డు కూడా త్వరలోనే ప్రారంభం అవుతుందని తెలిపారు అలాగే భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు మంత్రి శ్రీధర్ బాబు ఆధ్వర్యంలో చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐఎన్టీయూసీ సోషల్ మీడియా ఇంచార్జ్ మేకల మారుతి యాదవ్,లొంకకేసారం కాంగ్రెస్ గ్రామ అధ్యక్షులు వీరగోని శ్రీనివాస్ గౌడ్,ఉమ్మడి కల్వచర్ల మాజీ అధ్యక్షులు రవీందర్ గౌడ్, రోడ్డ సంపత్ సీనియర్ నాయకులు బూడిద రాజేందర్, ఆసం రాజు, కన్నూరి శ్రీనివాస్, కన్నూరి సంపత్, యాదగిరి కుమార్,వేముల సంపత్ తదితరులు పాల్గొన్నారు.

# రోగులకు మెరుగైన వైద్యం అందాలి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**



పెద్దపల్లి:ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర తోపాటు, పెద్దపల్లి పట్టణం రంగంపల్లి లోని బస్తీ దావాఖానాను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రికి వస్తున్న ఔట్ పేషెంట్ వివరాలు, ల్యాబ్ లో జరుగుతున్న వ్యాధి నిర్ధారణ పరీక్షలు, ఫార్మసి విభాగంలో అందుబాటులో ఉన్న మందుల వివరాలు, డెంగ్యూ కేసులు, పి.హెచ్.సి పరిధిలో జరుగుతున్న ప్రసవాల సంఖ్య మొదలగు అంశాలను కలెక్టర్ తెలుసుకొని అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ బస్తీ దావాఖానాలో షుగర్ పరీక్షించేందుకు గ్లుకో మీటర్ మంజూరు చేస్తామని అన్నారు. ఎన్.సి.డి రోగులకు ప్రతి నెలా మందులు సరఫరా చేయాలని అన్నారు. గర్రెపల్లి పి.హెచ్.సి ఆసుపత్రిలో ఉన్న సి.బి.పి మెషిన్ మరమ్మత్తు మూడు రోజుల్లో చేయాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాల ల్లో వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని అన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, డెంగ్యూ ,మలేరియా, చికెన్ గున్యా వంటి సీజనల్ వ్యాధుల లక్షణాలు ఉన్న ప్రతి ఒక్కరికి వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రులలో ప్రసవాల సంఖ్య పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆయన వెంట డాక్టర్లు రామకృష్ణ, స్వప్న, సిందూజ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎల్ బీ నగర్ దగ్గర డబుల్ డెక్కర్ రోడ్డు

**హైదరాబాద్, ఆగస్టు 5:**హైదరాబాద్ –విజయవాడ జాతీయ రహదారిపై ట్రాఫిక్ రద్దీని తగ్గించేందుకు ఎలివేటెడ్ కారిడార్‌ను తెలంగాణ ప్రభుత్వం చేపడుతోంది. ఎల్‌బీనగర్ నుంచి హయత్‌నగర్ వరకూ 5.5 కిలోమీటర్ల మేర 8వరుసలతో డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్ నిర్మించాలని నిర్ణయించారు. ఇందుకు రూ.650 కోట్ల వరకు ఖర్చవుతుందని అంచనా...! ఈ రోడ్డు నిర్మాణం చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి చేయనున్నామని రోడ్లు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి తెలిపారు. నాగ్‌పూర్‌లో నిర్మించిన డబుల్ డెక్కర్ కారిడార్ నమూనాలోనే ఇక్కడ కూడా నిర్మించాలని భావిస్తున్నారు. ఎల్‌బీనగర్ వద్ద ట్రాఫిక్ పరిస్థితిని ఆయన స్వయంగా క్షేత్రస్థాయిలో సమీక్షించారు. విజయవాడ– హైదరాబాద్ రోడ్డు మార్గంలో ఏ స్థాయిలో రద్దీ ఉంటుందో అందరికీ అనుభవమే. ఎల్బీనగర్ దగ్గర అవుటర్ వరకూ రోడ్డు విపరీతంగా రద్దీ ఉంటుంది. ఈ మధ్య కాలంలో ఆ రోడ్లను వెడల్పు చేసినప్పటికీ రద్దీ ఏమాత్రం తగ్గడం లేదు. జాతీయ రహదారిపై నుంచి వచ్చే వాహనాలకు లోకల్ ట్రాఫిక్ కలవడంతో చాలా ఎక్కువ రద్దీగా ఉంటోంది. అందుకే వాహనాలు నేరుగా ఎల్బీనగర్‌కు చేరుకునేలా..ఇటు నుంచి కకూడ అంతరాయం లేకుండా వెళ్లేలా పూర్తిగా ఎలివేటెడ్ కారిడార్‌ను నిర్మించాలని అనుకుంటున్నారు విస్తరణలో భాగంగా ప్రస్తుతం ఉన్న మెట్రో లైన్‌ను



హయత్‌నగర్ వరకూ విస్తరించాలని ఇంతకు ముందే నిర్ణయించారు. ఇప్పుడు చేపట్టబోయే నిర్మాణం దానిని కూడా దృష్టిలో ఉంచుకుని చేయనున్నారు. ఇందులో కింద సర్వీసు రోడ్డు ఉంటుంది. మధ్యలో 8వరుసల ఫ్లైఓవర్.. దానిపైన మెట్రో మార్గం ఉంటుంది. ఇలా డబల్ డెక్కర్ రోడ్డును 5.5 కిలోమీటర్ల వరకూ నిర్మిస్తారు. ప్రస్తుతం విజయవాడ–హైదరాబాద్ జాతీయ రహదారి విస్తరణ జరుగుతోంది. నగరానికి వెలుపల కొన్ని చోట్ల రోడ్ల విస్తరణ చేపట్టారు. చౌటప్పల్ దగ్గర ఉన్న మల్కాపూర్ నుంచి ఎల్బీనగర్ వరకూ ఉన్న రోడ్డు ఇరుకుగా ఉండటంతో దానిని విస్తరించడానికి 541కోట్ల వ్యయంతో పనులు చేపట్టారు. %ూ==% లోపల పెద్ద అంబర్‌పేట్ వరకూ రోడ్డు విస్తరణ పూర్తైంది. ఆ తర్వాత కూడా రోడ్డు వెడల్పు బాగానే ఉన్నప్పటికీ నగరంలోని ట్రాఫిక్ హైవేపైకి వచ్చి ఇబ్బంది అవుతోంది. సిటీ మధ్యలో ఉండటంతో రోడ్డును డివైడర్‌తో క్లోజ్ చేయడం ఇబ్బంది అవుతోంది. చాలా చోట్ల పాసింగ్ కోసం రోడ్డును ఓపెన్ చేయాల్సి వస్తోంది. అందుకే పెద్ద అంబర్‌పేట్ నుంచి ఎల్బీనగర్ వరకూ ఎలాంటి అంతరాయం లేకుండా ఎలివేటెడ్ మార్గం వేయాలని అనుకుంటున్నారు. మెట్రో కోసం ఎలాగూ ఎలివేటెడ్ మార్గాన్ని వేయాలి కాబట్టి రెండింటికీ కలిసొచ్చేలా దీనిని ప్రతిపాదించారు. ఈ మార్గాన్ని ఏడాది లోగా పూర్తి చేయాలన్న లక్ష్యంతో పనిచేస్తామని మంత్రి కోమటిరెడ్డి తెలిపారు. దీనిపై 6వతేదీన కేంద్రమంత్రి నితిన్‌గడ్కరీని కలుస్తున్నామని చెప్పారు.విజయవాడ హైదరాబాద్ మధ్య పెరుగుతున్న రద్దీ దృష్ట్యా మరో గ్రీన్‌ఫీల్డ్ హైవేకు కేంద్రం ఓకే చెప్పింది. ఏపీ కొత్తరాజధాని అమరావతి నుంచి.. ఫ్యూచర్ సిటీ దగ్గర %ూ==%కు కలిసేలా దీనిని తెలంగాణ ప్రభుత్వం అడుగుతోంది. ఏపీ సీఎం చంద్రబాబు కూడా హైదరాబాద్–విజయవాడ గ్రీన్‌ఫీల్డ్ హైవే కావాలని రెండు రోజుల కిందట విజయవాడ వచ్చిన గడ్కరీని కోరారు. ఆయన వెంటనే ఆమోదం తెలిపారు. యాక్సెస్ కంట్రోల్డ్.. గ్రీన్‌ఫీల్డ్ హైవేతో రెండు గంటల్లోనే హైదరాబాద్ నుంచి విజయవాడ వెళ్లిపోవచ్చని కోమటిరెడ్డి అంటున్నారు.

# విద్యలో ఏపీని మోడల్ స్టేట్ గా తీర్చిదిద్దడంలో టీచర్ల పాత్ర కీలకం

**మంత్రి నారా లోకేష్ ను కలిసి నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు**

**ఎంఈవో పోస్టుల్లో జిల్లా పరిషత్ ఉపాధ్యాయులకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి**

**ఉపాధ్యాయుల ప్రతి సమస్యను పరిష్కరిస్తామని మంత్రి హామీ**



**ఉండవల్లి:**ప్రభుత్వ విద్యలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ ను మోడల్ స్టేట్ గా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయుల పాత్ర ముఖ్యమైనదని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్ పేర్కొన్నారు. ఉండవల్లి నివాసంలో మాజీ శాసనమండలి సభ్యులు ఏఎస్ రామకృష్ణ ఆధ్వర్యంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రి నారా లోకేష్ ను కలిశారు. ఎంఈవో పోస్టుల్లో జిల్లా పరిషత్ ఉపాధ్యాయులకు కూడా అవకాశం కల్పించాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ విధానం అమలుచేయాలని కోరారు. ఈ మేరకు మంత్రి నారా లోకేష్ కు వినతిపత్రం అందజేశారు. రాజకీయ జోక్యం లేకుండా ఇటీవల ఉపాధ్యాయుల బదిలీలు పూర్తి పారదర్శకంగా జరిగాయని, అదేవిధంగా రాష్ట్రంలో నూతనంగా మోడల్ ప్రైమరీ స్కూళ్లను ఏర్పాటుచేయడంపై ఉపాధ్యాయులు సంతోషంగా ఉన్నారని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రి నారా లోకేష్ దృష్టికి తీసుకువచ్చారు.ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యకు పరిష్కారం చూపుతాం ఈ సందర్భంగా మంత్రి నారా లోకేష్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న ప్రతి సమస్యకు చర్చల ద్వారా పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. ఎవరూ ఆందోళన పడాల్సిన పనిలేదన్నారు. ఏ సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని, ఇకపై ఆయా జిల్లాల్లో జరిగే క్లస్టర్ సమావేశాలకు తప్పనిసరిగా హాజరవుతానని చెప్పారు. విద్యార్థుల్లో అభ్యసన సామర్థ్యాలతో పాటు నైతిక విలువలు పెంపొందించేందుకు ఉపాధ్యాయులు కృషిచేయాలన్నారు. ఉపాధ్యాయులు సమాజానికి మార్గదర్శకులుగా ఉండాలని, అంకితభావంతో పనిచేసి ఉత్తమ ఫలితాలు సాధించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కోండూరు శ్రీనివాసరాజు, బొనిగెల హైమారావు, రాష్ట్ర క్రమశిక్షణా సంఘం ఛైర్మన్ చెరుకూరి సుభాష్ చంద్రబోస్, రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి జె.శ్రీనివాసరావు, రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ఎమ్.రెడ్డి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# సినీ రంగంలో శ్రమ దోపిడీ జరుగుతోంది: అనిల్ వల్లభనేని..



**హైదరాబాద్:** టాలీవుడ్ సినీ పరిశ్రమలో నెలకొన్న కార్మిక సమస్యలపై ఫిలిం ఎంప్లాయిస్ ఫెడరేషన్ అధ్యక్షుడు అనిల్ వల్లభనేని ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ కీలక వ్యాఖ్యలు చేశారు. ఫెడరేషన్‌తో సంప్రదింపులు చేస్తామని చెప్పిన ఫిలిం ఛాంబర్, ఇప్పుడు ఒక్కసారిగా ఫెడరేషన్ వద్దు అనే ప్రకటన చేయడం బాధాకరమని వ్యాఖ్యానించారు.

**అవగాహన పెంచాలి**

తెలుగు ఇండస్ట్రీలో అంతర్జాతీయ స్థాయి సినిమాలు వస్తున్నాయంటే అది మన కార్మికుల నైపుణ్యాల ఫలితమని.. వాళ్లలో స్కిల్ లేదని అంటే, క్యాంపులు ఏర్పాటు చేసి ట్రైనింగ్ ఇవ్వాలని అన్నారు. కొత్త కెమెరాలు, టెక్నాలజీ వస్తుంటే వాటి గురించి అవగాహన పెంచాలే కానీ, ఇప్పుడు కార్మికులను పక్కన పెట్టి కొత్తగా మరెవరితోనో పని చేస్తామని చెప్పడం ఎంత వరకు కరెక్ట్ అని ప్రశ్నించారు.

**రోజుకు 15 గంటలు**

వేతనాలు అడిగితే కొత్తవారిని తీసుకువస్తామని నిర్మాతలు చెబుతున్నారని.. సినిమాపై ఇంట్రెస్ట్‌తో ఎవరైనా వస్తే వారిని శ్రమ దోపిడి చేస్తారని సంచలన వ్యాఖ్యలు చేశారు. 'కార్మికులు రోజుకు 15 గంటలు కష్టపడతారు.. వేతన పెంపును తాము ముందు నుంచి అడుగుతూనే ఉన్నాం.. అప్పటికప్పుడు బంద్ అంటూ తాము ఎప్పుడూ ప్రకటించలేదని' అనిల్ వివరించారు.

**కూర్చుని చర్చిస్తే సరిపోతుంది**

కొన్ని నిర్మాణ సంస్థలు తమ అభ్యర్థనను అంగీకరించి, అడిగిన వేతనాలను ఇచ్చి పని చేయిస్తున్నారని, కానీ, బయటకు చెప్పేంతగా తమ వేతనాలు ఎక్కువ కాదని తెలిపారు. వేతన పెంపుపై ఫిలిం ఛాంబర్‌కు, నిర్మాతలకు అభ్యంతరాలు ఉంటే కూర్చుని చర్చిస్తే సరిపోతుందని సూచించారు. లేని పక్షంలో తమ యాక్షన్ ప్లాన్ ఏంటనేది ప్రకటిస్తామని పేర్కొన్నారు.కాగా, తెలుగు సినీ పరిశ్రమలో ప్రస్తుతం కార్మికుల వేతనాల అంశం చర్చనీయాంశంగా మారింది. కార్మికులు సమాన హక్కులు కోరుతున్నారని, పరిశ్రమలో నైపుణ్యం ఉన్నవారిని పక్కన పెట్టడం సరికాదని ఫెడరేషన్ వాదిస్తోంది.

# కేసీఆర్ ఇచ్చిన టాస్క్‌ను పూర్తి చేశా..

**గువ్వాల బాలరాజు షాకింగ్ కామెంట్స్**



**హైదరాబాద్, ఆగస్టు :** బీఆర్ఎస్ పార్టీపై అచ్చంపేట మాజీ ఎమ్మెల్యే గువ్వల బాలరాజు షాకింగ్ కామెంట్స్ చేశారు. భవిష్యత్తులో బీజేపీతో బీఆర్ఎస్ పొత్తు ఉంటుందని ఆరోపించారు. బీఆర్ఎస్‌లో పరిణామాలు చూస్తుంటే పొత్తు పెట్టుకున్నా ఆశ్చర్యం లేదని ఆక్షేపించారు. బీఆర్ఎస్, బీజేపీ వ్యవహారంపై ఎమ్మెల్సీ కవిత లాంటి నేతలు కూడా చెప్పారని గుర్తుచేశారు. బీఆర్ఎస్‌లో తనకు భవిష్యత్తు లేదనే అసంతృప్తితోనే రాజీనామా చేశానని చెప్పుకొచ్చారు. ఇవాళ(మంగళవారం) ఏబీఎన్ ఆంధ్రజ్యోతితో గువ్వల బాలరాజు మాట్లాడారు.ఈ సందర్భంగా బీజేపీ, కాంగ్రెస్ నేతలు తనకు టచ్‌లోకి వచ్చిన మాట వాస్తవమని గువ్వల బాలరాజు స్పష్టం చేశారు. అచ్చంపేట నియోజకవర్గం ప్రజల అభిప్రాయం మేరకు ఏ పార్టీలో చేరాలో నిర్ణయం తీసుకుంటానని తెలిపారు. బీఎల్ సంతోష్‌ను తాను ఎప్పుడూ విమర్శించలేదని చెప్పుకొచ్చారు. అప్పట్లో బీఎల్ సంతోష్ ఎవరో కూడా తనకు తెలియదని అన్నారు గువ్వల బాలరాజు. కేసీఆర్ ఇచ్చిన టాస్క్‌ను మాత్రమే తాను పూర్తి చేశానని క్లారిటీ ఇచ్చారు. బీఆర్ఎస్ నాయకత్వం.. ప్రజల్లో బలం లేని రెడీమేడ్ లీడర్స్‌ను నమ్ముకుంటుందని వ్యాఖ్యానించారు. జనరల్ నియోజకవర్గాల్లో దళితులకు సీట్లు ఇచ్చే దమ్ము బీఆర్ఎస్‌కు ఉందా? అని ప్రశ్నల వర్షం కురిపించారు. ఏడాదిన్నర కాలంగా బీఆర్ఎస్‌లో తనకు ప్రాధాన్యం తగ్గించారని గువ్వల బాలరాజు ఆవేదన వ్యక్తం చేశారు.

**గువ్వల బాలరాజు ఫోన్ కాల్ వైరల్..!**

గువ్వల బాలరాజు బీఆర్ఎస్ కార్యకర్తతో మాట్లాడినట్లుగా ఓ ఫోన్ కాల్ వైరల్ అవుతోంది. ఈ ఫోన్ కాల్‌లో ఏం మాట్లాడరంటే.. 'బీజేపీతో బీఆర్ఎస్ పొత్తు పెట్టుకుంటుందని లేదా విలీనం అవుతుందనే వార్తలు వస్తున్నాయి. అలాంటప్పుడు మన అభ్యర్థిత్వం ఎగిరిపోతుంది. గతంలో బీజేపీతో నేను పోరాటం చేశా. బీఆర్ఎస్ కంటే ముందే నా దారి నేను చూసుకుని.. బీజేపీలో కలవడం మంచిదని నిర్ణయం తీసుకున్నా. పార్టీలో నన్ను కాదని నాగర్ కర్నూల్ ఎంపీ టికెట్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు ఇచ్చారు. ఆ విషయం ఎంతో బాధించింది' అని గువ్వల బాలరాజు మాట్లాడుతున్నట్లుగా ప్రచారం జరుగుతోంది.

# అభివృద్దే ధ్యేయంగా పనిచేస్తున్న మంత్రి శ్రీధర్ బాబు

**-శాత్రాజుపల్లి అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసిన ఘనత శ్రీధర్ బాబుది**

**-ముత్తారం మాజీ జెడ్పిటిసి నాగినేని జగన్మోహన్ రావు**

**-ముత్తారంలో శ్రీధర్ బాబు చిత్రపటానికి పాలాభిషేకం**

**మంథని:**అభివృద్దే ధ్యేయంగా రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పనిచేస్తున్నారని ముత్తారం మాజీ జెడ్పిటిసి నాగినేని జగన్మోహన్ రావు పేర్కొన్నారు. మంగళవారం ముత్తారం మండలంలోని మారుమూల గ్రామమైన శాత్రాజుపల్లిలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేసిన ఐటి శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు మరియు టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శీను బాబు ల చిత్రపటానికి ముత్తారం మాజీ జెడ్పిటిసి నాగినేని జగన్ మోహన్ రావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ముత్తారం మండల కేంద్రంలోని చౌరస్తాలో ఘనంగా పాలాభిషేకం నిర్వహించారు. ముత్తారం మాజీ జెడ్పిటిసి నాగినేని జగన్మోహన్ రావు మాట్లాడుతూ ముత్తారం మండలంలో మారుమూల గ్రామమైన శత్రాజుపల్లిలో 3కోట్ల 40 లక్షల విలువైన విద్యుత్ ఉప కేంద్రంను మరియు 8 కోట్ల వ్యయంతో తారు రోడ్డు కోసం నిధులను మంత్రి దుదిల్ల శ్రీధర్ బాబు కేటాయించారని తెలియజేశారు. ఓట్ల కోసం రాజకీయం చేసే వ్యక్తిత్వం మంత్రి శ్రీధర్ బాబు ది కాదని, కేవలం అభివృద్ధి మాత్రమే చేసి చూపించే వ్యక్తిత్వం అయినదని అన్నారు.గత పాలకులు ఐదు గ్రామాల ప్రజలను విస్మరించి శాత్రాజ్ పల్లి గ్రామ అభివృద్ధి చెందకుండా అడ్డుకున్నారని, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక పలు సమస్యలను శ్రీధర్ బాబు దృష్టికి మేము తీసుకపోవడం ద్వారానే ఈ సబ్ స్టేషన్ మంజూరు చేయించడమే కాకుండా, ఏడు కోట్ల

వార్తాతరంగాలు
మంగళవారం 05 ఆగస్టు 2025

# చెట్టు క్రింద జోరు వానలో పరదాలు కప్పుకొని ఆపరేషన్

**కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్**

**ఆపరేషన్ లో పాల్గొన్న డాక్టర్ జి ఆనంద్ రావు పశు వైద్య సహాయ శస్త్ర చికిత్సకులు డాక్టర్ వి సంతోష్**



**కొత్తగూడెం ఆగస్టు 5( స్కై న్యూస్)** ప్రాథమిక పశు వైద్య కేంద్రం రామవరం కొత్తగూడెం మండలం నందు ఒక పెంపుడు కుక్కకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయడం జరిగింది . చెట్టు కిందనే ఆపరేషన్ చేస్తుండటంతో జోరువాన రావడం జరిగింది. వెంటనే సిబ్బంది అప్రమత్తమై పరదాలు కప్పుకొని ఆపరేషన్ విజయవంతం చేసినారు. ఈ సందర్భంగా డాక్టర్లు మాట్లాడుతూ ఈ యొక్క ఆపరేషన్ ముఖ్యంగా కుక్కల యొక్క సంతతిని నియంత్రించడానికి సరైన పరిష్కారం ఎందుకనగా వాటి యొక్క సంతతి పెరిగినట్లయితే వాటి వల్ల మనుషులకు వచ్చే ఇబ్బందులు (ఆరోగ్య సమస్యలు) చాలా ఎక్కువ అవకాశం ఉంటుంది కాబట్టి ఈ మధ్యకాలంలో ఎక్కువ సంఖ్యలో ప్రజలు వారి పెంపుడు జంతువులకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయించుకోవడానికి ముందుకు వస్తున్నారు అదేవిధంగా వారు పెంచుకుంటున్న కుక్కలకు సంబంధించిన ఆరోగ్య నియమాలను పాటిస్తూ ఇతర మనుషులకు హాని తలపెట్టకుండా ఉండే విధంగా జాగ్రత్తలు తీసుకుంటే మంచిదని భావిస్తున్నాం సోమవారం ప్రాథమిక పశు వైద్య కేంద్రం రామవరం నందు కుక్కలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్ చేయడం జరిగింది ఈ యొక్క ఆపరేషన్ ని డాక్టర్ జి ఆనంద్ రావు పశు వైద్య సహాయ శస్త్ర చికిత్సకులు డాక్టర్ వి సంతోష్ పశు వైద్యాధికారి చంద్రుగొండ మండల్ పశు వైద్య సిబ్బంది యొక్క సహకారంతో పై తెలిపిన ఆపరేషన్ చేయడం జరిగింది.

# బూర్గుల గ్రామాన్ని సందర్శించిన కెవిపిఎస్ జిల్లా బృందం

**షాద్నగర్ 5(స్కైన్యూస్):**దళితుల ఇండ్లకు అడ్డంగా వేసిన కంచను తొలగించిన దళిత సంఘలు సామాజిక సంఘాల నాయకులు రాజకీయ పార్టీ నాయకులు ఈ సందర్భంగా కెవిపిఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు బోడ సామేలు మాట్లాడుతూ హైదరాబాదు పూత పెట్టు దూరంలో ఉన్న బూరుగుల గ్రామానికి చెందిన దళితులు ఇల్లు నిర్మించుకొని సంవత్సరాల పాటు అక్కడే జీవిస్తున్న వారు పోకుండా అదే గ్రామానికి చెందిన బూరుగుల నర్సింగ్ రావు కుటుంబీకులకు అడ్డంగా కంచె వేయడం నోటికి వచ్చినట్లు బూతులు తిడుతూ కులం పేరుతో దూషించిన వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోని దళితులకు అండగా పోలీస్ యంత్రాంగం రెవిన్యూ రంగం ఉండాలని కోరారు అదే గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ ఎంపీటీసీ బూరుగుల సుమన దళితులకు అడ్డంగా వేసిన కంచెను తొలగిస్తున్నానని వచ్చి అందరి ముందు తొలగించడం జరిగింది మానవత దృక్పథంతో బూర్గుల సుమన చెప్పడం చాలా సంతోషకరం అన్నారు దళిత బస్తికి ఆనుకొని ఉన్న ఖాళీ స్థలంలో ఉద్యానవనం పార్కు నిర్మిస్తామని చెప్పారు నాయకులు కేవిపిఎస్ నాయకులు ఉద్యానవనం సంబంధించిన చెట్లను ఫారెస్ట్ డిఆర్డిఏ అధికారులతో మాట్లాడి పంపిస్తామన్నారు ఆ గ్రామానికి చెందిన ప్రజలందరూ సంతోషించారు రంగారెడ్డి జిల్లాలో ఎక్కడైనా రోడ్ల సమస్య డొంకల సమస్య ఉన్నట్లయితే బూర్గుల సుమనాగారి లాగా సహృదయంతో సమస్యలను పరిష్కరించుకోవాలని కెవిపిఎస్ గా కోరారు ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు దుబ్బ చెన్నయ్య ఎం అశోక్ సిఐటియు నాయకులు రాజు శ్రీను దళిత సంఘాల నాయకులు ఎస్ఎఫ్ఐ శ్రీకాంత్ టిడిపి మండల అధ్యక్షులు వెంకటేష్ గౌడ్ సరూర్నగర్ మండల వైస్ ఎంపీపీ మౌనిక హరి కృష్ణ గౌడ్ గ్రామస్తులు రామకృష్ణ శివకుమార్ నరసింహులు సురేషు సాయి శంకర్. శ్రీహరి శివ అనిలు ఆకాష్. వెంకటేష్ తదితరులు పాల్గొని ఆ గ్రామానికి చెందిన దళితులకి భరోసాని ఇచ్చారు...

### తులాభారంలో శక్తిపీఠం

# స్వామీజీ జన్మదిన వేడుకలు





**నారాయణపేట ఆగస్టు 5 (స్కై న్యూస్):**శక్తి పీఠం ఆధ్వర్యములో ఘనంగా అన్నపూర్ణేశ్వరి నిత్యాన్నదాన సత్రం 5వ వార్షికోత్సవం, స్వామీజీ 46వ జన్మదిన వేడుకలు తులాభారంలో ఘనంగా నిర్వహించారు.స్థానిక శక్తి పీఠం శ్రీ సంత్ మఠ మూల మహా సంస్థానంలో అత్యంత వైభవంగా స్వామీజీ 46వ జన్మదినోత్సవ వేడుకలు భక్తుల మధ్య ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో శక్తి పీఠం వ్యవస్థాపకులు పూజ్యశ్రీ డా.స్వామి శాంతానంద పురోహిత్ జన్మదినోత్సవ సందర్భంగా బెల్లం,బియ్యంతో తులాభార కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అన్నపూర్ణేశ్వరి నిత్యాన్నదాన సత్రం 5వ వార్షికోత్సవం సందర్భంగా అన్నపూర్ణేశ్వరి నిత్యాన్నదాన సత్రం సేవకులను సైతం ఘనంగా సన్మానించారు. అనంతరం శక్తిపీఠం వ్యవస్థాపకులు పూజ్యశ్రీ డా. స్వామి శాంతానంద పురోహిత్ భక్తులను ఉద్దేశించి అనుగ్రహ భాషణం చేశారు. ఈ కార్యక్రమంలో శక్తి పీఠం ట్రస్ట్ సభ్యులు, శక్తి పీఠం కుటుంబ సభ్యులు, శ్రేయోభిలాషులు, భక్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీ ఆంజనేయ స్వామి ఆశీస్సులు అందరిపై ఉండాలి

**మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్**

**శ్రీ శివమారుతి దేవాలయంలో ఘనంగా శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట మహోత్సవం**

**షాద్నగర్ 5(స్కైన్యూస్):**శ్రీ ఆంజనేయ స్వామి ఆశీస్సులు, అనుగ్రహం ప్రజలందరిపై ఉండాలని మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ ఆకాంక్షించారు. మంగళవారం షాద్ నగర్ మున్సిపాలిటీలోని శ్రీ శివ మారుతి గీతా అయ్యప్ప మందిరంలో నూతనంగా ప్రతిష్టించిన శ్రీ ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ట పూజ కార్యక్రమంలో ఆయన పాల్గొని పూజలు చేసిన అనంతరం మాట్లాడారు. శ్రావణమాసంలో స్వామి వారి విగ్రహ ప్రతిష్ట చేయడం శుభ సూచకమని, ఆధ్యాత్మిక కార్యక్రమాలలో భాగంగా భగవంతుని స్మరించుకోవడం సంతోషకరమని ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. స్వామి వారి కృప దయతో పాడిపంటలు పుష్కలంగా పండాలని, షాద్ నగర్ ప్రాంతంలో వ్యాపార రంగం ఘణనీయంగా అభివృద్ధి చెందాలని స్వామివారిని వేడుకున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు నటరాజ్, నాయకులు లక్ష్మణ్ నాయక్, రంగయ్య గౌడ్, ఒగ్గు కిషోర్, పాపయ్య యాదవ్, యాదయ్య తదితరులు, ఆలయ చైర్మన్ లష్కర్ ఆంజనేయులు, పలువురు భక్తులు పాల్గొన్నారు.

# ఆస్పిరేషన్ జిల్లా నుండి ఇన్స్పిరేషన్ జిల్లాగా మారాలి

**జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**





**కొత్తగూడెం ఆగస్టు 4 (స్కై న్యూస్ ):**జిల్లా ఆస్పిరేషన్ జిల్లాగా కాకుండా దేశానికే ఆదర్శంగా నిలిచే ఇన్స్పిరేషన్ జిల్లాగా రూపాంతరం చెందాలనే లక్ష్యంతో ప్రతి శాఖ సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ బాటిల్ సూచించారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయంలో నిర్వహించిన సంపూర్ణత అభియాన్ సమ్మాన్ సమారోహ్ జిల్లా స్థాయి అవార్డుల ప్రదానోత్సవ కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా ప్లానింగ్ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి జిల్లా ప్రణాళిక అధికారి (సిపిఓ) సంజీవరావు అధ్యక్షత వహించగా, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యాచందన తో కలిసి కలెక్టర్ జ్యోతి ప్రజ్వలనతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం సిపిఓ సంజీవరావు మాట్లాడుతూ ఆకాంక్షిత జిల్లాల అభివృద్ధి లో భాగంగా జిల్లాలో వివిధ శాఖలు చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించేందుకు విశేష కృషి చేస్తున్న కలెక్టర్ ను అధికారులు సన్మానించారు అనంతరం, కలెక్టర్ మాట్లాడుతూ ఆస్పిరేషనల్ డిస్ట్రిక్ట్‌గా గుర్తింపు పొందిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రాష్ట్ర స్థాయిలో అగ్రస్థానంలో నిలవడం గర్వకారణమని అన్నారు.కేంద్ర ప్రభుత్వం నీతి అయోగ్ సంయుక్తంగా వెనుకబడిన జిల్లాల అభివృద్ధి చేయడమే లక్ష్యంగా చేపట్టిన ఆస్పిరేషనల్ డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్ ద్వారా జిల్లాలో అనేక రంగాల్లో విస్తృతంగా అభివృద్ధి కార్యక్రమాలు అమలవుతున్నాయని, ప్రతి ఉద్యోగి సమర్థంగా పనిచేయడంతోనే జిల్లా ఈ స్థాయికి చేరుకుందని కలెక్టర్ తెలిపారు. సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా అన్ని విభాగాల సమన్వయంతో కార్యాచరణ చేపడుతున్నామని, దీని ద్వారా జిల్లా దేశవ్యాప్తంగా ఆదర్శ జిల్లాగా నిలవనుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇంకుడు గుంతలు తవ్వాలి అనే పిలుపుతో జిల్లాలో చేపట్టిన సామూహిక కార్యక్రమం గ్రామీణ ప్రాంతాల నుండి ప్రారంభమై జిల్లావ్యాప్తంగా విస్తరించి, దేశానికి ఆదర్శంగా నిలిచిందని అన్నారు.జిల్లా వ్యాప్తంగా పిల్లలలో పోషకాహార లోపం, ఎనీమియా వంటి సమస్యలను ఎదుర్కొనేందుకు వివిధ చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మునగాకు వంటివి ఆహారంలో చేర్చడం ద్వారా ఎనీమియా రాకుండా నియంత్రించవచ్చని వివరించారు. వైద్య, మహిళా శిశు సంక్షేమ శాఖల సమన్వయంతో జిల్లాలో అవసరమైన శిక్షణా తరగతులు నిర్వహించి ఆహారపు అలవాట్లను మెరుగుపరిచేలా చర్యలు తీసుకోవాలన్నారు.విద్యా రంగాన్ని మరింత బలోపేతం చేయడానికి స్మార్ట్ అంగన్వాడీలు, డిజిటల్ తరగతులు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ టెక్నాలజీ వంటివి ఉపయోగపడుతున్నాయని, సిడిపిఓ, సూపర్వైజర్లు అంగన్వాడీ టీచర్లు సమన్వయంతో అంగన్వాడీ కేంద్రాలను అభివృద్ధి పరచడానికి ప్రణాళికలు రూపొందించాలన్నారు. రేగళ్ల అంగన్వాడీ కేంద్రంలో గతంలో చీకటి, ఉక్క పోత వల్ల పిల్లలు రావడం తగ్గిపోయిందని, ఇప్పుడు విద్యుత్, ఫ్యాన్ వంటివి ఏర్పాటు చేయడం వల్ల పిల్లల హాజరు పెరిగిందని వివరించారు.జిల్లా వ్యాప్తంగా ప్రతి అంగన్వాడీ కేంద్రం ప్రతి పాఠశాలలో విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించేందుకు ఉన్నటువంటి సమస్యలు వాటి పరిష్కారాలను నివేదికల సమర్పించడం ద్వారా ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామని అన్నారు. దీని ద్వారా విద్యారంగంలో అత్యుత్తమ ఫలితాలను సాధించవచ్చు అని కలెక్టర్ తెలిపారు.జిల్లాను అభివృద్ధి పథంలో నడిపించేందుకు ప్రతి శాఖలో ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పనిచేసే సిబ్బందితో సమన్వయంగా ముందుకు సాగాలని, ప్రతి కార్యక్రమాన్ని లక్ష్య ప్రాతిపదికన అమలు చేయాలని సూచించారు. భవిష్యత్తులో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పేరు దేశవ్యాప్తంగా ఆదర్శ అభివృద్ధి జిల్లాగా వినిపించేలా ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను నిబద్ధతతో నిర్వర్తించాలని పిలుపునిచ్చారు.ఈ సందర్భంగా జిల్లాలో ఆకాంక్షిత అభివృద్ధి లక్ష్యాల్లో విశేష కృషి చేసిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, సిపిఓ సంజీవరావు,జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, జిల్లా వైద్య శాఖ అధికారి జయలక్ష్మి, మహిళా శిశు సంక్షేమ వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారిని స్వర్ణలత లేనినా, జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర చారి ( రిటైర్డ్) ఉద్యోగులకు, సిబ్బందికి 133 మందికి మెడల్స్, ప్రశంసాపత్రాలు, మెమెంటోలు జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ చేతుల మీదుగా ప్రదానం చేశారు. వారి సేవలను గుర్తించి మెచ్చుకోవడం ద్వారా మరింత ఉత్సాహంతో సేవలందించేందుకు ప్రతి ఉద్యోగి ముందుకు రావాలని ఆయన ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో విద్య, వైద్య, మహిళా శిశు సంక్షేమ ప్రణాళిక శాఖ తదితరులు శాఖల ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కాళేశ్వరంపై తప్పుడు ప్రచారాలు మానుకోవాలి

**ఉద్యమ పార్టీని వీడేది లేదు.**

**మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి.**



**నాగర్ కర్నూల్ ఆగస్టు 5( స్కైన్యూస్)** ఆత్మాభిమానం కోసం తెగించి పోరాడి తెలంగాణను సాధించుకున్న మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో తెలంగాణను సస్యశ్యామలం చేసేందుకు కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేసి ప్రపంచం దృష్టిని సాధిస్తే ఇటీవల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం టీవీ సీరియల్ లగా ఉద్యమ నేతపై ఉద్యమ పార్టీపై విమర్శలు చేస్తున్నారని వాటిని క్షేత్రస్థాయిలో ఎండగట్టాలని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్ రెడ్డి అన్నారు మంగళవారం మాజీ సాగునీటి ప్రాజెక్టుల శాఖ మంత్రి హరీష్ రావు హైదరాబాదు పార్టీ కార్యాలయం నుండి నిర్వహించిన వీడియో ప్రజెంటేషన్ కార్యక్రమాన్ని నాయకులు కార్యకర్తలతో కలిసి జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో వీక్షించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమైక్య రాష్ట్రంలో అడ్డగోలుగా తెలంగాణ నీటి హక్కును కాలరాస్తూ సమైక్య పాలకులు ప్రాజెక్టులు నిర్మిస్తే రాష్ట్రం ఏర్పడిన తర్వాత కేసీఆర్ నాయకత్వంలో రాష్ట్రాన్ని సస్యశ్యామలం చేసేందుకు కాళేశ్వరం ను పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం సుమారు రెండు సంవత్సరాల పాలనలో గాలి మోటార్లలో తిరుగుతూ గాలి హామీలు ఇవ్వడమే తప్ప ఒక్క ప్రాజెక్టును కూడా పూర్తి చేయలేదని ఇచ్చిన హామీలను కూడా 100% అమలు చేయలేదని విమర్శించారు. రేవంత్ రెడ్డి సోషల్ మీడియాను వేదికగా చేసుకుని అబద్ధపు హామీలను గుప్పించి అధికారంలోకి వచ్చి రాజకీయ కక్ష సాధింపులు చేపడుతున్నారని మండిపడ్డారు. పోలవరం ప్రాజెక్టు మూడుసార్లు కూలితే ఒక్కసారి కూడా ఎన్ డిఎస్ఏ రిపోర్టు లేదని ఇంత పెద్ద కాళేశ్వరం మేడిగడ్డ బ్యారేజీ లో రెండు పిల్లర్లు పొంగితే రిపేరు చేసే వెసులుబాటు ఉన్నప్పటికీ దానిని కూడా రాజకీయ లబ్ది కోసం పనులు చేయకుండా విమర్శలు చేస్తూ స్థానిక ఎన్నికల సమయంలో రాద్ధాంతం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పాలనలో సంక్షేమం విస్మరించి టీవీ సీరియల్ లా కాలయాపన చేస్తున్నారని మొన్నటి వరకు ఫార్ములా 1 కేసు అన్నారు నిన్న ఫోన్ టాపిక్ అన్నారు ఇందులో ఏమీ చేయలేకపోయేసరికి కాళేశ్వరం మీద పడ్డారని ఆరోపించారు ఈ కార్యక్రమంలో కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ కొల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్ రెడ్డి పార్టీ సీనియర్ నాయకులు అర్థం రవి తోపాటు వివిధ నియోజకవర్గాల ముఖ్య నేతలు పాల్గొన్నారు

# చజాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయాలి

**జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్**



**కొత్తగూడెం ఆగస్టు 4 (స్కై న్యూస్ ):**జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఐడిఓసి కార్యాలయం సమావేశ మందిరంలో ఈ నెల 11వ తేదీన నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవం రోజున 1 నుండి 19 సంవత్సరాల వయసు గల వారందరికీ నులిపురుగులను నివారించే ఆల్బెండజోల్ మాత్రలను అందించాలన్నారు. ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ గిరిజన ఆశ్రమ పాఠశాలలు వసతి గృహాలలో ప్రతి విద్యార్థులకు మాత్రలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ మాత్రల ద్వారా పిల్లల్లో రక్తహీనత, బుద్ధిమధ్యం, చదువుల పట్ల ఏకాగ్రత పెంపొందుతుందన్నారు. విద్యాశాఖ, ఏఎన్ఎం, అంగన్వాడీలు సమన్వయంగా పనిచేసే ఈ ఒక్కరిని విడిచిపెట్టకుండా మాత్రలను అందివ్వాలి అన్నారు. ప్రభుత్వ,ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు, అంగన్వాడి పిల్లలకు మాత్రలు అందించాలన్నారు. అంగన్వాడి టీచర్లకు శిక్షణ ఇచ్చి వయసుల వారీగా మాత్రల డోస్ ఇవ్వాలన్నారు. భోజనం తర్వాతనే ఆల్బెండజోల్ మాత్రలు వేయించాలన్నారు. పాత్రలు వేసే ప్రదేశంలో తగినంత త్రాగునీరు అందుబాటులో ఉంచుకోవాలన్నారు.జిల్లాలో 3,36,136 మంది ఒకటి నుంచి 19 సంవత్సరాల వయసు గల వారు ఉన్నారని ఆయన తెలిపారు. వారి అందరికీ మాత్రలు అందించాలని తెలిపారు. ప్రత్యేక షెడ్యూల్ ని ఏర్పరచుకొని నులిపురుగుల నిర్మూలన మాత్రలు అందివ్వాలి అన్నారు. ప్రజలకు అర్బెండజోల్ మాత్రల ఉపయోగాలపై కళా జాతర బృందాలు మహిళా సమాఖ్యల ద్వారా విస్తృత అవగాహన కల్పించి, పిల్లలందరూ మాత్రలు తీసుకునేలా ప్రోత్సహించాలన్నారు. 11వ తేదీన మాత్రలు తీసుకొని వారికి 18వ తేదీన మాప్ ఆఫ్ డే నిర్వహించి మాత్రలు అందించాలన్నారు. ప్రైవేటు విద్యాసంస్థలు అన్ని విద్యార్థులకు మాత్రలు అందేలా చూడాలని, అనంతరం నివేదికలు సమర్పించాలని అన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేసి నులిపురుగుల నిర్మూలలకు కృషి చేయాలని కలెక్టర్ అన్నారు.ఈ సమావేశంలో జిల్లా వైద్య శాఖ అధికారి జయలక్ష్మి, సిపిఓ సంజీవరావు, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారి స్వర్ణలత లెనినా, డాక్టర్ తేజశ్రీ, డాక్టర్ స్పందన, డాక్టర్ మధురం, డాక్టర్ భూపాల్ రెడ్డి, ఎండి ఫయాజుద్దీన్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నేటి నుంచి శ్రీ స్వామికి శ్రావణ మాస పవిత్ర ఉత్సవాలు

**చిన్న చింతపండు ఆగస్ట్ 5 (స్కై న్యూస్ )**బీతెలంగాణ ప్రజల ఆరాధ్య దైవం కొలిచిన వారికి కొంగు బంగారం అయినా శ్రీ కురుమూర్తి స్వామి చిన్న చింతకుంట మండల పరిధిలోని అమ్మాపూర్ గ్రామ సమీపంలో ఏడుకొండల మధ్య కాంచన గృహాలు స్వయంభుగా వెలిసిన శ్రీ కురుమూర్తి స్వామి సన్నిధిలో బుధవారం సాయంత్రం నాలుగు గంటల నుంచి మూడు రోజులపాటు శ్రావణమాసం పురస్కరించుకొని శ్రీ స్వామివారికి పవిత్ర మహోత్సవాలు ఆలయ చైర్మన్ గోవర్ధన్ రెడ్డి, ఈవో మదినేశ్వర్ రెడ్డి సమక్షంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. ఈ ఉత్సవాల్లో స్వామి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామిని స్మరించాలని వారు కోరారు. స్వామి దర్శనానికి వచ్చిన భక్తులకు ఆలయ పాలకమండలి, ఆలయ సిబ్బంది ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారని వారు తెలిపారు.



VaarthaTarangalu Printed Published Edited and Owned by K.A.Vijayaraju Printed at SR Publications,Amberpet,Hyderabad. Published from PRME Home.Old Bus Stand Road Mahabubnagar - 509001 ,Editor K.A.Vijayaraju Ph.08542-222208 ,Website: www.vaarthatarangalu.com,Email: vtarangalu_222208@rediffmail.com,RNI.NO:APTEL 2004/14137